


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




వరంగల్ | 20-08-2026 గురువారం | సంపుటి : 11 | సంచిక : 252 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur
Follow us on

## మహిళా అధికారికి 'శాశ్వత కమిషన్' నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఎఎంఎస్) :**

భారత కోస్ట్ గార్డ్ లో సుదీర్ఘకాలం సేవలందించిన ఒక మహిళా అధికారికి శాశ్వత కమిషన్ మంజూరు చేయకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మహిళా అధికారుల పట్ల ఇలాంటి వివక్షను, అవమానాలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

రెండు వారాల గడువు..లేదంటే కోర్టు ఆదేశాలే:
షార్ట్ సర్వీస్ కమిషన్ కింద 14 ఏళ్లకు పైగా సేవలందించిన ప్రియాంక త్యాగి అనే అధికారిణికి శాశ్వత కమిషన్ ఇచ్చే అంశంపై రెండు వారాల్లోగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఐసీజీని ఆదేశించింది. ఒకవేళ ఐసీజీ స్పందించకపోతే, కోర్టే స్వయంగా ఉత్తర్వులు జారీ చేస్తుందని హెచ్చరించింది.
ప్రియాంక త్యాగిని సర్వీస్ నుంచి తొలగించాలనే ఐసీజీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆమె గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు బుధవారం ఆమె అండమాన్ నికోబార్ యూనిట్‌లో తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అయితే, శాశ్వత కమిషన్‌పై ఐసీజీ ఇటీవల విడుదల చేసిన నూతన విధానం చాలా అస్పష్టంగా, ఏకపక్షంగా ఉందని ఆమె తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అపార అనుభవం ఉన్న అధికారిణి: రక్షణ దళాల్లో రికార్డు: తూర్పు సముద్ర తీరంలో గస్తీ కాసే డోర్నియర్ విమాన తొలి మహిళా బృందానికి ప్రియాంక త్యాగి నాయకత్వం వహించారు.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు నిజం కాదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఎఎంఎస్) :**



అరుణాచల్ ప్రదేశ్‌లోని లాంగ్జు సరిహద్దు ప్రాంతంలో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (PLA) చొరబాట్లకు పాల్పడి, సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందంటూ వస్తున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా ఖండించారు. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందనే వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.

**వాస్తవాధీన రేఖ వద్ద గస్తీ తీవ్రతరం:** భారత సరిహద్దుల్లో మన దళాలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (LAC) వద్ద భారత సైన్యంతో పాటు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ITBP) బలగాలు గస్తీని గణనీయంగా పెంచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనా నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం 1959లోనే ఆ దేశం ఆక్రమించుకున్న పరిధిలోకి వస్తుందని, కొత్తగా మన గ్రామాలను లేదా భూభాగాన్ని ఆక్రమించలేదని వివరించారు.

**సైనిక మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దు:** లాంగ్జు ప్రాంతంలో సరిహద్దులపై స్పష్టమైన గుర్తింపు లేకపోవడం వల్లే అది చాలా కాలంగా వివాదాస్పదంగా ఉందన్నారు. ఆ సరిహద్దు పాయింట్ వద్ద భారత భద్రతా పోస్ట్ కూడా ఉందని చెప్పారు. ఆధారాల్లేని తప్పుడు వార్తలను ప్రచారం చేయడం వల్ల రాత్రింబవళ్లు సరిహద్దుల్లో కాపలా కాస్తున్న మన సైనికులు, భద్రతా బలగాల మనోధైర్యం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

**ప్రతి రైతుకూ సకాలంలో రుణం అందాలి**
**రుణంతో పాటు రైతు ఆదాయమూ పెరగాలి**
**క్యూర్, ప్యూర్, రేర్ అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు**
**ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**హైదరాబాద్, ఆగస్టు 19 (వుదయం) :**




తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదు.. తెలంగాణ ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే బ్యాంకింగ్ రంగం కూడా రూపాంతరం చెందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.
బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడింది అన్నదే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.
తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయ రంగం పునాది అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు రుణాలు అవసరమయ్యే సమయంలోనే అందించాలని ఆయన చెప్పారు. అర్హత ఉన్న రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.
రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని అన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి ₹52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమే అయినప్పటికీ, రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని ఆయన గుర్తుచేశారు.
తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా (MSME) రంగం కీలకమని అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో డబ్బు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (CGTMSE) కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. CGTMSE కింద మంజూరు చేసే రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు.
తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క అన్నారు. క్యూర్ లో AI, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమని ఆయన తెలిపారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు.

## విషాదాలే నన్ను రాజకీయాల్లోకి లాగాయి



**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఎఎంఎస్) :**

కాంగ్రెస్ అగ్రనాయకురాలు, దశాబ్దాల కాలంగా భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సోనియాగాంధీ తన వ్యక్తిగత జీవిత విశేషాలను తొలిసారి ఆత్మకథ రూపంలో పంచుకోనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' (Belonging: A Journey of Love) పేరిట ఆమె రాసిన ఆత్మకథ పుస్తకం నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ సందర్భంగా ప్రచురణకర్త 'ఆల్‌ఫ్రెడ్' సోనియాగాంధీ వ్యాఖ్యలను గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి రాక.. వ్యక్తిగత క్షోభ: తాను అనూహ్య పరిస్థితుల్లోనే రాజకీయ అరంగేట్రం చేయాల్సి వచ్చిందని సోనియా పేర్కొన్నారు. మొదట్లో ప్రజాజీవితానికి పూర్తిగా దూరంగా ఉండాలని భావించినప్పటికీ, జీవితంలో చోటుచేసుకున్న హృదయ విదారక ఘటనలు, ఎదురైన తీవ్ర నష్టాలే తనను రాజకీయాల వైపు నడిపించాయని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ పుస్తకం రాయడం, మనసు లోతుల్లో ఉన్న చేదు, తీపి అనుభవాలను మళ్లీ తలచుకోవడం అంత తేలికగా జరగలేదని, తన జీవితంలో ఎదురైన ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ ఆత్మకథ అని సోనియా వెల్లడించారు.

## భూ బాధితులకు ఉచిత న్యాయ సహాయం!

**హైదరాబాద్, ఆగస్టు 19 (వుదయం) :**



రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆస్తులను 22A నిషేధిత జాబితాలో చేర్చడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బాధితులు తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావును కలిసి తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా హరీశ్‌రావు భరోసానిచ్చారు. బాధితులకు భరోసా.. లీగల్ సెల్ ఏర్పాటు: 22A జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## జారుతున్న ఇరాన్ పట్టు

**టెహ్రాన్ :** పశ్చిమాసియా యుద్ధంలో అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' పై ఆధిపత్య పోరు తీవ్ర రూపం దాల్చింది. ఈ నౌకా రవాణా మార్గంపై నియంత్రణ తమదేనని ఇరాన్, అమెరికాలు వాదోపవాదాలకు దిగుతున్నాయి. కాగా, ఈ జలసంధిపై ఇరాన్ క్రమంగా తన పట్టు కోల్పోతోందని, 'హర్మూజ్ ఇక తమ భూభాగమే' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఒమన్ మార్గం వైపే మొగ్గుచూపుతున్న నౌకలు: ప్రస్తుతం హర్మూజ్ జలసంధి గుండా రెండు ప్రధాన మార్గాల్లో నౌకలు ప్రయాణిస్తున్నాయి. ఒకటి ఇరాన్ నిర్దేశించిన రూట్ కాగా, రెండోది ఐరాస ఆమోదించిన ఒమన్ ఉత్తర తీరం మీదుగా వెళ్లే అమెరికా మద్దతుతో మార్గం. ఇరాన్ దాడుల హెచ్చరికలు ఉన్నప్పటికీ, మెజారిటీ నౌకలు ఒమన్ మార్గాన్నే ఎంచుకుంటున్నాయి.

## ఇంతే కదా...!




## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- కత్తితో 27 సార్లు పొడిచి చంపిన పదో తరగతి విద్యార్థి!
- దొంగతనానికి వెళ్లి హత్య చేసిన మైనర్లు
- విలాసాలకు అలవాటుపడి విద్యార్థుల ఘాతుకం!

**నల్గొండ, ఆగస్టు 19 (వుదయం) :**



కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్య కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. జల్సాలకు అలవాటుపడి చోరీకి యత్నించిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతకానికి ఒడిగట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను పూర్తి స్థాయిలో పంచుకున్నారు.

**చోరీ ప్లాన్ నుంచి హత్య వరకు..**
బాధితురాలు రూపారెడ్డి ఇంట్లో స్కూల్ ఫీజుల నగదు ఉంటుందని భావించిన నిందితులు ఐదు రోజుల ముందే దొంగతనానికి పథకం రచించారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి, పక్కా సమయం చూసుకుని ఈనెల 11న ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. ఒక విద్యార్థి మాస్క్ ధరించి గోడ దూకి లోపలికి ప్రవేశించగా, అనుకోకుండా మాస్క్ ఊడిపోవడంతో ప్రిన్సిపల్ అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన సదరు విద్యార్థి తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై 27 సార్లు దారుణంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. అనంతరం అక్కడి నుంచి రూ.1.54 లక్షల నగదు, ఫోన్లతో పరారయ్యారు.

**కేసు ఛేదనలో కీలక ఆధారాలు:**
**ప్రత్యేక బృందాలు:** హత్యపై ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిన పోలీసులు, పాత నేరస్థులు మరియు సైకోల కోణంలోనూ విచారించారు. సీసీ టీవీ దృశ్యాలు: సంఘటనా స్థలం సమీపంలోని 70 సీసీ కెమెరాలను పరిశీలించి అనుమానితుల కదలికలను గుర్తించారు. 'బాబు' అనే పదం: మరణించే ముందు రూపారెడ్డి పిన్నితో మాట్లాడే సమయంలో 'బాబు' అని అనడం గమనించిన పోలీసులు, ఆ దిశగా స్కూల్ విద్యార్థులపై దృష్టి సారించారు.
**హాజరు ఆధారంగా:** స్కూల్ రీఓపెన్ అయ్యాక గైర్హాజరైన 13 మంది విద్యార్థుల జాబితా తీయగా, అందులో ఐదుగురు పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. కొద్దిరోజులుగా జల్సాలు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.
**కక్షకు కారణం అదే:**
నిందితుల్లో ఒకడు గతంలో అదే పాఠశాల హాస్టల్‌లో ఉండేవాడు. బ్యాగ్‌లో డబ్బు, ఫోన్ దొరకడంతో తల్లిదండ్రుల సమక్షంలో ప్రిన్సిపల్ మందలించి డేస్కాలర్‌గా మార్చారు. నాటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఆల్కహాల్, బైక్‌ల వ్యామోహం ఉన్న నిందితుడు గోవా టూర్ వెళ్లొచ్చాక సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ దొంగతనానికి పాల్పడ్డాడు. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల రక్తపు మరకలున్న నగదు, ఐఫోన్, ప్రిన్సిపల్ మొబైల్ స్వాధీనం చేసుకున్నామని, నిందితులు మైనర్లు కావడం వల్ల జువైనల్ జస్టిస్ బోర్డుకు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు.



# ఘనంగా187 ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**కోహీర్, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)**



కోహీర్ మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్లు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.
మండలంలోని ఆయా గ్రామాల ఫొటోగ్రాఫర్లు కోహీర్ లోని ప్రభుత్వ పాఠశాలలో జెండా ఎగురవేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ఒకరిని ఒకరు ఘనంగా సన్మానించుకున్నారు.ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ — "ఒక జ్ఞాపకాన్ని లేదా సందర్భాన్ని జీవితాంతం పదిలంగా దాచుకునేలా చేసే అద్భుతమైన మాధ్యమమే ఫొటోగ్రఫీ" అని పేర్కొన్నారు.1839లో ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ డాగ్యురే అభివృద్ధి చేసిన 'డాగ్యురోటైప్' అనే ఫొటోగ్రాఫిక్ ప్రక్రియ ఆధారంగా ఈ రోజు ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు.ఫ్రెంచ్ ప్రభుత్వం ఈ సాంకేతికత పేటెంట్‌ను కొనుగోలు చేసి, 1839 ఆగస్టు 19న ప్రపంచానికి ఉచిత కానుకగా ప్రకటిస్తూ అధికారికంగా పరిచయం చేసిందని గుర్తుచేశారు. "వెయ్యి పదాలు చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటో స్పష్టంగా చెప్పగలదు" అనే నానుడి ఈ కళ ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. కాలక్రమేణా బ్లాక్ అండ్ వైట్ ఫొటోల నుండి కలర్, ఫిలిం కెమెరాల ద్వారా నేటి అత్యాధునిక డిజిటల్ మరియు మిర్రర్‌లెస్ కెమెరాల వరకు ఎంతో సాంకేతిక మార్పు వచ్చిందన్నారు. వైల్డ్‌లైఫ్, పోర్ట్రెయిట్, ల్యాండ్‌స్కేప్, స్ట్రీట్, ఫ్యాషన్, మరియు జర్నలిజం వంటి అనేక విభాగాలు నేడు అభివృద్ధి చెందాయి. ప్రమాదకరమైన పరిస్థితుల్లో, యుద్ధ క్షేత్రాల్లో మరియు అడవుల్లో సైతం ప్రాణాలను పణంగా పెట్టి అరుదైన చిత్రాలను కెమెరాలో బంధించే ఫొటోగ్రాఫర్ల కృషి అభినందనీయమని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రకృతి అందాలను, ఆకలిబాధలను ప్రపంచం దృష్టికి తీసుకురావడంలో ఫొటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తమ కెమెరా కంటితో ప్రపంచంలోని అందాలను, భావోద్వేగాలను బంధిస్తున్న ఫొటోగ్రాఫర్లందరికీ ఈ సందర్భంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమం అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు . ఉపాధ్యాయులు.కోహీర్ మండలం ఫొటో గ్రాఫి యూనియన్ ప్రెసిడెంట్ రాచ్చన్న. మాజీ ప్రెసిడెంట్ శ్యామ్ రావు. రాంచేందర్. సోషల్ మీడియా నిర్వాకులు అశోక్. రాజన్న.కృష్ణ జాకిర్. అంజి. క్రాంతికిరణ్. ప్రవీణ్ ఆయా గ్రామాల ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ ఒడిలో దూకిన యువతికి ప్రాణదానం

- **గజ ఈతగాళ్ల సాహసం.. ఇటిక్యాల ఎస్సై రవి చొరవతో తప్పిన ప్రాణాపాయం**

**ఎర్రవల్లి ఆగస్టు 19 (వుదయం కరస్పాండెంట్)**



కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ యువతి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే స్థానిక గజ ఈతగాళ్లు సకాలంలో స్పందించి సాహసోపేతంగా గాలింపు చేపట్టడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. యువతి నదిలో దూకిన సమాచారం అందుకున్న వెంటనే గజ ఈతగాళ్లు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నదిలోకి దిగి గాలింపు చేపట్టారు. స్థానికుల సమాచారంతో ఇటిక్యాల ఎస్సై రవి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈతగాళ్లు నదిలో గాలించి యువతిని గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.అనంతరం యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించి ధైర్యం చెప్పారు. సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన గజ ఈతగాళ్లు, ఎస్సై రవి చొరవను స్థానికులు అభినందించారు. క్షణికావేశంలో నిర్ణయం వద్దు కుటుంబ సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులతో కుంగిపోయిన సమయంలో ఆత్మహత్యకు పాల్పడవద్దని పోలీసులు సూచించారు. సమస్యలను కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులతో పంచుకుని పరిష్కారం కోసం ప్రయత్నించాలని కోరారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం జీవితాన్నే ప్రమాదంలోకి నెడుతుందని, ఎంతటి సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

# విద్యార్థుల సులభ అభ్యాసానికి 'మై స్లేట్'

**హత్నూర వుదయం ప్రతినిధి:**




విద్యార్థుల సులభ అభ్యాసానికి ఉపయోగపడే వినూత్నమైన 'మై స్లేట్'ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా 'మై స్లేట్' రూపకర్త, హత్నూర నాగారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేటీ నాయక్ కలెక్టర్‌ను కలిసి స్లేట్ ప్రత్యేకతలను వివరించారు. బాల్య విద్య అధ్యయనంలో భాగంగా విద్యార్థుల అభ్యాస అవసరాలను సులభంగా తీర్చేందుకు 'మై స్లేట్' ఉపయోగపడుతుందని కేటీ నాయక్ తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు దీని గురించి అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం మద్దతు ఇవ్వాలని కోరారు. డిజిటల్ స్లేట్ రూపకల్పనకు కూడా కృషి చేస్తున్నట్లు కేటీ నాయక్ తెలిపారు.'మై స్లేట్' ప్రయత్నం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతి చిన్నారికి అందుబాటు ధరలో ఈ స్లేట్ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, బి.అశోక్, కె.మహేందర్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి: విద్యార్థుల సులభ అభ్యాసానికి ఉపయోగపడే వినూత్నమైన 'మై స్లేట్'ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా 'మై స్లేట్' రూపకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేటీ నాయక్ కలెక్టర్‌ను కలిసి స్లేట్ ప్రత్యేకతలను వివరించారు. బాల్య విద్య అధ్యయనంలో భాగంగా విద్యార్థుల అభ్యాస అవసరాలను సులభంగా తీర్చేందుకు 'మై స్లేట్' ఉపయోగపడుతుందని కేటీ నాయక్ తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు దీని గురించి అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మీడియల్ టీచింగ్‌లో 'మై స్లేట్'ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. 'మై స్లేట్'ను జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకురావాలని కేటీ నాయక్ కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్, విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉండేలా 'మై స్లేట్'ను డిజిటల్ మోడ్‌లో కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డిజిటల్ స్లేట్ రూపకల్పనకు కూడా కృషి చేస్తున్నట్లు కేటీ నాయక్ తెలిపారు.'మై స్లేట్' ప్రయత్నం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతి చిన్నారికి అందుబాటు ధరలో ఈ స్లేట్ చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, బి.అశోక్, కె.మహేందర్ పాల్గొన్నారు.

# నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

**కొడంగల్ వికారాబాద్ డిస్ట్రిక్ (వుదయం):**



కొడంగల్ మండలం అప్పాయి పల్లి గ్రామంలో నూతన గ్రామంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి సర్పంచ్ బొడ్డాయి వెంకటయ్య కు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో కొడంగల్ మున్సిపాలిటీ చైర్మన్ నందారం ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ సంజీవరెడ్డి గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్ గౌడ్ బాల్ రెడ్డి ఆనంద్ రెడ్డి పలు గ్రామాల సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఉప సర్పంచ్ పవిత్ర వార్డ్ మెంబర్ లు శ్యామా గోకుల్ సింగ్ బందయ్య గౌడ్ రాములు దీపక్‌సింగ్ రాంజీనాయక్ గ్రామసంగప్ప నాయకులు దత్తు సింగ్ కాశయ్య గౌడ్ బాలరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

**సిఐటియు మండల కార్యదర్శి మద్దెల అంజయ్య డిమాండ్**

**మిరుదొడ్డి, ఆగస్టు 19, వుదయం:**



గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెలా రూ.26 వేల వేతనం చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి మద్దెల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం గ్రామపంచాయతీ కార్మికులు రెండవ రోజు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధుల పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర కీలక పనులను గ్రామపంచాయతీ కార్మికులు నిరంతరం నిర్వహిస్తున్నప్పటికీ, వారి వేతనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా క్రమం తప్పకుండా రూ.26 వేల వేతనం చెల్లించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అంజయ్య కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం సిఐటియు ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు,కారోబార్ కమ్మరి కుమార్, సురేష్, ముత్తవ్వ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్ ఆయకట్టుకు నీళ్లివ్వాల్సిందే!

- **జూరాల లింక్ కెనాల్ నుంచి తక్షణమే నీటి విడుదల**
- **నెట్టెంపాడు 99, 106 ప్యాకేజీ పనులు వేగవంతం చేయాలి**
- **ఇటిక్యాల చివరి ఆయకట్టు గ్రామాలపై ప్రత్యేక దృష్టి**
- **నీటిపారుదల సీఈతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చరవాణిలో సంభాషణ**

**అలంపూర్ ఆగస్టు 19 (వుదయం కరస్పాండెంట్)**



అలంపూర్ నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధికారులను కోరారు. జూరాల లింక్ కెనాల్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని చెరువులు, కాలువలకు వెంటనే నీటిని విడుదల చేయాలని జిల్లా నీటిపారుదల శాఖ సీఈ రహీముద్దీన్‌తో చరవాణిలో మాట్లాడారు. రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితుల్లో నీటి విడుదలలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. జూరాల లింక్ కెనాల్ పరిధిలోని ఆయకట్టుకు నిరంతరాయంగా నీరు అందేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

**పెండింగ్ పనులు పూర్తిచేయాలి**

నెట్టెంపాడు ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న 99వ ప్యాకేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. పనులు పూర్తయితే ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చివరి ఆయకట్టుపై ప్రత్యేక దృష్టి 106వ ప్యాకేజీ పరిధిలోని చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. ముఖ్యంగా ఇటిక్యాల మండలంలోని గ్రామాలకు సాగునీరు అందేలా కాలువల నిర్వహణ, నీటి పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నీటి సరఫరాలో చివరి ఆయకట్టు రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అన్నారు. జూరాల లింక్ కెనాల్ పరిధిలో ఎక్కడా నీటి కొరత తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు పూర్తి భరోసా సాగునీటి విషయంలో రైతుల్లో ఎలాంటి ఆందోళన లేకుండా పూర్తి భరోసా కల్పించే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా నీటి విడుదలను పర్యవేక్షించాలని, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని జూరాల లింక్ కెనాల్, నెట్టెంపాడు ప్యాకేజీల పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చల్లా వెంకట్రామిరెడ్డి అధికారులను కోరారు.

# చిన్నారుల ప్రాణాలతో చెలగాటమా?

- **చిన్నపాటి వర్షానికే జలమయం.. దోమలకు ఆవాసంగా పాఠశాల పరిసరాలు**
- **ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు.. తల్లిదండ్రుల ఆగ్రహం**

**మానవపాడు ఆగస్టు 19 (వుదయం కరస్పాండెంట్)**



మండల కేంద్రంలోని దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటు వద్ద నెలకొన్న దుస్థితి విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల ప్రధాన గేటు ముందు వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోతోంది. మురుగునీరు రోజుల తరబడి నిలిచి దోమలకు నిలయంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వర్షం వస్తే చాలు.. గేటు వద్దే నీరు వర్షం కురిసిన ప్రతిసారీ ప్రధాన గేటు ముందు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు మురుగునీటిని దాటుకుంటూ పాఠశాలలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. దోమల బెడద.. అనారోగ్య భయం మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాఠశాల పరిసరాల్లోనే దోమల బెడద పెరిగితే చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఫిర్యాదులు చేసినా.. స్పందన ఏది? ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎంఈఓకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సమస్య తమ దృష్టికి తీసుకువచ్చినా చర్యలు తీసుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జిల్లా అధికారులు దృష్టి సారించాలి విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశంలో ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే పాఠశాలను పరిశీలించి, ప్రధాన గేటు వద్ద నీరు నిలిచిపోకుండా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు మురుగునీటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారులకు అనారోగ్యం ముప్పు ఏర్పడే వరకు అధికారులు వేచి చూడకుండా వెంటనే చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

- **ఫొటో,వీడియో గ్రాఫర్లతో ఆత్మీయ సమావేశంలో**
- **సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి ఆగస్టు 19 వుదయం ప్రతినిధి.**



కల్వకుర్తి పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చి నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.
ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి డివిజన్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ భవన్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, TASK C.O.O. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఫొటో, వీడియో గ్రాఫర్లకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఫొటోగ్రఫీ ఆవిర్భావం నుంచి నేటి ఆధునిక డిజిటల్ ఫొటోగ్రఫీ వరకు ఈ రంగం ఎన్నో మార్పులు, సాంకేతిక అభివృద్ధిని సాధించిందని గుర్తు చేశారు. ఒకప్పుడు ఒక జ్ఞాపకాన్ని ఫొటో రూపంలో భద్రపరచడమే ప్రధానంగా ఉన్న ఫొటోగ్రఫీ, నేడు ఆధునిక కెమెరా టెక్నాలజీ, వీడియో గ్రాఫీ, డ్రోన్ ఫొటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, ఫొటో-వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి అనేక విభాగాలతో విస్తరించిందన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం కెమెరా వినియోగంపై మాత్రమే కాకుండా ఆధునిక సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్, డిజైనింగ్, వీడియో ప్రొడక్షన్ తదితర నైపుణ్యాలపై పట్టు సాధించడం ఎంతో అవసరమని సూచించారు.ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫొటో, వీడియో గ్రాఫర్లకు త్వరలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కోర్సులో ఫొటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, కలర్ గ్రేడింగ్, సినిమాటోగ్రఫీ, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ తదితర ఆధునిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు,అంతేకాకుండా శిక్షణకు అవసరమైన అధునాతన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చి, నిపుణులైన శిక్షకుల ద్వారా ఫొటో, వీడియో గ్రాఫర్లకు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కేవలం సర్టిఫికెట్‌కు పరిమితం కాకుండా, వారి వృత్తిలో నేరుగా ఉపయోగపడేలా, ఉపాధి ఆదాయ అవకాశాలను మెరుగుపరుచుకునే విధంగా రూపొందించనున్నట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షు రంగినేని రవికుమార్,ఉపాధ్యక్షులు MD రియాజ్,ప్రధాన కార్యదర్శి నందు,కోశాధికారి వంశీ లతో పాటు వివిధ మండలాల అంధ్యక్షులు,ప్రతినిధులు,సభ్యులు, ఫొటోగ్రాఫర్లు,వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ వీరుడి

# జ్ఞాపకార్థకంగా సిమెంట్ బెంచిల వితరణ

**అచ్చంపేట,ఆగస్టు19: (వుదయంప్రతినిధి )**



తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల నాయకులు వర్గం అంజనేయులు యాదవ్ జ్ఞాపకార్థకంగా 80వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కారించుకోని సింగారం గ్రామంలో వివి ధ ప్రదేశాల్లో ఎనిమిది సిమెంట్ బెంచిలను ఆయన తమ్ముడు వర్గం తిరుపతియాదవ్ వితరణ చేశారు. అంజియాదవ్ తెలంగాణ సాధనలో అలుపెరుగకుండా పనిచేశారని తెలంగాణ సిద్దించాక గ్రామంలో బీఆర్ఎస్ అభివృద్ధికి గ్రామానికి నిధుల కేటాయింపులో సంక్షేమం, అభివృ ద్దిలో కీలకపాత్ర పోషించారని కుటుంబ కలహాలు ,సహచరితో విబేధాలు తోడై తీవ్ర మనస్తాపం చెంది చిన్న వయస్సులో తనువు చాలించి ప్రాణత్యాగం చేసుకున్నారని పలువురు గుర్తుచేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అంజి అమ్మ వర్గం నారమ్మ చెన్నారంసింగారం ఎంపీటీసీగా పని చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కంటెంట్ సర్పంచ్ బోడనారాయణ,గ్రామ బీఆర్ ఎస్ అధ్యక్షులు గండికోట శేఖర్, యువకులు బోల్లు శ్యాం సుందర్యా దవ్,కోట్ల మహేష్,ఉడుత నరేష్, ఉడుత మనోజ్,బెల్లి చంద్రు, నాయకులు కొండేమోని చంద్రయ్య, కోట్ల అంతయ్య,అభిమానులు బోల్లు తిరుపతయ్య,పానుగంటి బాలరాజు. పీట్ల అంజి పాల్గొన్నారు.

# ఫొటో వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



- **సబ్ కలెక్టర్ కు వినతి**

**నారాయణఖేడ్ ఆగస్ట్ 20(వుదయం)**

ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నారాయణఖేడ్ డివిజన్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతిపత్రం అందజేశారు.ఫొటో, వీడియో గ్రాఫర్ల సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సంఘ భవనం మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు మంగల్‌పెట్ భవానీమాత ఆలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారునికి

# రేషన్ బియ్యం ఇవ్వాలి



- **అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ**

**మహబూబ్ నగర్ ఆగస్టు 19(వుదయం ప్రతినిధి)**

జడ్చర్ల పట్టణంలోని మదీనా కాలనీలో గల చౌక ధర దుకాణాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్చర్ల తహశీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీతో కలిసి చౌక ధర దుకాణం నంబర్ 1423001ను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో బియ్యం నిల్వలు, పంపిణీ ప్రక్రియ, రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు.ఈ తనిఖీలో జడ్చర్ల తహశీల్దార్ నర్సింగరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీ తదితరులు పాల్గొన్నారు.

# బీచుపల్లి వద్ద రక్తమోడిన రహదారి

- **టవేరాను ఢీకొన్న వేగవంతమైన ఆటో.. 8 మందికి తీవ్ర గాయాలు**
- **రెండేళ్ల చిన్నారి పరిస్థితి విషమం.. గద్వాల ఆసుపత్రికి తరలింపు**

**ఎర్రవల్లి ఆగస్టు 19 (వుదయం కరస్పాండెంట్)**



బీచుపల్లి సమీపంలో రహదారి రక్తమోడింది. వేగంగా దూసుకొచ్చిన అశోక్ లేలాండ్ ఆటో ముందుగా వెళ్తున్న టవేరా కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో రెండేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం ధాటికి వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. క్షతగాత్రులను స్థానికుల సహకారంతో గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి పరిస్థితిపై కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న ఇటిక్యాల ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మా పొలాలు మాకు ఇవ్వండి

- **భూములు కోల్పోయిన రైతుల డిమాండ్**

**కల్వకుర్తి ఆగస్టు 19 వుదయం ప్రతినిధి.**



కల్వకుర్తి ఎత్తిపోతల పథకం 29వ ప్యాకేజీ,D 63 పిల్లకాలువకు ఇచ్చిన తమ భూమిని తమకు ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఎత్తిపోతల పథకం వల్ల రైతన్నలకు లాభం ఏమీ జరగదు అని అనుకుంటే తమ నుంచి తీసుకున్న భూమిని తమకి ఇచ్చేసి నష్టపరహారం కింద ఇచ్చిన డబ్బులు తిరిగి ప్రభుత్వానికి చెల్లిస్తామని రైతుల మండిపడుతున్నారు. అప్పట్లో తమకు ఎకరాకు ఏడు లక్షలు మాత్రమే ఇచ్చారని,ప్రస్తుత మార్కెట్లో ఎకరానికి 50 లక్షలు పలుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా ప్రతినిధులు,ఇంజనీరింగ్ అధికారులు పూడ్చుకుపోతున్న కాలువల గురించి ఆలోచించడం లేదని, కాలువల పనులు పూర్తి చేయకపోవడంపై దీనికి ఎవరు సమాధానం చెబుతారని రైతులు ప్రశ్నిస్తున్నారు.ఓవైపు ఖర్చు చేసినప్రభుత్వం సొమ్ము, కోల్పోయిన రైతన్నల భూములు బూడిదలో పోసిన పన్నీరు వలె ఎందుకో గోరకాకుండా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, భూములు కోల్పోయి నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు యూరియా గోశా తప్పదా

- **రైతులను అరగోష పెడుతున్న ప్రభుత్వం....**
- **BRS మండల పార్టీ నాయకులు బుద్ధుల బిక్షపతి.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 19**



రైతులకు యూరియా ఘోష ఏందంటూ బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బుద్ధుల బిక్షపతి మండిపడ్డారు. రైతుల పక్షాన ఆయన మాట్లాడుతూ. యాపుల పేరుతో రైతులను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందని ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్నం పెట్టే రైతన్నకు యూరియా సకాలంలో అందించాలని వారన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నాలుగు సంచుల యూరియా తీసుకురమ్మని ఆటో అతనికి డబ్బులు ఇస్తే సాయంకాలం కల్లా యూరియా ఇంటికి వచ్చేదని. నేడు ఫర్టిలైజర్ షాపుల చుట్టూ పడిగాపులు కాస్తున్న యూరియా మాత్రం దొరకడం లేదని యాప్ కోసం వెతుకులాట రైతన్న వెతికేలోగా యూరియా అయిపోయిందన్న ఈ ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు యూరియా సకాలంలో అందియాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత





- **బీరంగూడ సాయికృపా కాలనీలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పర్యటన**
- **అసంపూర్తి కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం..**
- **నూతన సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచన**

**అమీన్పూర్ ఆగష్టు 19, వుదయం**
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే తన ప్రధాన లక్ష్యమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.
అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ సాయికృపా కాలనీలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో నేరుగా సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు.కాలనీలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. కల్వర్టు నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
అదేవిధంగా పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలనీలో నూతన సీసీ రోడ్లు, యూజీడీ వ్యవస్థల నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.
ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.
ఈ పర్యటనలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్, గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు



- **బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడొద్దు.. హిజ్రాలకు మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి సూచన**
- **డబ్బుల కోసం ఒత్తిడి చేస్తే చట్టపరమైన చర్యలు**
- **శుభకార్యాల్లో నిర్వాహకులకు ఇబ్బందులు కలిగించొద్దు**
- **బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు**
- **సమస్యలు ఉంటే ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలి**

**మేడిపల్లి ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**
సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో జీవించాలని, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి హెచ్చరించారు.ప్రజలను బెదిరించడం, డబ్బుల కోసం ఒత్తిడి చేయడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.మంగళవారం పీర్జాదిగూడ ప్రాంతంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై దాడి జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ నేపథ్యంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో హిజ్రాలకు సామాజిక అంశాలు, చట్టపరమైన బాధ్యతలపై కౌన్సెలింగ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి మాట్లాడుతూ.... హిజ్రాలు సమాజంలో అందరితో సమానంగా గౌరవప్రదంగా జీవించేందుకు హక్కు ఉందని, అయితే జీవనోపాధి కోసం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం లేదా గొడవలకు దిగడం సరికాదన్నారు.ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా శుభకార్యాలు, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాల సమయంలో నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేయకుండా సహకరించాలని సూచించారు.
డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు లేదా వివాదాలు ఎదురైతే నేరుగా ఘర్షణలకు దిగకుండా పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు.పోలీసుల సూచనలను పాటిస్తూ చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు.
సమాజంలో అందరూ పరస్పరం గౌరవించుకుంటూ, చట్టాన్ని గౌరవించి సహకారంతో ముందుకు సాగితే హిజ్రాలకు సమాజంలో మరింత గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని సీఐ జలంధర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీసు సిబ్బంది, పలువురు హిజ్రాలు పాల్గొన్నారు.

## ఘనంగా కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు



**బాచుపల్లి, ఆగష్టు 19 ,(వుదయం ప్రతినిధి ),**
అఖిల భారత ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జన్మదినం సందర్భంగా వారిని సీఎంసి నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సలీం భాయ్, సతీష్, వెంకటేష్, ప్రదీప్ తదితరులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే జీఎంఆర్

- సొంత నిధులతో బోరు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



- **మయూరి నగర్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం**

**రామచంద్రాపురం ఆగస్టు 19(వుదయం ప్రతినిధి):**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు.మయూరి నగర్ కాలనీలో రూ.5.75 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరును బుధవారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులతోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

బీరప్ప దేవాలయ నిర్మాణ పనులకు శ్రీకారంరామచంద్రాపురం డివిజన్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మించనున్న బీరప్ప దేవాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కురుమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జనవాడలో రూ.5 కోట్లతో నిర్మించిన నూతన పాఠశాల భవనం ప్రారంభం



- **నేడు పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**శంకర్‌పల్లి, ఆగస్టు 19 (వుదయం):**
మాజీ ఐటీ శాఖ మంత్రి కె.టి. రామారావు (కేటీఆర్) చొరవతో శంకర్‌పల్లి మండలం జనవాడ గ్రామంలో రూ.5 కోట్ల వ్యయంతో సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నూతనంగా నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి నేడు ప్రారంభించనున్నట్లు శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించాలనే ఉద్దేశంతో ఆధునిక సౌకర్యాలతో పాఠశాల భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. పాఠశాల భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి కోరారు. జనవాడ గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించిన నూతన పాఠశాల భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మెరుగైన మౌలిక వసతులతో విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.జనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన వారందరికీ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నాయకులు, స్థానిక ప్రజలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు హాజరుకానున్నట్లు గండిచెర్ల

## శంకర్‌పల్లిలో ఎస్ఐఆర్-2026పై బీఎల్ఓలకు శిక్షణ

- **ముసాయిదా ఓటరు జాబితా అనంతర కార్యక్రమాలపై అధికారుల సూచనలు**



**శంకర్‌పల్లి, ఆగస్టు 19 (వుదయం):**
ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటరు జాబితా అనంతర కార్యక్రమాలపై బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం శంకర్‌పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిక్షణలో తహసీల్దార్ శ్రీ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీ యోగేష్‌కుమార్, నార్సింగి సర్కిల్ జీహెచ్ఎంసీ డీఈఈ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీ బాల



కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు పలు సూచనలు, విలువైన సమాచారాన్ని అందించారు. ఓటరు జాబితా తయారీలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల జాబితా ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం, నిబంధనల అమలు అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు.ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటరు జాబితా అనంతర కార్యక్రమాలను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేయడమే శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా, ఎలాంటి తప్పులు లేకుండా సమగ్రంగా ఓటరు జాబితాను రూపొందించేందుకు బీఎల్ఓలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఓటరు వివరాల పరిశీలనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్ల సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఎస్ఐఆర్-2026 అనంతర కార్యక్రమాలను సమయానుకూలంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ శిక్షణ దోహదపడుతుం

ముసాయిదా ఓటరు జాబితా అనంతరం చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలు, విధివిధానాలు, మార్గదర్శకాలను మాస్టర్ ట్రైనర్లు శ్రీ ఆశీర్వాదం, శ్రీ అక్షయ్‌కుమార్ వివరించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధులను, ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలను వారికి సమగ్రంగా వివరించారు.శిక్షణ కార్యక్రమంలో శంకర్‌పల్లి

## స్మార్ట్ రైడర్ బైక్స్ షోరూంను ప్రారంభించిన కాసాని



**హైదరాబాద్,ఆగష్టు 19, (వుదయం ప్రతినిధి ),**
మాదాపూర్ లో స్మార్ట్ రైడర్ (ఎస్ అర్ బైక్స్ ) హైదరాబాద్ కార్పొరేట్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్
ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో రామ్ ప్రసాద్ వారణాసి తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి పనులను వేగవంతం చేయాలి



- **ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి**
- **మూడేళ్ల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి: డీఎల్పీవో సతీష్ కుమార్**

**శంకర్ పల్లి, ఆగస్టు 19 (వుదయం):**
శంకర్ పల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలసిరి పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో తప్పనిసరిగా రెండు ఫామ్ పాండ్స్ నిర్మించాలని సూచించారు. అలాగే కమ్యూనిటీ సోక్‌పిట్లు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పాయింట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి పెన్షన్ దరఖాస్తు ఫారాలను సేకరించాలని ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. పెన్షన్ అర్హత విషయంలో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం జరగకుండా అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, అనర్హులకు పెన్షన్ మంజూరు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.డీఎల్పీవో సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలో నమోదు చేయాలని ఆదేశించారు. సర్పంచులతో సంప్రదించి గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేయాలని తెలిపారు. ముఖ్యంగా రాబోయే సంవత్సరంలో చేపట్టబోయే పనుల వివరాలను ముందుగానే నమోదు చేసి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీవో నాగభూషణం, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తదుపరి దశను పకడ్బందీగా చేపట్టాలి

**రంగారెడ్డి జిల్లా ఆగష్టు 19 (వుదయం):**
క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలపై ప్రత్యేక దృష్టి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డిరాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో తదుపరి దశలో చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు . ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు, తదుపరి దశలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, హై మ్యాపింగ్, నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షలకు పైగా కేసులు వివిధ కేటగిరీల కింద ఉన్నందున, భారీ పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సంబంధిత కేటగిరీల వివరాలు భారత ఎన్నికల సంఘం వద్ద కూడా అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి అవసరమైన తదుపరి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు ముఖ్యంగా జీహెచ్ఎంసీ, హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు అధికంగా ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచించారు.

## రామంతాపురం ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ






- **బండ్ల గూడెం తనవి పుట్టినరోజు సందర్భంగా రామంతాపురం ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ**
- **.పుట్టినరోజు వేడుకలను విద్యార్థుల సేవా కార్యక్రమంగా మార్చిన తనవి**
- **.విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు**

**శంకర్‌పల్లి, ఆగస్టు 19 (వుదయం):**
బండ్ల గూడెం తనవి పుట్టినరోజు సందర్భంగా బుధవారం రామంతాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగతంగా జరుపుకోకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందజేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, ఒక్కనోళ్ల నాగభూషణం, శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి మాజీ సర్పంచ్, కోలంపు విట్టల్ రెడ్డి, వడ్ల ప్రశాంత్, కావలి చందు, మంగలి చంద్రశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 13వ వార్డు కౌన్సిలర్ చాకలి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల హెచ్ఎం మేడం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు.

## సన్న వరి సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- **తాండూరు ఏఓ కొమరయ్య**



**తాండూరు ఆగస్టు 19 వుదయం ప్రతినిధి:-**
ఈ వానకాలం సీజన్‌లో ప్రభుత్వం అందించే రూ. 500 బోనస్ పొందడానికైనా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికైనా రైతులు తప్పనిసరిగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తాండూరు మండల వ్యవసాయ అధికారి కొమరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గుర్తించిన 08 రకాల సన్న వరి వంగడాలను సాగు చేసే రైతులకు మాత్రమే ఈ లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు.గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర సన్న వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు వెంటనే వారి వద్దకే వెళ్లి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు మరియు కొనుగోలు బిల్లు సమర్పించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి అన్నారు సొంత ధాన్యాన్ని విత్తనంగా వాడుకున్నవారు, అలాగే పరిశోధన స్థానాల నుండి విత్తనాలు పొందిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి వివరాలు నమోదు చేసుకోవాలి తెలిపారు ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం సెప్టెంబర్ 10 వరకు మాత్రమే గడువు ఇచ్చిందని, ఆన్లైన్ నమోదు చేయకపోతే భవిష్యత్తులో బోనస్ రాకపోవడం లేదా ధాన్యం కొనుగోలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు సూచించాలని తెలిపారు తాండూరు మండలంలోని సన్న వరి సాగుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఏఓ కొమరయ్య విజ్ఞప్తి చేశారు.




వాట్సాప్ డీపీలు చూసి డబ్బులు బదిలీ చేయొద్దు

"సైబర్ నేరగాళ్లు.. వీరిల దుకాణం అకౌంటెంట్‌కు వాట్సప్‌లో యజమాని పేరు, డీపీతో నకిలీ మెసేజ్ పంపి రూ.కోటి కాజేశారు. ఈకేసులో యూపీలోని లక్నోకు చెందిన దీపక్ కుమార్‌ను అరెస్ట్ చేశాం. కోర్టు సత్వర ఆదేశాలు, పోలీసుల చొరవతో కేవలం పది రోజుల్లోనే రూ.కోటి మొత్తాన్ని బాధితుడికి అందజేశాం. భారీ మొత్తంలో డబ్బు పంపమని ఎవరైనా అడిగినప్పుడు.. కేవలం వాట్సప్ డీపీలు, పేర్లు చూసి నగదు బదిలీ చేయొద్దు."

- డాక్టర్ ఎమ్.రమేశ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్

## వే'మన' పద్యం

కోపమునను ఘనత కొంచమైపోవును
కోపమును మిగులఁగోడు గలుగుఁ
గోపమడచెనేని గోర్కెలునీడేరు
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# మన రైల్వే పరిస్థితి దారుణం

నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్నట్టుగా ఉంది భారతీయ రైల్వేల పరిస్థితి. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వ్యవస్థలలో ఒకటైన మన రైల్వేలో ప్రయాణికులకు ప్రాథమిక సౌకర్యాల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తుండటం గర్హనీయం. ఇటీవల పార్లమెంట్‌కు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) సమర్పించిన నివేదిక... 12 ఏళ్ల మోదీ సర్కారు పాలనలో రైల్వేల దుస్థితిని తేటతెల్లం చేసింది. 512 స్టేషన్లలో తనిఖీ చేస్తే 458 స్టేషన్లలో... అంటే 89 శాతం రైల్వే స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. రైల్వే స్టేషన్ల కొళాయిల తాగునీటిలో ప్రమాదకరమైన ఇ కోలితోపాటు టోటల్ కోలిఫార్మ్స్ బ్యాక్టీరియా ఉందని నిర్ధారణ అయ్యింది.

వందే భారత్ రైళ్లకు జెండా ఊపుతూ... బుల్లెట్ రైళ్ల గురించి ప్రచారం చేస్తూ... అత్యాధునిక సౌకర్యాలు కల్పించామని ఊదరగొడుతున్న మోడీ సర్కారు మార్కు ప్రచారానికి భిన్నంగా క్షేత్ర స్థాయి వివరాలున్నాయి. ఎయిర్‌పోర్టుల్లో ఉన్న సౌకర్యాలు రైల్వే స్టేషన్లలో ఎందుకు ఉండవు అని ప్రధాని బాధ్యతలు చేపట్టిన తొలి నాళ్లలో మోదీ చేసిన వ్యాఖ్యలు... రైల్వేల్లో అసౌకర్యాలపై కాగ్ తాజా నివేదిక నేపథ్యంలో దేశవ్యాప్త చర్చకు దారితీశాయి.

మినిమమ్ ఎసెన్షియల్ ఎమెనిటీస్ (ఎంఇఎ) కల్పించాలని కాగ్ 2018లో ఆదేశించినా... ఇప్పటివరకూ 89 శాతం స్టేషన్లలో దారుణ పరిస్థితులున్నాయంటేనే... వాటిపై కేంద్రానికి మొద్దు నిద్ర విదితమవుతోంది. అనేక స్టేషన్లలో తాగునీటికి పూర్తి స్థాయిలో పరీక్షలు చేయకపోవడం, ఇకోలి / కోలిఫార్మ్ వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నా పట్టించుకోకపోవడం తాగునీటి అమ్మకాలను ప్రోత్సహించేందుకేనన్నది నిజం. ఇక మరుగుదొడ్లు, యూరినల్స్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, ఉన్నా నిర్వహణ అధ్వానంగా ఉండటం నిత్యం అనుభవమే! రైళ్ల కోసం వేచి ఉండటానికి తగినన్ని కుర్చీలు లేకపోవడం, ప్లాట్‌ఫామ్ షెల్టర్లు లేకపోవడం, ఫ్యాన్లు, విద్యుత్ పరికరాలు, వాటర్ కూలర్లు సక్రమంగా పని చేయకపోవడం... లాంటి అంశాలెన్నో ఈ నివేదికలో కాగ్ ఎత్తిచూపింది. వికలాంగులకు సంబంధించి కల్పించాల్సిన ప్రాథమిక సౌకర్యాలు అసంపూర్ణంగా ఉన్నాయని, సైన్ బోర్డులు, సూచికల ఏర్పాట్లలో లోపాలున్నాయని, వీటిని పలు భాషల్లో ప్రదర్శించాలని ఇలా అనేక సూచనలు చేయడంతోపాటు కేంద్రం ఇన్నాళ్లూ...తమ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోకుండా ఫిర్యాదులపై స్పందనలు నామమాత్రంగా ఉండటం, టైమ్ బౌండ్ యాక్షన్ ప్లాన్ లేకపోవడం... ఇవన్నీ రైల్వేశాఖ దుస్థితికి అద్దం పట్టేవే.

రైళ్లలో ఏటా ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ట్రాక్‌ల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. ఖాళీ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో సిబ్బంది కొరత విపరీతంగా పెరిగి, పని ఒత్తిడి పెరిగిపోయింది. చాప కింద నీరులా చార్జీలు పెరుగుతున్నాయి. సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులు తదితరులకు రాయితీలను ఎత్తేశారు. వికలాంగులు, రోగులు, విద్యార్థులు తదితరులకిచ్చే రాయితీలలో సింహభాగం కుదించేశారు. ప్రయాణికులకు సబ్సిడీ ఇస్తున్నామని పార్లమెంట్‌లో మంత్రులు ప్రకటిస్తున్నారు. వాస్తవానికి సరుకుల రవాణా ద్వారా వచ్చే ఆదాయమే రైల్వేలకు ప్రధానం. వాటిని విస్మరించి దేశ ప్రజలే డబ్బులు ఈ రాయితీలకు అవసరమైన మొత్తాన్ని సమకూర్చేది సామాన్యులే. ఇక ప్రయాణికులకు ఎంతో ముఖ్యమైన భద్రతనూ కేంద్రం నీళ్లొదిలేసింది. కవచ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రమాదాలను అరికడతామని ప్రకటనలివ్వడం మినహా ఇప్పటికీ ప్రధాన మార్గాల్లోనే అనుసంధానం చేయలేకపోయింది. కొత్త ట్రైన్లు వచ్చాయి. కొత్త టెక్నాలజీ వచ్చింది అనే కోణంలో కాకుండా మౌలిక వసతులను ఎంతగా అభివృద్ధి చేశారు, వాటి నిర్వహణ ఎలా ఉందన్నదీ చూడాలి. ప్రజా రవాణా సంస్థగా రైల్వేది సామాజిక బాధ్యత. ప్రైవేటీకరణతో కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడానికి రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం... ప్రయాణికుల సౌకర్యాలపై, భద్రతపై శ్రద్ధ చూపాలి. బాధ్యత వహించాలి.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మాటలతో కాదు చేతల్లో చూపించాలి

ప్రపంచ స్థాయికి తెలంగాణ విద్యార్థులను తీసుకుపోవడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం", "పిల్లల కోసం మీరు పనిచేయండి.. మీకు నేనున్నా", "నా సంకల్పాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ఇప్పటి నుంచి ఐదేండ్లు దీక్ష పూనండి" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విద్యారంగంపై ఆయనకున్న ఆసక్తిని తెలియజేస్తున్నాయి. ఫిన్లాండ్, జర్మనీ విద్యావిధానాలను అధ్యయనం చేసి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులతో సమావేశం సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యమంత్రికి పాఠశాల విద్యారంగంపై మంచి లక్ష్యం ఉండటాన్ని ఎవరూ తప్పుపట్టరు. అయితే ఆ లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయిలో అనువైన పరిస్థితులు ఉన్నాయా, లేకపోతే ఎలాంటి చర్యలు చేపట్టాలన్నదే ఇప్పుడు ప్రధానంగా ఆలోచించాల్సిన విషయం. ఈ ఏడాది చివరి నాటికి నివేదిక సిద్ధం చేయడం, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రణాళిక రూపొందించడం, వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు చేయడం వంటి హడావుడి నిర్ణయాల కంటే ఇప్పటికే ఉన్న సిఫార్సులను అమలు చేయడం ముఖ్యం. అన్ని స్థాయిల్లో పాఠ్యప్రణాళిక, మౌలిక సదుపాయాల్లో సమగ్ర సంస్కరణల ద్వారా ప్రీప్రైమరీ నుంచి విశ్వవిద్యాలయం వరకు విద్యా నాణ్యతను పెంచాలని ఆకునూరి మురళీ ఛైర్మన్‌గా పనిచేసిన విద్యా కమిషన్ సిఫార్సు చేసింది. అలాంటప్పుడు మరో కొత్త నివేదిక ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. విద్యారంగానికి బడ్జెట్‌లో దాదాపు తొమ్మిది శాతం కేటాయించామని, తెలంగాణలో 27.50 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. గత మూడేండ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడం, ఈ విద్యా సంవత్సరంలో లక్షకు పైగా చేరడం సానుకూల పరిణామమే. దేశంలో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ రెండేళ్లలో 18వ స్థానానికి చేరిందని ఉపాధ్యాయుల పనితీరును కూడా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ అంకెలు, గణాంకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, పాఠశాల విద్య ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించకుండా ఆశించిన లక్ష్యాలను చేరుకోవడం అంత సులభం కాదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త పథకాలు తీసుకురావడం, ఉన్న పథకాల పేర్లు మార్చడం, కొన్ని పథకాలను అటకెక్కించడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వం 'మన ఊరుమన బడి' పథకం ద్వారా 26 వేల పాఠశాలల్లో మూడు దశల్లో 12 రకాల పనులు చేపట్టాలని సంకల్పించింది. కానీ సుమారు 1,200 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. మరో 2 వేల పాఠశాలల్లో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో ఆ పథకం కూడా నీరుగారింది. 'కేజీ టు పీజీ' పథకం పరిస్థితి కూడా అంతే. విద్యారంగంపై పాలకులకు దీర్ఘకాలిక చిత్తశుద్ధి లేకపోవడం వల్ల స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి కొనసాగుతోంది. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు విస్తృతంగా అనుమతులు ఇస్తూ ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఇక క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యారంగం సవాలక్ష సమస్యలతో కూనారిల్లుతోంది. నీటి సౌకర్యంతో కూడిన వాష్ రూమ్‌లు, రక్షిత తాగునీరు అనేక పాఠశాలల్లో ఇప్పటికీ అందుబాటులో లేవు. ప్రహరీలు లేక పశువులు, పందులు, కుక్కలు పాఠశాల ప్రాంగణాల్లో తిరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఏ క్షణం కూలుతాయో తెలియని భవనాల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలతో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సరిపడా ఫర్నిచర్ లేదు. అనేక చోట్ల కిచెన్ షెడ్లు కూడా సక్రమంగా లేవు. ఇలాంటి మౌలిక వసతుల కొరత మధ్య ప్రపంచ స్థాయి విద్యను అందించడం ఎలా సాధ్యమన్నది ప్రభుత్వం ఆలోచించాలి. వీటికి తోడు 7,346 పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యాశాఖను పర్యవేక్షించాల్సిన డీఈఓలు, ఎంఈఓల కొరత తీవ్రంగా ఉంది. ఉపాధ్యాయుల నైపుణ్యాలు, అర్హతలను పరీక్షించే పరీక్షల్లో 2026 నాటికి కేవలం 39 శాతం మంది మాత్రమే అర్హత సాధించడం ఆందోళన కలిగించే విషయం. ఒకవైపు మౌలిక వసతుల కొరత, మరోవైపు నైపుణ్యాలు కొరవడిన బోధనా సిబ్బందితో ముఖ్యమంత్రి అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమా అన్నదే అసలు ప్రశ్న. ఉపాధ్యాయులే తగిన స్థాయిలో లేకపోతే విద్యార్థుల్లో సివిక్ సెన్స్, విలువలు, శాస్త్రీయ దృక్పథాన్ని ఎవరు పెంపొందిస్తారు? విద్యార్థులను కేవలం గ్రహించడం, గుర్తుపెట్టుకోవడం, పరీక్షలు రాయడం వరకే పరిమితం చేస్తే సృజనాత్మకత, ఆలోచనా శక్తి ఎలా పెరుగుతాయి? ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థి తిరిగి పదో తరగతి పరీక్ష రాస్తే రాయలేకపోయే పరిస్థితి మన విద్యా వ్యవస్థ లోపాలను తెలియజేస్తోంది. 39 శాతానికి పైగా పాఠశాలలకు సొంత ఆటస్థలాలు లేవు. ఇది విద్యా హక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధం. 1,804 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని కేవలం 67 శాతం మాధ్యమిక పాఠశాలల్లోనే సమీకృత సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. లైబ్రరీలు కూడా సుమారు 100 పాఠశాలల్లోనే పిల్లలకు అందుబాటులో ఉండటం ఆందోళనకరం. ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నప్పుడు ఇంతటి మౌలిక లోపాలు ఎందుకు కొనసాగుతున్నాయో ప్రభుత్వం సమీక్షించాలి. ఫిన్లాండ్ విద్యావ్యవస్థను అధ్యయనం చేసిన బృందం చెప్పిన అంశాలు మనకు ఆదర్శమే. అక్కడ పేద, ధనిక తేడా లేకుండా ప్రీప్రైమరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్యమైన ఉచిత విద్య అందుతోంది.




పిల్లలను చిన్న వయసులోనే పాఠశాలకు పంపకుండా ఏడేళ్ల తర్వాతే పాఠశాల విద్య ప్రారంభిస్తారు. మంచి ఆటస్థలాలు, ఉపాధ్యాయులకు గౌరవం, పరిశోధన ఆధారిత మాస్టర్స్ డిగ్రీతో కూడిన ఉపాధ్యాయ శిక్షణ అక్కడి ప్రత్యేకతలు. ప్రతి తరగతి తర్వాత విద్యార్థులకు విశ్రాంతి సమయం ఇవ్వడంతో పాటు పాఠశాలల్లో గైడెన్స్ కౌన్సిలర్లు, సైకాలజిస్టులు అందుబాటులో ఉంటారు. అయితే ఫిన్లాండ్ విధానాన్ని కేవలం మాటల్లో ఆదర్శంగా చెప్పడం కాకుండా, అక్కడి విజయానికి కారణమైన పరిస్థితులను మన రాష్ట్రంలో ముందుగా కల్పించాలి. పిల్లలకు కేవలం పాఠ్యాంశాలు నేర్పడం కాకుండా ఆలోచించడం, ప్రశ్నించడం, ఊహించడం నేర్పాలి. ఆలోచనా శక్తి, ఊహాశక్తి పెంపొందితేనే భవిష్యత్ తరంలో సి.వి.రామన్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు, సృజనాత్మక వ్యక్తులు పుట్టుకొస్తారు. విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలంటే హడావుడిగా నిపుణులతో కమిషన్లు వేయడం మాత్రమే సరిపోదు. కమిషన్లు చేసిన సిఫార్సులను నిజాయితీగా అమలు చేయాలి.

కొఠారి కమిషన్, డాక్టర్ కస్తూరిరంగన్ కమిషన్, యశ్‌పాల్ కమిటీ సూచనలను గత పాలకులు పట్టించుకోకపోవడం వల్లే విద్యారంగంలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పుడు కూడా కొత్త నివేదికలు, కొత్త పథకాల కంటే ఇప్పటికే ఉన్న సిఫార్సుల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావ్యవస్థను తెలంగాణలో నిర్మించి ప్రపంచం మొత్తం మనవైపు చూసేలా చేయాలన్న లక్ష్యం గొప్పదే. కానీ ముందుగా అందుకు అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన ఉపాధ్యాయులు, సమర్థవంతమైన పర్యవేక్షణ, శాస్త్రీయమైన పాఠ్య ప్రణాళికను సిద్ధం చేయాలి. ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా నిపుణులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ముఖ్యమంత్రి సంకల్పం ఆచరణలోకి వస్తుంది. మాటలతో కాకుండా పాఠశాలల రూపురేఖలు మారినప్పుడే తెలంగాణ విద్య ప్రపంచ స్థాయికి చేరిందని చెప్పగలం.

# దోమల పట్ల అప్రమత్తత అవసరం

దోమల కట్టడికి ఏటా ఓ రోజున ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్న విషయం చాలా మందికి తెలియదు. అదే ఆగస్టు 20వ తేదీ. బ్రిటీష్ శాస్త్రవేత్త, వైద్యులు, కీర్తిశేషులు రోనాల్డ్ రాస్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రపంచ దోమల దినోత్సవాన్ని ప్రతి ఏటా జరుపు కుంటున్నారు. దోమల వల్ల ఏమేమి రోగాలొస్తాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రోగాలు రాకుండా ఏమేమీ జాగ్రత్తలు తీసుకోవాలో.. రాస్ అనే శాస్త్రవేత్త దోమల గురించి ఏమి కనుగోన్నారో తెలుసుకోవడం అత్యవసం, అనివార్యం. బ్రిటీష్ ఇండియా శాస్త్రవేత్త సికింద్రాబాద్ లో నివాసముండే రోజుల్లో సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20వ తేదీన మలేరియా పరాన్నజీవి ప్లాస్మోడియం పరాన్నజీవి ఉనికిని, అనాఫిలస్ అనే ఆడదోమ లాలజల గ్రంథుల్లో గుర్తించాడు. ప్లాస్మోడియం జీవిత చక్రాన్ని సైతం విపులంగా వివరించాడు. దీంతో ఆ గొప్ప శాస్త్రవేత్త ఆవిష్కరణకు గుర్తుగా దోమలకు ఒక గుర్తింపు వచ్చింది. ఈయన ఆవిష్కరణకు ముందు ప్రజల్లో వేరే భావన ఉండేది. అంతకు ముందు దీనిని మాల్ అని పిలిచేవారు. మాల్ అంటే చెడు అని అర్థం. చెడు ఏరియా వలన కలిగే వ్యాధి అని అందుకనే అలా పిలిచేవారు. రోనాల్డ్ రాస్ మహానుభావుడి చేసిన కృషి వల్లనే మలేరియాతో పాటు దోమల వల్లే వచ్చే ఇతర వ్యాధులకు నివారణ మార్గాలు సులభమయ్యాయి. ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, విరేచనాలు, నీరసంగా ఉండటం, చలిజ్వరం, తలనొప్పి, ఆయాసం వంటి తొలిదశలో వచ్చే లక్షణాలు. దోమ కాటుకు గురైన ఏడు నుండి 18 రోజుల మధ్యలో మనకు మలేరియా లక్షణాలు కనిపిస్తాయి. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే మనం మెరుగైన చికిత్సను అందించవచ్చు. దోమ సాధారణంగా ఎక్కడపడితే అక్కడ కనిపించే కీటకం. అది మనుషుల రక్తం తాగి బతుకుతుంది. అయితే అలా అది రక్తం పీల్చేప్పుడు మన శరీరంలోకి కొన్ని క్రిములను కూడా విడుదల చేస్తుంది. ఆ క్రిముల వల్ల ఎన్నో వ్యాధులు వస్తాయి. మలేరియా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా (బోద వ్యాధి), డెంగ్యూ జ్వరం, చికెన్ గునియా, కాలా జ్వరము నల్ల మచ్చలు జ్వరంలో కనపడే లక్షణాలు, లింఫాటిక్ ఫైలేరియల్ తదితర వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయి. జాతీయ మలేరియా కార్యక్రమం ద్వారా అన్ని జిల్లాలలో జిల్లా మలేరియా కార్యాలయాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉప కేంద్రాలలో సిబ్బంది నియమింప బడి ఉన్నారు. ఇందులో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోజుకు 24 గంటలు పని చేయునట్లుగా ఏర్పాటు చేయబడింది. ఎవరైనా ఎలాంటి జ్వరంతోనైనా బాధపడుతుంటే ఎలాంటి మందులు తీసుకోక ముందు పైన ఉదహరించిన కేంద్రాలకు వెళ్ళి వ్యాధి నిర్ధారణ కొరకు రక్త పరీక్ష చేయించు కోవాలి. వ్యాధి నిర్ధారణలో వచ్చిన జ్వరం మలేరియా మూలంగా అని తేలితే, మలేరియా సిబ్బంది చికిత్స ప్రారంభిస్తారు. మలేరియా క్రిములున్న దోమ ఆరోగ్యవంతున్ని కుట్టినాక 10 నుండి 14 రోజుల వ్యవధిలో వ్యాధి లక్షణాలు బయటకు వస్తాయి. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్ష చేయించాలి. మలేరియా అని నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవాలి.




రక్త పరీక్ష చేసే సదుపాయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభిస్తుంది. దోమల ద్వారా ఈ జ్వరం వ్యాపిస్తుంది. కావున దోమలు పుట్టి పెరిగే స్థావరాలను అరికట్టాలి. నీరు నిలకడ ప్రదేశాలను పూడ్చి వేయాలి.ఇంటి పరిసరాలలో గుంతలు గోతులు లేకుండా జాగ్రత్త పడాలి.

ఇంటి బయట పడుకునే వారికి దోమ తెర, వంటి నిండా బట్ట ఉంచుకోమని తెలియ చేయడం ముఖ్యం. వేపనూనె ఒంటికి రాసుకుంటే దోమ కుట్టదు. చిన్న చిన్న చెరువులు, గుంటలలో గంబూసియా లేక గప్పి చేపలు వదలడం చేపట్టాలి. ఇంటిపై కప్పులో వున్న ట్యాంకులు (ఓవర్ హెడ్ ట్యాంకులు), నీటి కూలర్స్ మొదలగు నీటి తొట్లలో దోమలు పెరగకుండా చూసుకోవాలి


.జూన్ - మలేరియా మాసం. ఈ నెలలో స్ప్రే జరిగిందా లేదా చూసుకోవాలి. గ్రామ పంచాయితీలో యాంటీ లార్వలం (దోమ పిల్లలను చంపుట) జరిగిందా లేదా చూసుకోవాలి. చలి జ్వరం కేసులున్నప్పుడు మలేరియా సిబ్బంది వచ్చి రక్తపరీక్ష చేయించడంలో సమన్వయం ఏర్పరచు కోవాలి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# భవిష్యత్తుకు ఆశాకిరణం

79 సంవత్సరాల కిందట మనం ఆశల వసంతాగమన పండుగ చేసుకున్నాం. మనకు అత్యుత్తమ వేళ అది. ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అర్ధరాత్రి నిశీథివేళ అందరి మనస్సులలో తొణికిసలాడిన భావాన్నే వినిపించారిలా... "భవిష్యత్తు మనం చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవలసిన సమయం" అన్నారు. ఒక నూతన దేశాన్ని నిర్మించుకోవాలని మన కర్తవ్యం నిర్దేశించింది. సువిశాలమైన వైవిధ్యభరితమైన




భారతదేశం వలసవాద గుదిబండను వదిలించుకుని ఎన్నడూ లేనంత ఐకమత్యంగా నిలిచింది. దేశ విభజన విషాదాలకు కారణమైన శక్తులను అధిగమించి మనం సమైక్యంగా నిలవడమే విద్యుక్త ధర్మంగా వచ్చిన పరిస్థితి. మనం చేపట్టిన బృహత్తర కర్తవ్యాన్ని చూసి యావత్ ప్రపంచ ప్రజానీకం విస్మయం చెందారు. మన జనాభా పరిణామం, వారిలో వైవిధ్యాలు చారిత్రక సవాళ్లుగానే వున్నాయి. రాజ్యాంగ పరిషత్తు సభ్యులుగా వ్యవహరించిన మన స్వతంత్ర యోధులు దీనికి ఒక తేలికైన పరిష్కారం కనుగొన్నారు. అదే పౌరసత్వం అనే సాధనం. విభిన్నమతాలు, భాషలు, కులం, సంస్కృతి, ప్రాంతీయ అసమానతలు వంటి వాటితో ముక్కలై వున్న వైవిధ్య భరిత ప్రజానీకం భారతీయ పౌరులుగా సమాన ఉమ్మడి పౌరసత్వం పొందగలిగారు.

ఇప్పుడు మనం వెనక్కు తిరిగి చూసుకుంటే నాటి మన ఆశావసంతం స్థానంలో అసంతృప్తి శీతల మేఘాలు అలుముకోవడం కనిపిస్తుంది. అత్యంత ఘోరమైన కాలంగా చెప్పదగిన కాలంలో అత్యధిక ప్రజానీకం చిక్కుకుపోయి వున్నారు. ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఆర్థిక అసమానతలు అలుముకున్న వాస్తవం మనల్ని పట్టి కుదుపుతున్నది. ఏదో కొద్ది మంది కుబేరులు, సర్కారీ దన్ను కలిగిన కార్పొరేట్లు మాత్రమే చుక్కలు తాకేంత సంపదలు గుట్టలు పోగుపోసుకుంటున్నారు. ఆ ఒక్క శాతం దేశంలో నలభై శాతం సంపద అనుభవిస్తున్నారు. మరో సగం మంది జనం అనాథలుగా కనీస జీవన స్థాయికి దిగువన బతుకులీడుస్తున్నారు. విద్యా వైద్యాలు అందకుండా పోయి అంతకంతకూ కునారిల్లుతున్నారు. శారీరక సామర్థ్యం వుండి కూడా నిరుద్యోగులుగా అరకొర ఉద్యోగులతో వట్టిపోతున్నారు. ఎప్పటికీ అందని ఉద్యోగావకాశాల కోసం పట్టభద్రులు, ఆ పై చదువుల ఉన్నత విద్యావంతులు, పరిశోధక డాక్టర్లు బారులు కట్టే సంఖ్య ప్రపంచంలోకెల్లా బహుశా భారతదేశంలోనే అత్యధికంగా వుంటుంది. ఇలాంటి పరిస్థితి మటుమాయం చేయలేని ఘర్షణలకు దారితీస్తుందని చెప్పడానికి పెద్ద మహావిజ్ఞానులు కానక్కర్లేదు. ఇది దేశంలో అంతర్గత వ్యవస్థాగత సంక్లిష్టతలను ఇంకా తీవ్రం చేస్తుంది. కేవలం మరింత అరమరికలు లేకుండా మాట్లాడుకోవడం ద్వారా మాత్రమే అలాంటి ఘర్షణలు, ఉద్రిక్తతలు ఉపశమిస్తాయి.

రాజ్యాంగంలో మనం రూపొందించుకోవాలని, తీర్చిదిద్దుకోవాలని ఎంచుకున్న ప్రజాస్వామ్య భావనతో ప్రస్తుత పాలక వ్యవస్థ భాగం పంచుకోలేదు. ఇప్పుడు నాటకం నడిపిస్తున్నామని భావించే సూత్రధారులుగా చెప్పుకునే వారి సైద్ధాంతిక పితామహులకు ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులంటేనే ఎప్పుడూ ఏహ్యాభావం. ఏకపక్ష ఆధిపత్యం, సర్వ కేంద్రీకరణ, ప్రజలకూ రాష్ట్రాలకూ నామమాత్రపు అధికారాలు వుండాలనే విశ్వాసానికి విధేయులు వారు. భారత దేశం వంద చిన్న చిన్న విభాగాలుగా వుండాలని ఆరెస్సెస్ వాదించింది. భారతీయ సమాజంలో వ్యక్తమయ్యే సహజసిద్ధ భిన్నత్వాన్ని తోసిపుచ్చి తమ ఏకపక్ష నిర్దేశాన్ని రుద్దడమే ఇందులో ఆంతర్యం. విశాల ప్రజారాశులపై అసమానతలు, అగచాట్లు కుమ్మరించే విధంగా ఆర్థిక అయోమయం సృష్టించిన వారు తాము అధికారంలోనే కొనసాగడం కోసం ప్రజలలో విభజనలు తీసుకురావాలని చూస్తున్నారు. ఆర్థిక అసమానతల కారణంగా అట్టడుగున వున్న ప్రజలు ఆర్థిక సామాజిక సంక్షేమం మృగ్యమై పోయింది. దీనివల్లనే మన దేశ స్వాతంత్రం, రాజకీయ సార్వభౌమత్వం ముప్పునెదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

విభజన కార్యకలాపాలకు కావలసిన భూమిక ఏర్పడింది. మన దేశ స్వాతంత్ర్య సమయంలో మన సార్వభౌమత్వాన్ని దృఢతరం చేసుకోవడం కోసం వలస వ్యవస్థ విచ్ఛిన్నం, స్వతంత్ర విదేశాంగ విధానం మార్గంగా ఎంచుకున్నాము. ఇది అద్భుతమైన ఫలితాలిచ్చింది. పేదరికం, అభివృద్ధి లేమితో కష్టాలనెదుర్కొంటున్న నవ స్వతంత్ర దేశాల ఆకాంక్షల సాధనలో మనం అగ్రభాగాన నిలిచాం. సామ్రాజ్యవాద పెత్తనాలను ఎదుర్కొంటూ శాంతి కోసం పోరాడటమే ఆ విధానానికి మూల సూత్రంగా వుందంటే అదేమీ యాదృచ్ఛికం కాదు. అయితే ఈ రోజున ఆరెస్సెస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆ విధానాన్ని వదిలేసింది. అమెరికా సామ్రాజ్య వాదంతో నిర్లజ్జాత్మకంగా జతకట్టే విధంగా మారింది. ఇజ్రాయిల్ బిగి కౌగిలిలో చేరడం వారు ఎంచుకున్న ఒక మార్గం. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ, వెస్ట్ బ్యాంక్, జెరూసలేం ఆక్రమణ పథకాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఇజ్రాయిల్‌తో, అమెరికాఇజ్రాయిల్ కూటమితో ఇంకొందరు కూడా ఏకీభవించారు. అయితే ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ ఒక్కటిగా యుద్ధం చేయడంతో ఇది మారింది. ఇరాన్ సైనిక ప్రతిఘటన స్థాయి, కేవలం ఇజ్రాయిల్‌నే గాక మొత్తం గల్ఫ్‌లో అమెరికా స్థావరాలన్నిటినీ ఢీకొనడంతో ఈ ప్రాంతంలో దీర్ఘ కాలంగా కొనసాగుతున్న అమెరికా ఆధిపత్యానికి గండి పడినట్టయింది. భారత దేశమే గనక స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించుతున్నట్టయితే ఈ సైనిక ఘర్షణ పరిష్కారంలో దౌత్యపరమైన పాత్ర నిర్వహించగలిగి వుండేది. ఇది భారత దేశ ఇంధన భద్రతను దెబ్బతీయసాగింది. ఇరాన్, రష్యాల నుంచి చమురు సహజ వాయువులు హార్ముజ్ జలసంధి ద్వారా సరఫరా కాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇది మన వంటిళ్లను దెబ్బతీసింది. అయితే కోరికోరి అమెరికాకు లోబడిపోవడం, నక్కజిత్తుల ఇజ్రాయిల్ విషయంలో అగమ్య స్థితికి లోనవడం మనను పూర్తిగా చిక్కుల్లో పడేసింది. మన రాజకీయ సార్వభౌమత్వమే అలాంటి గడ్డు స్థితిలో పడటంతో మనం ప్రధానంగా అమెరికా నుంచి మరిన్ని ఒత్తిళ్లకు గురికావలసిన స్థితి వచ్చింది. సుంకాలు, వాణిజ్య విధానాల విషయంలో మన ఎగుమతులు దెబ్బతినగా మన మార్కెట్లలోకి దిగుమతులకు అనుకూలత ఏర్పడింది. దానివల్ల మన శ్రామికులకు ప్రత్యేకంగా రైతులకు ఇది విపరీత పర్యవసానాలు కల్పించింది.

ఎప్పుడైనా మెజారిటీ మతాధిక్యవాద సిద్ధాంతాన్ని, బ్రాహ్మణీయ ఆచార పద్ధతులను సామాజిక దృక్పథంగా ప్రతిపాదిస్తున్నది. మన స్వాతంత్రానికి సాగిపోయే క్రమంలో విభిన్న అస్తిత్వాలకు లోటు లేకపోయినా అందరినీ కలుపుకుని సమ్మిళితం చేయడంపైనే ఎప్పుడూ ప్రయత్నం జరిగింది. ఆరెస్సెస్ విషయానికొస్తే విభజించడం, వెలివేయడం విధానంగా వుండేది. ప్రస్తుతం అన్ని రాజ్యాంగ వ్యవస్థలలో బీజేపీ ద్వారా దానికి లభించిన రాజకీయాధిక్యత స్థాయిని బట్టి ఇప్పుడు అంతర్గత ఘర్షణలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఆదివాసులు, దళితులు, ముస్లింలు, మహిళలు అందరికన్నా ఘోరంగా నష్టపోతున్నారు. వీటికి సమర్థనగా పాతకాలపు పురాణాలను తీసుకురావడం జరుగుతున్నది. తమ సైద్ధాంతిక విధానాన్ని మొత్తంగా సమర్థించుకోవడం కోసం మరిన్ని వక్రీకరణలు జోడించబడుతున్నాయి. అందువల్ల ఈ స్వాతంత్ర్య దినోత్సవం మన ప్రజల సమైక్యత, సమ్మిళిత భావన కోసం పోరాడేందుకు పునరంకితమవ్వాలనే సందేశం ఇస్తున్నది. మెజారిటీవాద విధానాలలో ఆధిపత్యం, అది కూడా ముఖ్యంగా బలప్రయోగం ద్వారా ఆధిపత్యం వహించడం అంతర్భాగంగా వుంటుంది. రాజ్యాంగంలో స్వతంత్రమైనవిగా చెప్పబడిన వ్యవస్థలను మాయోపాయాలతో లోబర్చుకోవడం ద్వారా ఈ ప్రాబల్యం చిక్కుతుంది.

అయితే ప్రస్తుత ఆధిక్యత తర్కబద్ధ ప్రభావం మేరకు అవి తమ ఆధిక్యతను రుద్దేవిగా వుండకపోతే వాటి స్వతంత్రత అనేదాన్ని విశ్వసించదు, అలాంటి మాయోపాయాలకు అతి పెద్ద కేంద్రంగా ఎన్నికల సంఘం (ఈసిఐ) కనిపిస్తున్నది. ఓటరు జాబితాల మాయజాలం ఏ స్థాయికి చేరిందంటే ఇప్పుడు ఓటర్లు తాము కోరుకున్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంగాక ప్రభుత్వం తన ఓటర్లను ఎంచుకునే పరిస్థితి వచ్చింది. ప్రజలకు హామీ ఇవ్వబడిన ఓటు హక్కు ఇందుకు ఫణంగా పెట్టబడుతున్నది. భయోత్పాత వాతావరణం సృష్టించడం ద్వారా కూడా ఆధిపత్యం రుద్దబడుతున్నది. ఈ సైద్ధాంతిక చట్రానికుండే నయా ఫాసిస్టు లక్షణాలను పూర్తి స్థాయిలో ప్రయోగించడం జరుగుతున్నది. ప్రతిపక్షాన్ని, విమర్శనూ నోరు నొక్కడం, ప్రత్యక్షంగా ఆలోచనలను మొద్దుబార్చడం ద్వారానూ ఇది జరుగుతుంది. ఇందుకోసం కార్పొరేట్ ఆధిపత్యంలోని ప్రధాన గోడీ మీడియా ద్వారానూ బీజేపీ ఐ.టి విభాగం సోషల్ మీడియావరణంలోకి వదిలే ఫేక్ సమాచారం ఇందుకు సాధనంగా వుంటుంది.

అనివార్యంగా సంభవించనున్నదాన్ని వ్యతిరేకించి పోరాడవలసిన, ప్రతిఘటించవలసిన ఆవశ్యకత మనకు ఎదుర వుతున్నది. ఈ సమస్యలోనే మనం ఇటీవల యువజనుల జెన్‌జి నిరసనను చూశాం. తమ పరిస్థితిని చక్కదిద్దుకోవడానికి పరీక్షలే ఆఖరి అవకాశంగా ఉన్న నేపథ్యంలో, సోషల్ మీడియా వేదికగా ఈ నిరసన మొదలైంది. సోషల్ మీడియావరణం నుంచి ఆ నిరసన పుట్టుకొచ్చింది. ప్రధానంగా డిజిటల్ వేదికల నుంచి పాటలు, రీళ్లు, జోకులు, మీమ్‌లతో అది ఆవిర్భవించింది. స్వాతంత్రానికి, మన రాజ్యాంగ భావనల మూలాలకే ముప్పు తెచ్చే పాలనా రీతిని పూర్తిగా నవ్వుల పాలు చేసింది. భయం కరిగిపోయి అరుదైన ధైర్యం ప్రదర్శించబడటంతో ప్రభుత్వం ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయినట్టు కనిపిస్తుంది. బహుశా వచ్చే ఏడాది వంద పువ్వులు వికసించి మనం 79 ఏండ్ల కిందట రూపొందించుకున్న స్వతంత్ర భావనను నిజం చేయవచ్చునని ఆశించాలి. సవాళ్లు చాలా తీవ్రమైనవే కానీ మనకు ఒక ఆశాకిరణం మిణుకు మిణుకుమంటున్నది.

# జాతీయం-అంతర్జాతీయం

## అయోధ్య విరాళాలపై

# సిట్ తుది నివేదిక

- విచారణలో పలు కీలకాంశాలు
- వాటి ఆధారంగా తదుపరి చర్యలు
- కఠినమైన సిఫారసులు సైతం

**లక్నో, ఆగస్టు 19 (ఎ.ఎం.ఎస్) :** అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం వ్యవహారానికి సంబంధించి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) తుది నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందజేసినట్టు ఉత్తర్ ప్రదేశ్ హోం శాఖ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని సోమవారం అర్ధరాత్రి వేళ వెల్లడించింది. దీని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి ట్రస్టుకు అవకాశం దక్కనుంది. ట్రస్ట్ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ 13న సిట్ ని ఏర్పాటు చేసింది. జూన్ 23న ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అందులో అనేక కఠినమైన సిఫారసులను చేసింది.

లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ అధ్యక్షతన ఏర్పడిన ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఐజీ రేంజ్ కిరణ్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా జూన్ 25న శ్రీరామ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో మొదటి ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో ఎనిమిది మంది వ్యక్తుల పేర్లతో పాటు ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

ఇదిలా ఉండగా, అంతకుముందు జరిగిన సిట్ దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు కూడా చేసింది. రామాలయ విరాళాల




కౌంటింగ్ కేంద్రాల నుంచి రూ.500 నోట్లతో మొదలైన ఈ చేతివాటం, తర్వాత కట్టలకొద్దీ తస్కరించే వరకూ వెళ్లిందని సిట్ గుర్తించింది. వాటి మొత్తం రూ. 23 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. అంతేకాదు, సీసీటీవీ నిఘా, భద్రతా నిబంధనల్లోని లోపాలను నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని గతంలో పేర్కొంది. తొలుత కరెన్సీ నోట్లను జేబులో వేసుకున్నారని దర్యాప్తు అధికారులు గుర్తించారు. తమ దుస్తుల్లో ఆ నోట్లను దాచుకొని, బయటకు తీసుకెళ్లినట్టు నిందితులు అంగీకరించారు. అయితే, ఆ దొంగతనాలను ఎవరూ గుర్తించకపోవడంతో క్రమంగా ఆ నోట్ల సంఖ్య పెరిగింది. కాగా, ఈ కేసులు ఇప్పటికే రామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. ఆలయ నిర్వహణ కోసం కొత్త సీఈఓ నియామక ప్రక్రియ నడుస్తోంది.

అయోధ్య విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించి గతంలో సుప్రీం కోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయొద్దని, అలాగే, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని వ్యాఖ్యానించింది. ఇది కేవలం ఓ నేరానికి సంబంధించిన అంశం మాత్రమేనని, సరైన దర్యాప్తు జరిగేలా చూస్తామని పేర్కొంది. విరాళాల చోరీపై దర్యాప్తునకు నియమించిన నలుగురు సభ్యుల సిట్ బృందంలో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌నూ చేర్చాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. దర్యాప్తు పారదర్శంగా జరగాలని, ఆలయంలో అక్రమాలకు చోటివ్వని విధంగా తగిన చర్యలూ తీసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాబాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం సూచించింది.

కాగా, రామమందిర కానుకల చోరీ వ్యవహారం ఘటన దేశవ్యాప్తంగా పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. రాష్ట్ర స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు గుప్పిస్తునే ఉన్నాయి. అయితే తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది.

# మా జోలికొస్తే అంతేసంగతులు..

- భూతల దాడులనూ తిప్పికొడతాం
- మా దాడులు శత్రువును ఆశ్చర్యపరుస్తాయి
- ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, ఆగస్టు 19 :** అమెరికాతో కుదుర్చుకున్న ఎంఓయూ గడువు ముగిసిపోవడంతో ఇక దేనికైనా సిద్ధమేనని ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో అమీతుమీకి సిద్ధంగా ఉన్నామని, మరింత దూకుడుగా పోరు జరుపుతామని తెలిపింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) రాజకీయ బ్యూరో అధినేత బ్రిగేడియర్ జనరల్ యదోల్లా జవానీ ప్రభుత్వ టీవీతో మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అవసరమైన ఏ చర్యనైనా తీసుకునేందుకు తమ సేనలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 'యుద్ధాన్ని ప్రారంభించింది శత్రువే. మా ప్రయత్నాలు రక్షణాత్మకంగానే ఉంటాయి. అయినప్పటికీ అవి దాడి చేసే దిశగా కూడా ఉండవచ్చు' అని అన్నారు. దాడి ఏ విధంగా ఉంటుందో ఆయన చెప్పలేదు కానీ ప్రత్యర్థులను వ్యూహాత్మకంగా ఆశ్చర్యపరుస్తాయని వ్యాఖ్యానించారు. ఒకవేళ అమెరికా భూతల దాడులకు తెగబడితే వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నామని చెప్పారు.



యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలికేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నిలిచిపోవడంతో పూర్తి స్థాయిలో దూకుడు ప్రదర్శించాలని నిర్ణయించామని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు రాయిటర్స్ వార్తాసంస్థకు తెలిపారు. 'హోర్ముజ్ జలసంధిలోనూ, ఇతర ప్రాంతాలలోనూ ఉద్రిక్తతలను పెంచడానికి ఇరాన్ సేనలు సంసిద్ధంగా ఉండాలి. ఎందుకంటే కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి, వాటికి అనుగుణంగా చర్యలు చేపట్టడానికి ఇరాన్ సిద్ధంగా ఉంటుంది' అని చెప్పారు. దౌత్యం విఫలమైతే అమెరికా జరుపుతున్న నౌకా దిగ్బంధనాన్ని ఛేదించడానికి సకాలంలో, కచ్చితమైన దాడి చేస్తామని అన్నారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై దాడి జరిగిందని బ్రిటన్ మారీటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ (యూకేఎంటీఓ) తెలిపింది. హోర్ముజ్ మీదుగా గమ్యస్థానానికి వెళుతున్న నౌకపై గుర్తు తెలియని ఆయుధంతో దాడి చేశారని వివరించింది. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ గదికి నష్టం వాటిల్లిందని, ఒక వ్యక్తి గాయపడ్డాడని చెప్పింది. నౌకలోని మిగిలిన సిబ్బందిని ఒమన్ తీరగస్తీ దళం సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని అంటూ హోర్ముజ్‌లో ప్రయాణించే నౌకలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పదంగా కన్పించే వాటిని గుర్తించి సమాచారం అందించాలని యూకేఎంటీఓ సూచించింది. తమతో కుదుర్చుకున్న తాత్కాలిక ఒప్పందంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమెరికా నెరవేర్చనంత వరకూ హోర్ముజ్ జలసంధి మూతపడే దని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ స్పష్టం చేశారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, విదేశాలలో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, చమురు ఆంక్షలను తొలగించాలని, అన్ని రకాల సైనిక చర్యలకు స్వస్తి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

వీటన్నింటినీ అమలు చేస్తామని తాత్కాలిక ఒప్పందంలో అమెరికా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

# చైనాలో కొత్త హై స్పీడ్ రోబోట్ ఆవిష్కరణ

- స్టాక్ మార్కెట్‌లో రికార్డు అంటున్న నిపుణులు

**షాంఘై, ఆగస్టు 19 :** చైనాకు చెందిన యూనిట్రీ సోమవారం 'సూపర్‌మ్యాన్' పేరిట ఓ కొత్త హైస్పీడ్ రోబోట్‌ను ఆవిష్కరించింది.

యూనిట్రీ సంస్థ అమ్మకాల పరంగా ప్రపంచంలోనే అతి పెద్ద హ్యూమనాయిడ్‌రోబోట్ తయారీదారు. గత వారం నిధుల సమీకరణ జరిపిన తర్వాత షాంఘైలో ట్రేడింగ్ ప్రారంభించింది. తూర్పు చైనాలోని హాంగ్‌జౌలో ఉన్న ఈ కంపెనీ కేవలం మూడు నెలల వ్యవధిలోనే కొత్త రోబోట్‌ను అభివృద్ధి చేసింది. ఇది రెండు మీటర్ల ఎత్తు వరకూ దూకగలదు. సెకనుకు 12.66 మీటర్ల గరిష్ట వేగాన్ని అందుకోగలదు. పరిగెత్తడం, నృత్యం చేయడం,

యుద్ధ కళలను ప్రదర్శించడం ద్వారా ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించిన కంపెనీ హ్యూమనాయిడ్ రోబోట్‌లపై పెట్టుబడిదారుల దృష్టిని ఈ తాజా ఆవిష్కరణ మరింతగా



పెంచింది. కంపెనీ ఐపీఓను రిటైల్ పెట్టుబడిదారులు ఎనిమిది వేల రెట్లకు పైగా ఓవర్ సబ్‌స్క్రైబ్ చేశారు. ఇది షాంఘై టెక్ కేంద్రీకృత స్టాక్ మార్కెట్‌లో ఓ రికార్డు అని నిపుణలు పేర్కొంటున్నారు.

# పీఎం కేర్ ఫండ్ కింద రూ.8,452 కోట్లు జమ

- ఖర్చు మాత్రం రూ.88 లక్షలే
- ఆడిట్‌లో పలు అంశాలు వెలుగులోకి

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఎ.ఎం.ఎస్):** కరోనా సమయంలో దేశంలోని పీఎం కేర్స్ ఫండ్ భారీ మొత్తంలో సేకరించారు. ఈ నిధిని చిన్నారులకు సహాయం, ప్రజారోగ్యం, ప్రకృతి వైపరీత్యాలు వంటి వాటికి ఖర్చు చేయాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ రకంగా ఖర్చు చేయటం లేదు. ఈ ఫండ్ కోట్లలో ఉండగా, ఖర్చు మాత్రం కేవలం లక్షల్లోనే ఉంది. పీఎం కేర్స్ ఫండ్ తాజా ఆడిట్‌లోని రాబడి, చెల్లింపుల వివరాల ప్రకారం 202425 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.8,452.07 కోట్ల నిల్వలు ఉన్నాయి. ఇది అంతకు ముందు ఏడాది రూ. 7,173.03 కోట్ల నిల్వల కంటే ఎక్కువగా నమోదు అయింది.

అయితే 2025లో ఈ ఫండ్‌లో కేవలం రూ.87.85 లక్షలు మాత్రమే కేంద్రం ఖర్చు చేసింది. ఇది 2023 24లోని రూ.15.60 కోట్ల నుంచి గణనీయంగా తగ్గింది. 2025లో రూ.87.84 లక్షలు చిల్డ్రన్ స్కీమ్‌కు కేటాయించగా, రూ.451 బ్యాంకు, ఎస్ఎంఎస్ ఛార్జీలకు ఖర్చు చేశారు. 2025 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఖాతాలపై




2026 ఆగస్టు 6న ఫండ్ సంబంధిత అధికారులు, ఆగస్టు 7న చార్టర్డ్ అకౌంటెంట్ సంతకాలు చేశారు.

రూ.8,452.95 కోట్లలో రూ.7,846.65 కోట్లు షెడ్యూల్డ్ బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, మరో రూ.604.41 కోట్లు బ్యాంకు పొదుపు ఖాతాల్లో ఉన్నాయి. దేశీయ విరాళాల రూపంలో 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.479.05 కోట్లు అందగా, అంతకు ముందు ఏడాది ఇది రూ. 681.81 కోట్లు అందింది. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1.14 కోట్లుగా ఉన్న విదేశీ విరాళాలు, 2025లో రూ.92.83 లక్షలు నమోదు అయ్యాయి.

వడ్డీ మరో ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. ఈ ఏడాదిలో ఈ పథకం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో రూ.469.38 కోట్లు, సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.5.77 కోట్లు ఆర్జించింది. ఇది అమలు చేసే ఏజెన్సీల నుంచి రీఫండ్‌ల రూపంలో రూ.324.66 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీపై మినహాయించిన పన్ను రీఫండ్‌గా రూ.13.49 లక్షలు పొందింది.

కరోనా సమయంలో పీఎం కేర్స్ ఫండ్ 2020 మార్చిలో ఏర్పాటు చేశారు. అదే ఏడాది మార్చి 27న న్యూఢిల్లీలో ట్రస్ట్ డీడ్ రిజిస్టర్ చేశారు. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు లేదా మానవ నిర్మిత విపత్తులు, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఈ నిధిని ఒక ప్రత్యేక యంత్రాంగంగా రూపొందించారు. దీని లక్ష్యాలు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, ఔషధ సౌకర్యాలు, పరిశోధన, ప్రభావిత ప్రజలకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం కోసం నిధులను కూడా అందించాలి. దీనికి పదవీ రీత్యా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చైర్మన్‌గా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. వీరే కాకుండా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కెటి థామస్, కేంద్ర మాజీ మంత్రి కరియా ముండా నామినేటెడ్ ట్రస్టీలుగా ఉన్నారు. ట్రస్ట్ సహాల మండలిలో మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాజీవ్ మెహ్రిషి, సుధామూర్తి, ఆనంద్ షా ఉన్నారు.



## ఎస్పీ నేత ఆజమ్ ఖాన్ ఆస్తులపై

# ఈడీ సోదాలు

- ప్రయివేటు కాంట్రాక్టర్ల ద్వారా నిధులు మళ్లించారంటూ ఆరోపణలు

**లక్నో, ఆగస్టు 19 (ఎ.ఎం.ఎస్) :** సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుతం జైల్లో ఉన్న ఆజమ్ ఖాన్‌కు చెందిన మౌలానా మొహమ్మద్ అలీ జౌహార్ ట్రస్ట్, మొహమ్మద్ అలీ జౌహార్ యూనివర్సిటీ లక్ష్యంగా ఈడీ అధికారులు విస్తృత సోదాలు చేపట్టారు. పీఎంఎల్ఏ చట్టం కింద నమోదైన మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి లక్నో ఈడీ జోనల్ విభాగం ఈరోజు ఈ తనిఖీలను నిర్వహిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్, సహారన్‌పూర్‌తో పాటు ఢిల్లీలోని జమియా నగర్‌తో సహా మొత్తం 10 ప్రదేశాల్లో సీఆర్పీఎఫ్ భద్రత నడుమ ఈ దాడులు కొనసాగుతున్నాయి. సహారన్‌పూర్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ నివాసంతో పాటు ట్రస్ట్‌తో సంబంధమున్న రెండు కంపెనీలు, వాటి ప్రమోటర్ల ఇళ్లలో కూడా ఈడీ తనిఖీలు చేస్తోంది. ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ కాంట్రాక్ట్ నిధులను మళ్లించి, ఆ సొమ్మును జౌహార్ ట్రస్ట్, యూనివర్సిటీ ఆస్తుల నిర్మాణానికి విరాళాలుగా వాడినట్లు అధికారులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు.

# ఆ ఒప్పందాన్ని పొడిగించే ఉద్దేశం లేదు

- ఇరాన్‌తో అగ్రిమెంట్‌పై ట్రంప్ స్పష్టీకరణ

**వాషింగ్టన్, ఆగస్టు 19 :** ఇరాన్‌తో జూన్‌లో కుదుర్చుకున్న తాత్కాలిక ఒప్పందాన్ని పొడిగించే ఉద్దేశమేమీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అయితే యుద్ధ సమయంలో శక్తివంతంగా ఎదిగి, ఇరాన్ ఆర్థిక వ్యవస్థలో అనేక భాగాలను నియంత్రిస్తున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)తో ఆయన రహస్య మంతనాలు ప్రారంభించారని తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆక్సియాస్ వార్తాసంస్థ ప్రచురించిన కథనం ప్రకారం...ఐఆర్‌జీసీతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఇరాకీ కుర్దు నాయకుడితో అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థ



మాజీ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ మాట్లాడారు. ఆ నాయకుడి ద్వారా ఐఆర్‌జీసీ కమాండర్ జనరల్ అహ్మద్ వాహిదీకి అమెరికా ఓ సందేశాన్ని పంపింది. ఈ వార్తను టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ ధృవీకరించారని ఫాక్స్ న్యూస్ తెలియజేసింది.

'నేను వివరాలలోకి వెళ్లడం లేదు. అయితే అమెరికా ప్రభుత్వానికి, ఇరాన్ సర్కారులోని కొన్ని విభాగాలకు మధ్య వివిధ రంగాలకు సంబంధించి జరుగుతున్న సంభాషణలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయని మాత్రం చెప్పగలను' అని ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ సోమవారం ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

# అధ్యక్షుడి పనితీరు బాగా లేదు




**ట్రంప్ పదవీకాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన ప్రతిష్ట దిగజారిపోయింది. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ఇప్పుడప్పుడే ముగియబోదని, అది దీర్ఘకాలం కొనసాగుతుందని మెజారిటీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రాయిటర్స్/ఇప్సాస్ నిర్వహించిన పోల్ ప్రకారం... అధ్యక్షభవనంలో ట్రంప్ పనితీరుపై కేవలం 33 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా 64 శాతం మంది పెదవి విరిచారు.**

- ట్రంప్‌పై అమెరికా ప్రజల్లో వ్యతిరేకత
- తాజా పోల్‌లో దారుణంగా పడిపోయిన రేటింగ్

**వాషింగ్టన్, ఆగస్టు 19 :** మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్ పదవీకాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన ప్రతిష్ట దిగజారిపోయింది. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ఇప్పుడప్పుడే ముగియబోదని, అది దీర్ఘకాలం కొనసాగుతుందని మెజారిటీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రాయిటర్స్/ఇప్సాస్ నిర్వహించిన పోల్ ప్రకారం...అధ్యక్షభవనంలో ట్రంప్ పనితీరుపై కేవలం 33 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా 64 శాతం మంది పెదవి విరిచారు. ఈ నెల ప్రారంభంలో ట్రంప్ పాలనకు 35 శాతం మంది ఓకే చెప్పగా ఇప్పుడు ఆ రేటింగ్ మరింత దిగజారింది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ట్రంప్ రేటింగ్ ఇంతలా పడిపోవడం ఇదే మొదటిసారి. 2017 డిసెంబరులో...అంటే ట్రంప్ తొలి పాలనలో కూడా రేటింగ్ ఇదే స్థాయిలో పడిపోయింది.

మిత్రదేశమైన ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులకు ఆదేశాలు ఇచ్చిన తర్వాత ట్రంప్ ప్రజాదరణ బాగా దెబ్బతిన్నది. పెరిగిన పెట్రో ధరలు అమెరికా కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతానని, దీర్ఘకాలిక యుద్ధాలను నివారిస్తానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ట్రంప్ వాటిని నెరవేర్చడంలో విఫలమయ్యారు. ఇరాన్‌లో అమెరికా ప్రమేయం దీర్ఘకాలం కొనసాగుతుందని ఏకంగా 80 శాతం మంది అమెరికన్లు..వీరిలో 87 శాతం మంది డెమొక్రాట్లు, 71 శాతం మంది రిపబ్లికన్లు...అభిప్రాయపడ్డారు. యుద్ధం కొన్ని వారాలలోనే ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది కేవలం 16 శాతం మంది మాత్రమే.

దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో డెమొక్రాట్ల పనితీరే మెరుగ్గా ఉంటుందని 38 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడగా రిపబ్లికన్ల వైఖరిని 35 శాతం మంది సమర్థించారు. ప్రజల జీవన ప్రమాణాలను కూడా డెమొక్రాట్లే మెరుగుపరుస్తారని మెజారిటీ ఓటర్లు తెలిపారు.

## ఆర్జేడీ అధినేత తేజస్వి అరెస్టు



- బీహార్‌లో ఉద్రిక్తత

**పాట్నా, ఆగస్టు 19 (ఎ.ఎం.ఎస్) :** విద్యార్థులకు మద్దతుగా, పేపర్ లీక్ లను వ్యతిరేకిస్తూ బీహార్ ప్రతిపక్ష నేత ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ బుధవారం రాజ్‌భవన్ మార్చ్ కు పిలుపునిచ్చారు. రాజ్ భవన్ వైపు దూసుకొస్తున్న ఆర్జేడీ శ్రేణులపై పోలీసులు జల ఫిరంగులతో దాడి చేశారు. ఆ తర్వాత తేజస్వి యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్ యువత చైతన్యం పొందిందని, ఈ తరహా ఉద్యమాలను ఎవరూ ఆపలేరని బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. సివాన్ జిల్లాలో గత నెలలో విద్యార్థులనిరసనలపైకి ఏకే47తో కానిస్టేబుల్ కాల్పులు జరిపిన ఘటనకు నిరసనగా ఆర్జేడీ ఈ మార్చ్ చేపట్టింది. విద్యార్థులపైకి ఏకే47తో కాల్పులు జరిపినట్లు బీహార్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో అంగీకరించిందని ఎంపీ మీసా భారతి అన్నారు. AK47 ఉపయోగించేందుకు ఎవరు అనుమతిచ్చారోకోర్టు ప్రభుత్వాన్నిప్రశ్నించాలని ఆమె డిమాండ్ చేశారు.

# సుప్రీం ఆదేశాలను

- సవాల్ చేయనున్న పాక్ ప్రభుత్వం
- ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రికి తరలించేందుకు నో

**ఇస్లామాబాద్, ఆగస్టు 19 :** మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పాకిస్తాన్ ప్రభుత్వం సవాలు చేయనుంది. ఈ తీర్పు ''చట్ట పరిధిలోకి రాదు'' అని మంగళవారం రాత్రి అధికారిక మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో ప్రకటనలో న్యాయశాఖ మంత్రి అజమ్ నజీర్ తరార్ పేర్కొన్నారు. కోర్టు ఆదేశించినట్లుగా ప్రైవేట్ ఆసుపత్రిలో కాకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఇమ్రాన్ ఖాన్‌కు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వం ఒక సమీక్షా పిటిషన్‌ను దాఖలు చేయనుందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు ఈ రకమైన చికిత్సను అందించలేవని, ఆ సేవలను నిర్వహించలేవని నిరూపించే సాక్ష్యాధారాలు లేదా ఆధారాలు సమర్పించినంతవరకు, సాధారణంగా అటువంటి ఏర్పాట్లు చేయరని తరార్ పేర్కొన్నారు. కాగా, ఇమ్రాన్ ఖాన్‌ను రెండు రోజుల్లోగా జైలు నుండి ఇస్లామా



బాద్‌లోని షిఫా అంతర్జాతీయ ఆస్పత్రికి తరలించాల్సిందిగా సుప్రీంకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. వారానికి ఒకసారి కుటుంబసభ్యులను కలిసేందుకు, వారానికి రెండు సార్లు ఆయన కుమారుడితో ఫోన్‌లో మాట్లాడేందుకు కోర్టు అనుమతించింది. వ్యక్తిగత వైద్యుడు ఫైసల్ సుల్తాన్,ఇమ్రాన్ ఖాన్ సోదరి, వైద్యురాలు ఉజ్మా ఖాన్‌లను వైద్య పరీక్షలు, చికిత్సకు అనుమతించింది. ఆస్పత్రి పరిసరాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదని, ఆయన ఆరోగ్య సమాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం వినియోగించకూడదని హెచ్చరించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించినట్లైతే.. ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటామని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 16కి వాయిదా వేసింది.

# డాగ్ స్టెరిలైజేషన్ లో అవినీతి..

- వినూత్నంగా ఫిర్యాదు

**భోపాల్, ఆగస్టు 19 (ఎ.ఎం.ఎస్) :** మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా కలెక్టరేట్ కార్యాలయంలో కాంగ్రెస్‌నేత దీపక్ ముల్లు రాథోడ్.. వీధికుక్కల స్టెరిలైజేషన్ (కుక్కల సంతానోత్పత్తి నిరోధక ప్రక్రియ) పథకంలో జరిగిన అవినీతిని నిరసిస్తూ వినూత్న రీతిలో ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తికి కుక్క మాస్క్ తొడిగించి ప్రజా విచారణ సభకు తీసుకువచ్చారు. గత 4 ఏళ్లలో వీధి కుక్కల స్టెరిలైజేషన్ (కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్) కోసం మున్సిపల్ కార్పొరేషన్ దాదాపు రూ.40 లక్షల బడ్జెట్ ఖర్చు చేసింది. అయినా జిల్లాలో కుక్కల సంఖ్య తగ్గకపోగా, కుక్క కాటు కేసులు 13,225 కి పైగా పెరిగాయని ఆరోపించారు. ఆయన చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ కాశీరామ్ బడోలే దీపక్ రాథోడ్‌కు హామీ ఇచ్చారు.

# కుప్పకూలిన బంగారు గని

- ఆఫ్రికాలో 30 మంది కార్మికులు మృతి

**నానా మంబేరే, ఆగస్టు 19 :** ఆఫ్రికా ఖండంలోని సెంట్రల్ ఆఫ్రికాన్ రిపబ్లిక్ దేశంలో తీవ్ర విషాదం జరిగింది. అక్కడి నానా మంబేరేలో బంగారు గని కుప్పకూలడంతో 30 మంది కార్మికులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. నానామాంబెరే ప్రిఫెక్చర్ పరిధిలోని అబ్బా ప్రాంతంలో ఇవాళ ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. టెక్నికల్ నాలెడ్జ్ లేని, సంప్రదాయ పద్ధతుల్లో తవ్వుతున్న ఈ గని ఒక్కసారిగా కూలిపడిందని ప్రమాదం నుంచి బయటపడిన ఫ్లోరియన్ గాగుండే అనే కార్మికుడు తెలిపాడు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

- సమస్యలతో వచ్చే ఎస్సీ ఎస్టీ ప్రజల పట్ల అధికారులు గౌరవప్రదంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్, ఎస్పీల సేవలు అభినందనీయం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 19(వుదయం జిల్లా ప్రతినిధి):**

ఎస్సి, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధుల వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాధ్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలి ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, వాటిని నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు సమయపాలనతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ**

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హత ఉన్న వారికి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.అధికారుల సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. విదేశీ విద్యా, బాధితులకు పరిహారం, కులాంతర వివాహం చెల్లింపులు పెండింగ్ ఉన్నవాటి నివేదిక అందచేయాలని ఎస్సి అభివృద్ధి అధికారిని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాధితులకు కమిషన్ సూచించిన విధంగా ఇళ్ళు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పక పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ అత్యాచార తదితర సంఘటనలపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కమిషన్ నుండి 6 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మూడు కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ కు సభ్యులకు జ్ఞాపిక అందచేశారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు సూర్య నారాయణ, సంపత్ రావు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## డీఎంహెచ్ఓ రాజారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేత



**వరంగల్, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ జిల్లా నగరంలోనీ కరీమాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రనికి మొట్ట మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా పుష్పగుచ్చం అందజేసిన ఎస్.ఆర్. ఆర్.పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.అనిత. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం కాంటాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , ఎన్ హెచ్ ఎం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి యాదవ్, ఎస్ ఆర్ ఆర్ తోట పట్టణ ఆరోగ్య కేంద్రం అకౌంటెంట్ శ్వేత, ల్యాబ్ టెక్నీషియన్ మౌనిక డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రాజిరెడ్డి కీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులుంటే దరఖాస్తు చేసుకోవాలి

**కలెక్టర్ తేజస్**

**సూర్యాపేట, ఆగస్టు 19: వుదయం ప్రతినిధి**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోస్ట్ డ్రాఫ్ట్ కార్యకలాపాలు మరియు డ్రాఫ్ట్ పబ్లికేషన్ గురించి బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోస్ట్ డ్రాఫ్ట్ దరఖాస్తులు అయిన తర్వాత చేయవలసిన ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. సర్ ప్రక్రియలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ల జాబితాలో ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు డ్రాఫ్ట్ రోల్ ను అందించడం జరిగిందని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు ఓటర్ల జాబితా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుండి సిహెచ్. రాజేశ్వరరావు, బిజెపి నుండి చల్లమల్ల నరసింహ, ఎం.డి. హాబిద్, బిఎస్పి నుండి ఎం. స్టాలిన్, బిఆర్ఎస్ నుండి సత్యానారాయణ, వైఎస్ఆర్సిపి నుండి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



**హనుమకొండ, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**

హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య బుధవారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జయగిరి, అనంతసాగర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. జయగిరి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి, అక్కడ అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ తీరును డాక్టర్ అప్పయ్య పరిశీలించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవనాన్ని గ్రామస్తులతో కలిసి వీక్షించారు. అనంతసాగర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవన పనులను టీజీఎమ్ఐడీసీ (TGMIDC) ఏఈ రత్నాకర్, స్థానిక సర్పంచ్ మరియు ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హసన్‌పర్తి వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం భార్గవ్, జయగిరి సర్పంచ్ వెంకటేశ్వర్లు, అనంతసాగర్ సర్పంచ్ దయాకర్, పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్, హెల్త్ సూపర్‌వైజర్ లచ్చు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌పుట్ డీలర్లు రైతులకు సాంకేతిక సహాయకులుగా పనిచేయాలి

**ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)**

దేశీ శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం చుంచుపల్లి రైతు వేదికలో డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌పుట్ డీలర్లు కేవలం వ్యాపారులుగా కాకుండా రైతులకు వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని అందించే పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్స్‌గా కీలకపాత్ర పోషించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల మార్పిడి తదితర అంశాలను రైతులకు చేరవేసి వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్, కూరగాయలు, మిరప తదితర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఒకే రకమైన పంటలను వరుసగా సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం ఉన్నందున భూసార పరిరక్షణ, సేంద్రియ కర్బనం పెంపు, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సుమారు 37 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సుమారు 2,300 చెరువుల్లో 35 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నందున మట్టి తేమ, భూసార పరీక్షలు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇవ్వాలని తెలిపారు.

**రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి**

వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించేలా ఇన్‌పుట్ డీలర్లు సహకరించాలన్నారు. దేశీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుడిపాటి విజయభాస్కర్ గోల్డ్ మెడల్, అనగారి కళ్యాణ్ సిల్వర్ మెడల్ సాధించినందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులకు కలెక్టర్ అంకిత్ పంపిణీ చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు.

**తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూ భారతి, సాదా బైనామా కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం దరఖాస్తులు, పరిశీలనలో ఉన్నవి, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును దరఖాస్తుల వారీగా పరిశీలించి, అది ఎందుకు పెండింగ్‌లో ఉంది, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు, ఇంకా ఏ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అవసరమైన విచారణ, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత నివేదికల ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పరిష్కరించిన దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం విచారణ జరిపి, సంబంధిత రికార్డులు, ఆధారాలు, నివేదికలను పరిశీలించిన తర్వాతే పరిష్కరించారా అనే అంశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సాదా బైనామా దరఖాస్తుల్లో భూమికి సంబంధించిన రికార్డులు, హక్కులు, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన పత్రాలు లేదా సమాచారం లోపించిన సందర్భంలో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం తదితర సేవలకు సంబంధించిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కారానికి పడుతున్న సమయం, పెండింగ్ వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత కాలపరిమితిలో జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజలు తమ భూములు, హక్కులు, ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, వారి దరఖాస్తులను నిబంధనల మేరకు పారదర్శకంగా, వేగంగా పరిష్కరించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఏ దరఖాస్తును అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ప్రతి దరఖాస్తును దరఖాస్తుల వారీగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిణి, ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు, బాలికల భద్రతే ధ్యేయం

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి) :**

మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం సమాజంలో అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా నిర్భయ ఫండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్భయ ఫండ్ ద్వారా పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన "మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు" కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో మహిళా-స్నేహపూర్వక పట్టణ ప్రదేశాలను సృష్టించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భద్రత, రవాణా, ప్రజా ప్రదేశాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, దానికి తగిన సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆయన అన్నారు. స్థానిక సంఘాలు, ప్రభుత్వ శాఖలు, పౌర సంఘాల సమన్వయంతో ఆచరణాత్మక పరిష్కారాలు చూపుతూ, పట్టణ ప్రణాళికలు మరియు పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం. కమిటీ రూపొందించిన భద్రతా ప్రణాళికలు, ప్రతిపాదనలను ప్రభుత్వ అనుమతి కోసం పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఈపీ. ప్రేమలత, డిఎస్పి కిషోర్ కుమార్, జిల్లా రవాణా అధికారి ఠాకూర్ ఈశ్వర్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, టూరిజం అసిస్టెంట్ మేనేజర్ సూర్య కిరణ్, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి, సఖి కేంద్రం సెంటర్ అడ్మిన్ లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి, సేవలు మెరుగుపరచాలి



**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి) :**

జనగామ మున్సిపాలిటీలో పౌర సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు ఆదాయ వనరుల పెంపునకు పక్కా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమగ్ర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులకు రూట్ మ్యాప్ సిద్ధం చేసి, మున్సిపల్ వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని, స్వచ్ఛ ఆటోలను కేటాయించి చెత్త సేకరణ క్రమబద్ధంగా చేపట్టాలి. ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్‌మెంట్ ఛార్జీల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలి. అనుమతులు, అక్రమ నిర్మాణాలు నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణ అనుమతులు, లైసెన్సులు నిర్ణీత సమయంలో జారీ చేయాలి. అనుమతి లేని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

జనన-మరణ ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలి. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, బాధ్యతాయుతంగా పనిచేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి పౌరులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, మేనేజర్ ప్రభాకర్, డీఈ రాజ్‌కుమార్, వార్డు అధికారులు, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని ఆలోచనను ఉపసంహరించుకోవాలి**

**యాదాద్రి భువనగిరి జిల్లా, 19 ఆగస్టు 2026**

పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందినీ ఆయన అన్నారు. వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్ ఆలోచన చేయడం సరి కాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని లేని ఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ జిల్లా సహాయ కార్యదర్శి చిప్పలపల్లి నవీన్ యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కంబాల నరసింహ విద్యార్థులు అశోక్ సాయి విష్ణు ఉదయ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## బాల్య వివాహాలకు సహకరిస్తే చర్యలు తప్పవు

**ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్పు చేస్తే చర్యలు**

**మహబూబాబాద్, ఆగస్ట్ 19 (వుదయం ప్రతినిధి) :**

జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలోని మీసేవ నిర్వాహకులకు బాల్య వివాహ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహం జరుపుతున్న తల్లిదండ్రులు,మధ్యవర్తుల సహాయంతో, కొంతమంది మీ సేవ నిర్వాహకుల సహకారం తో ఆధార్ కార్డులు మార్చి, బాల్య వివాహాలకు సహకరిస్తున్నారని మాకు సమాచారం వచ్చింది అని, అటువంటి వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిదని అన్నారు.

జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, అందులో ఎక్కువగా తల్లిదండ్రులు పిల్లలు చదువుకున్నా కానీ చదువుకోలేదని చెప్పి , పిల్లల ఆధార్ కార్డు లో పుట్టిన తేదీ మార్పులు చేసి ,18 సంవత్సరాలు నిండాయని , బాల్య వివాహం చేసుకునే వారిని ఒప్పించి వివాహాలు చేస్తున్నారని, వారికి గ్రామస్థాయి నుంచి మరియు మీ సేవలో నుంచి సహకారం ఉంటుందని, ఎవరైనా అటువంటి చర్యలు చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ,బాల్య వివాహం నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్యవివాహానికి సహకరించే అందరూ శిక్షకు అర్హులేనని అన్నారు. వయసు నిర్ధారణకు ఆధార్ కార్డు ప్రామాణికం కాదని పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా స్టడీ సర్టిఫికెట్ మాత్రమేనని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి నరేష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ మహేశ్వరి, జెండర్ స్పెషలిస్ట్ అరుణ, మీసేవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్‌సీడీ లక్ష్యాలను 100 శాతం సాధించాలి

**డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి**

**వరంగల్, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**

జాతీయ అసంక్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమం (NCD) లక్ష్యాలను ఈ నెల చివరి నాటికి 100 శాతం సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. బి. రాజా రెడ్డి ఆదేశించారు. బుధవారం వరంగల్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ నర్సింగ్ ఆఫీసర్లు, నోడల్ పర్యవేక్షకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. 30 ఏళ్లు పైబడిన అందరికీ క్రమం తప్పకుండా స్క్రీనింగ్ నిర్వహించి మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా. సయ్యద్ ఇక్తిదార్ అహ్మద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్లు ఆర్. ప్రకాష్, ఎన్. శ్రీనివాస్ కర్ణ తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ పట్టణంలో అరణ్య కేఫ్ ప్రారంభం

**నల్లగొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 19**

నల్గొండలో డి.వి.కె. రోడ్డులో టీవీఎస్ ప్రదర్శనశాలషోరూమ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అరణ్య కేఫ్ బుధవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మొహమ్మద్ అశ్రఫ్ అలీ ముఖ్య అతిథిగా హాజరై కేఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నల్లగొండ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో అరణ్య కేఫ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత జీవనశైలికి అనుగుణంగా టీ, కాఫీతో పాటు టిఫిన్స్, అల్పాహారం, భోజనం, వివిధ రకాల చిరుతిళ్లను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ కేఫ్ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం 25వ డివిజన్ కార్పొరేటర్ వంగూరి నవ్యశ్రీ రాఖీ, 10వ డివిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణంరాజు యాదవ్ తదితరులు కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అరణ్య కేఫ్ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ సింగం రామలింగయ్య, ప్రొపరైటర్ సింగం కార్తీక్, బొల్లం సురేష్, బత్తుల నేతాజీ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు ఏర్పుల వెంకన్నతో పాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి
- డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఈఓ
- పాల్గొన్న హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆగస్టు 19 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

రాష్ట్రంలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిపై సమీక్ష జరిపారు. హన్మకొండ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఇటీవల (ఆగస్టు 17న) విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ జాబితా వివరాలను వారికి స్పష్టంగా వివరించి, వారందించే అభిప్రాయాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన అనామలీస్ (Anomalies), మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, వారు వివరణ ఇచ్చుకునేలా తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ ఉన్న వారికి నోటీసులు జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు వెంకటేష్, వెంకన, ఎలక్షన్ సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణ: ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**గత పదేళ్లలో రూ.900 కోట్ల రహదారి పనులు.. ప్రస్తుతం రూ.1,700 కోట్ల పనులు మంజూరు**

**ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి**

**ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ పూర్తి చేసేలా చర్యలు**

**హెచ్‌ఏఎం విధానంలో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం కాంట్రాక్టర్ భాగస్వామ్యం**

**పెద్దపల్లి( సుల్తానాబాద్ ) ఆగస్టు - 19 (వుదయం ప్రతినిధి)**

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో బుధవారం రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం), నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి శంకుస్థాపన చేసారు. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజలు మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఎమ్మెల్యే విజయరమణారావు ఎల్లప్పుడూ పెద్దపల్లి అభివృద్ధి గురించే ఆలోచిస్తూ పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.17 వేల కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత భారీ మొత్తంలో రహదారి పనులు చేపట్టడం లేదన్నారు. హెచ్‌ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులు భరించే విధంగా పనులు చేపడుతున్నామని, నేడు శంకుస్థాపన చేసిన రహదారి పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని తెలిపారు. పనులు వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని చెప్పారు.రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. రహదారులు సంక్షేమ పథకాలతో సమానంగా అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నుంచి రామగుండం వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును చేపడుతోందని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి సాగునీరు అందించడంతో రికార్డు స్థాయిలో సాగు నమోదైందని తెలిపారు. నెహ్రూ హయాంలో నిర్మించిన అనేక ప్రాజెక్టులు ఇప్పటికీ సురక్షితంగా ఉండి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయని పేర్కొన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయరమణారావు విక్రమార్కుడిలా ప్రజలు, రైతుల కోసం నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నారని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కఠిన పరిస్థితుల్లోనూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల అన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మిస్తున్నామని, ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇటీవల టీమ్స్ ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు విఫలమైన సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సహకారం లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గోదావరి, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా



వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి మరో 6 వేల ఎకరాల సాగు అవసరమని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్, రుణమాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించిందని, అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు రైతుల నుంచి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మొక్కజొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల విలువైన రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు.ప్రభుత్వ విప్ విజయరమణారావు కృషితో పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్త పోలీస్ స్టేషన్, అవసరమైన ప్రభుత్వ భవనాలు, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రూ.1,700 కోట్ల రహదారి పనులతో రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను వేగంగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో రైస్‌మిల్లులు అధికంగా ఉన్నందున గోదాముల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎలాంటి కోతలు లేకుండా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి సంవత్సరంలో 3,500 ఇళ్లు మంజూరు చేయగా, ప్రస్తుతం మరో 2 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో మహిళలకు అందించిన పావలా వడ్డీ రుణాల పథకాన్ని విస్మరించారని, ప్రస్తుత ప్రభుత్వం వడ్డీలేని రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్–రామగుండం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల్లో పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రుల సహకారంతో సుమారు రూ.180 కోట్ల విలువైన హెచ్‌ఏఎం రహదారి పనులకు నేడు శంకుస్థాపన చేశామని అన్నారు.జూలపల్లి మండల కేంద్రంలో రూ.15 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులు, కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో రూ.7.35 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులు, గంగారం, ఉషన్నపల్లి, పాండిల్ల గ్రామాల్లో రూ.17 కోట్లతో సింగిల్ లేన్ రహదారులను డబుల్ లేన్‌గా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్దపల్లి బైపాస్ రహదారికి మంజూరు వచ్చినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.82 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. భూసేకరణకు అవసరమైన మరో రూ.27 కోట్లను ముఖ్యమంత్రి సహకారంతో త్వరలో విడుదల చేయిస్తామని, ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ రహదారిని పూర్తి చేసి ఆర్అండ్‌బీ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సుల్తానాబాద్ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున బైపాస్ రహదారి అత్యవసరమని ప్రభుత్వ విప్ తెలిపారు. రాజీవ్ రహదారి పరిధిలో సుల్తానాబాద్ బైపాస్ నిర్మాణానికి అవకాశం ఉందని, భూసేకరణ పూర్తి చేయాల్సి ఉందన్నారు.

# మొబైల్ ఫోన్ పోయిన చోరికి గురైనా www.ceir.gov.in CEIR అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలి...

**జిల్లా పరిధిలో పోగొట్టుకున్న చోరికి గురైన 102 మొబైల్ ఫోన్లను (సుమారు 21లక్షల విలువగల ) బాధితులకు అందజేత...**

**సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

**జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**

**జగిత్యాల ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)**

సెల్ ఫోన్ పోయిన చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న చోరి గురైన 102 మొబైల్ ఫోన్లను (సుమారు 21లక్షల రూపాయల విలువగల) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సిఈఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సిఈఐఆర్ వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఇద్దరు కానిస్టేబుల్‌లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2024 (4.5 కోట్ల విలువగల) ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారం గురించి నష్టాన్ని కాజేస్తుందన్నారు ఇది వ్యక్తిగత సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్లను నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సిఈఐఆర్ వెబ్సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు అదే విదంగా ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్ లు కొనే ముందు అప్లికేషన్లో అట్టి ఫోన్ యొక్క వివరాలను అనగా ఐఎంఈఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలని తద్వారా అట్టి ఫోన్ ఆ ఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుందన్నారు. అదే విధంగా ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సిఈఐఆర్ టీం ను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు. సైబర్ మోసాలపైప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడి కొట్టించి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వాటిపై అందరు




అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడమే మంచిదని ఇంటర్నేషనల్ కాల్స్ కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. అజ్ఞాత వ్యక్తులకు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని సూచించారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930 ఫోన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులు తమ యొక్క ఫోన్ పోయినా విధానాన్ని వారు ఫోన్ పోయినప్పుడు అవలంబించిన విధానాన్ని తెలియజేశారు. సాంకేతికతను ఉపయోగించి పోయిన సెల్ఫోన్లను తిరిగి కనిపెట్టి తమకు ఇచ్చినందుకు బాధితులు ఎస్పీ కి చాలా ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐటి కోర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ సిఈఐఆర్ టీం హెడ్ కానిస్టేబుల్ మహుముద్ కానిస్టేబుల్లు మల్లేశం అజర్ అనూష ప్రశాంత్ పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**



గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన తెలంగాణకు చెందిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించే దిశగా రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు బుధవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించారు, ఇండియన్ ఎంబసీ అంబాసిడర్ హర్షకుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్‌లతో కమిటీ సభ్యులు వలస కార్మికుల సంక్షేమం, వలస విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు, అనంతరం కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫిలిప్పీన్స్‌లో అమలవుతున్న వలస విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు.ఫిలిప్పీన్స్ విధానాలపై అధ్యయనం..ప్రపంచంలో అత్యుత్తమ వలస విధానాలను అమలు చేస్తున్న దేశాల్లో ఫిలిప్పీన్స్ ఒకటని, అక్కడ అమలవుతున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. గల్ఫ్ కార్మికుల రక్షణ, సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహాలో మెరుగైన విధానాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.సీఎం ఆలోచనలకు అనుగుణంగా..గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా మెరుగైన వలస విధానాన్ని రూపొందించాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే కమిటీ పర్యటన కొనసాగుతోందని తెలిపారు. విదేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణ కార్మికుల భద్రత, హక్కులు, సంక్షేమానికి మరింత ప్రాధాన్యం కల్పించేలా సమగ్ర విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

# ధర్మపురిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి**

**ధర్మపురి, ఆగస్ట్19 (వుదయం ప్రతినిధి):**

ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రాధాన్య మిస్తోందని మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చొరవతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిం చారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన సాల పల్లె,నర్సయ్యపల్లె,ధర్మపురి మార్గాన్ని మంత్రి పరిశీలించి ఇచ్చిన హామీ మేరకు నూతన రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పోతంశెట్టి నర్సయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు.కోరండ్లపల్లెలో ఏళ్ల తరబడి నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి రూ.4.10 లక్షల వ్యయంతో కిలోమీటర్ మేర 18 కొత్త స్తంభాలు, విద్యుత్ లైన్ పనులను 9వ వార్డు కౌన్సిలర్ విరవేణి నాగలక్ష్మితో కలిసి



ప్రా రంభించారు.నిరంతర విద్యు త్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈకార్యక్రమాల్లో ఎంపీడీ వో రవీం దర్,ఎంపీవో నరేష్,విద్యుత్ శాఖ డీఈ,ఏఈలు,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, సర్పం చుల ఫోరం అధ్య క్షుడు కాసారపు బాలగౌడ్, కౌన్సి లర్లు ఒజ్జల లక్ష్మ ణ్,చిపిరిశెట్టి రాజేశ్,కో–ఆప్షన్ సభ్యు రాలు ఆశెట్టి మమత తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 19 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బాసర మండలం బిద్రెల్లి సమీపంలో ఇటీవలి భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమేరకు రోడ్లు దెబ్బతిన్నాయో అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రహదారులు ఉండాలన్నారు. అవసరమైన సూచికల బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసిల్దార్ పవన చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిజామాబాద్, ఆగస్టు 19 :**



జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమరవాది లో బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి శ్రీకారం...

**-రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించిన మంత్రి వివేక్**

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాడి ప్రాంతంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న ఈ నిర్మాణ పనులను బుధవారం మంత్రి వివేక్ ప్రారంభించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా ఘాట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీలో గతంలో సరైన అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు వివిధ వార్డుల్లో మార్నింగ్ వాక్ నిర్వహించానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.




క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇప్పటికే సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం, ఐమాక్స్ లైట్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఇంటింటికీ తాగునీరు అందించేందుకు అమృత్ 2.0 పనులు ...మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేలా పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక వేదిక..అమరవాదిలో నిర్మించనున్న బతుకమ్మ ఘాట్‌తో స్థానిక మహిళలకు బతుకమ్మ పండుగ సమయంలో ప్రత్యేకంగా ఉపయోగపడే వేదిక అందుబాటులోకి రానుంది. పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఘాట్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. మున్సిపల్ నిధులతో చేపడుతున్న ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వుదయం ప్రతినిధి, ఆగస్టు 19:**

ఆసిఫాబాద్ నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడత నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత పురోగతి, రెండో విడత లబ్ధిదారుల జాబితాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 8,851 ఇళ్లు మంజూరు కాగా, సుమారు 1,100 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను నివేదిక రూపంలో సమర్పించి, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బేస్‌మెంట్, రూఫ్, స్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి పురోగతి సాధించాలని సూచించారు.రెండో విడత



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో ఒక్క అనర్హుడికి కూడా చోటు ఉండకూడదని, అర్హులైన వారినే ఎంపిక చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వస్తున్న దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అర్హులైన వారి పేర్లను గ్రామ సభల ద్వారా తీర్మానం చేసి జాబితాలో చేర్చాలని తెలిపారు.ప్రతి లబ్ధిదారుడి ఇంటికి అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, మున్సిపాలిటీల పరిధిలో రూఫ్ ఉన్నప్పటికీ స్లాబ్ వేసుకునే స్తోమత లేని అర్హులైన కుటుంబాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్‌రావు, మేనేజర్ పుష్పలత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**

ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. బుధవారం జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన సిర్పూరె బాపూరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన, బాపూరావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ సోర్తే గజానన్ తల్లి రుక్మాబాయి, సావాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు టింగన్ రాందాస్ సతీమణి సుశీల మృతిపట్ల కంది శ్రీనివాస రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వారి నివాసాలకు వెళ్లి



కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావు, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, జైనథ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి, సర్పంచులు జనగ రామన్న, పొచ్చిరామ్, మహిపాల్ రెడ్డి, నాయకులు ఎంఏ షకీల్, దర్శనాల లక్ష్మణ్, సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి, అయాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భూత్పూర్ సబ్ స్టేషన్ తనిఖీ



మహబూబ్ నగర్ ఆగస్టు 19(వుదయం ప్రతినిధి)

భూత్పూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పనితీరును పరిశీలించిన సీఎండీ సబ్‌స్టేషన్‌పై ఉన్న విద్యుత్ లోడ్, ప్రస్తుతం కొనసాగుతున్న విద్యుత్ సరఫరా పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ నుంచి ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది, ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు ఉన్నాయా అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ వినియోగం,డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని సీఎండీ అధికారులకు సూచించారు.

సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ సరఫరా పరిస్థితులు, సాంకేతిక సమస్యలు, లోడ్ వివరాలను అధికారులు సీఎండీకి వివరించారు.

ఈ తనిఖీలో టీజీఎస్పీడీసీఎల్ ఎస్.ఈ .భీమనాయకక్ డి.ఈ చంద్ర మౌళి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం..భక్తుల భద్రతకు పెద్దపీట

- ఆధ్యాత్మిక–పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి కార్యాచరణ
- నిజాం కొండ అభివృద్ధికి ప్రతిపాదనలు.. నదీతీరంలో రక్షణ చర్యలు ముమ్మరం

ఎర్రవల్లి ఆగస్టు 19 (వుదయం బ్యూరో)



ప్రముఖ పుణ్యక్షేత్రం బీచుపల్లికి మహర్దశ పట్టనుంది. ఆధ్యాత్మికతకు పర్యాటక ఆకర్షణలను జోడించి బీచుపల్లిని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, పటిష్టమైన భద్రత కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ స్వాగతం పలికిన అనంతరం కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అపరిశుభ్రతపై ఆగ్రహంఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్‌కు అక్కడి అపరిశుభ్ర వాతావరణం, చెత్తాచెదారం, పందుల సంచారం కనిపించడంతో అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన బీచుపల్లికి వచ్చే భక్తులకు ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకూడదని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాన్ని భక్తులను ఆకట్టుకునేలా సుందరీకరించడంతో పాటు ప్రత్యేక లైటింగ్, అలంకరణలు ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రతలో రాజీ వద్దుభక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినీ పార్క్, ఫౌంటెన్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు.

ఆలయ పరిసరాల్లోని ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు నిబంధనల మేరకు నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిజాం కొండకు కొత్త రూపం బీచుపల్లి పరిసరాల్లోని నిజాం కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను పర్యాటక శాఖకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. బీచుపల్లిని కేవలం ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా పర్యాటకులను ఆకర్షించేలా సమగ్రంగా అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నదీతీరంలో 'రక్షణ కవచం' కృష్ణా నదీతీరంలో భక్తులు, పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, రక్షణ తాళ్లు, రెస్క్యూ బోట్ తదితర పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణనష్టానికి ఆస్కారం లేకుండా ముందస్తు రక్షణ చర్యలు పటిష్ఠంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్ బీచుపల్లి క్షేత్ర విశిష్టత, ఆలయ చరిత్ర, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న వసతుల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నరేష్, ఈఓ పురేందర్, పంచాయతీ కార్యదర్శి అరుణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, ఆగస్టు 19, (వుదయం బ్యూరో)

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగ యువతీ యువకులతో కలెక్టర్ మాట్లాడి వారి చదువు ప్రణాళిక, రోజువారీ అధ్యయన సమయం, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్ట ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని సంబంధిత సిలబస్, పరీక్ష విధానం, గత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలని సూచించారు. క్రమశిక్షణతో నిరంతర సాధన, మాక్ టెస్టులు, పునశ్చరణతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు.జనరల్ స్టడీస్, జనరల్ నాలెడ్జ్, చరిత్ర, భూగోళశాస్త్రం, రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను పరిశీలించిన కలెక్టర్.. సమకాలీన అంశాలపై అవగాహన కోసం ప్రతిరోజూ దినపత్రికలు చదవాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ పత్రికలను వినియోగించుకోవాలని తెలిపారు. డిజిటల్ గ్రంథాలయ సేవలు, ఆన్‌లైన్ అధ్యయన వనరులను కూడా సద్వినియోగం చేసుకోవాలని,సోషల్ మీడియాతో సమయం వృథా చేయకుండా సాంకేతికతను లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని హితవు పలికారు. జిల్లా గ్రంథాలయంలో చరిత్రకు సంబంధించిన 18,108 పుస్తకాలు, తెలుగు 9,768, ఇంగ్లిష్ 3,632, హిందీ 2,874, ఉర్దూ 1,726 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే పోటీ పరీక్షలకు అవసరమైన తాజా సమాచారంతో 2,907 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. యువతకు అవసరమైన పుస్తకాలు, సమాచార వనరులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉందని, దానిని సరైన దిశలో వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.

## పాత పాఠశాల భవనం కూల్చివేత పై సమగ్ర విచారణకు డిమాండ్

నారాయణపేట ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండలం సారంగరావుపల్లి గ్రామపంచాయతీలో పాత ప్రభుత్వ పాఠశాల భవనాన్ని గ్రామసభ, పంచాయతీ సమావేశం నిర్వహించకుండా, గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆగస్టు 14వ తేదీ రాత్రి కూల్చివేశారని గ్రామ ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ప్రజలతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. 1980ల కాలంలో అప్పటి మాజీ సర్పంచ్ హయాంలో గ్రామ ప్రజల ఆమోదంతో నిర్మించిన పాత పాఠశాల భవనాన్ని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి ఎవరికీ సమాచారం లేకుండా రాత్రికి రాత్రే జేసీబీతో కూల్చివేశారని ఆరోపించారు. గ్రామసభ నిర్వహించలేదని, పంచాయతీ సమావేశంలో ఎలాంటి తీర్మానం చేయలేదని, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు తండాల ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో అధికారులు ఎవరు సహకరించారు అనే అంశాలను అధికారులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.సారంగరావుపల్లి గ్రామానికి మొదటగా ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి గ్రామపంచాయతీ భవనం మంజూరైందని గ్రామ ప్రజలు తెలిపారు. ప్రభుత్వ, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించి, పంచాయతీ సమావేశంలో ప్రజల ఆమోదంతో సర్వే నంబర్ 28లో నాలుగు తండాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టామని మాజీ ప్రజాప్రతినిధులు తెలిపారు.

సుబ్బానాయక్ తండాకు సంబంధించిన మరో అంశాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జాతీయ జెండా ఎగురవేసే స్థలంలో ఉన్న భవనం, జెండాను తొలగించారని, ప్రస్తుతం అక్కడ ఎలాంటి నిర్మాణం లేకుండా ఖాళీగా ఉందని అమ్రన్ నాయక్ తెలిపారు. ఈ వ్యవహారంపై స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత ఇతరుల పాత్రపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.పాత పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రే కూల్చివేసిన ఘటనతో పాటు, అనుమతులు లేకుండా నిర్మించినట్లు ఆరోపణలు ఉన్న భవనానికి బిల్లులు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పీఆర్ఏఈ అంజిరెడ్డి, పీఆర్డీఈ, కాంట్రాక్టర్ కిషన్ నాయక్ తదితర బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే విధుల నుంచి తొలగించాలని కోరారు.అనుమతులు లేని భవనానికి ఎలాంటి ప్రభుత్వ బిల్లులు చెల్లించకుండా వెంటనే నిలిపివేయాలని, నిబంధనల ప్రకారం మంజూరై ప్రజల ఆమోదంతో నిర్మించిన భవనానికి సంబంధించిన బిల్లులను పరిశీలించి చెల్లించాలని కోరారు. అలాగే అక్రమ నిర్మాణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించడాన్ని తాము బహిష్కరిస్తామని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.ఈ వ్యవహారానికి సంబంధించి ఆర్టీఐ దరఖాస్తులు, సంబంధిత పత్రాలు, ప్రొసీడింగ్ కాపీలు తదితర ఆధారాలను అధికారులకు అందజేసినట్లు తెలిపారు. పాత పాఠశాల భవనం కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చింది ఎవరు, కూల్చివేతకు అనుమతి ఉందా, నిర్మాణానికి నిధులు ఎలా మంజూరయ్యాయి, బిల్లులు ఎవరికి చెల్లించారు, అధికారుల పాత్ర ఏమిటి అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.చందర్ నాయక్, సారంగరావుపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, అమ్రన్ నాయక్, మాజీ సర్పంచ్ రమేష్ తదితరులు మాట్లాడుతూ ఈ వ్యవహారంపై పూర్తి నిజాలను వెలికితీసి, ప్రభుత్వ ఆస్తులు, ప్రజాధనాన్ని పరిరక్షించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు కలెక్టర్ కార్యాలయంలో గత రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు.



## కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మిక తనిఖీలు & ముఖ్యమైన ఆదేశాలు



వనపర్తి ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)

పాము కాటు ఘటనలపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కానాయిపల్లి ఆర్అండ్ఆర్ కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాము కాటుకు గురైన వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించి, జిల్లాలో పాము కాటు కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వైద్యాధికారులు పూర్తి అప్రమత్తతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కొత్తకోట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి పలు అంశాలపై వైద్య అధికారులతో సమీక్షించారు.

కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలో యాంటీ స్నేక్ వెనం(పాము కాటు మందు), కుక్క కాటు మందుల లభ్యత, నిల్వలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని పాము కాటు కేసులకు మందులను వినియోగించారు, వాటి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఇటీవల మదనాపూర్ మండలంలో జరిగిన పాము కాటు ఘటనపై వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాము కాటుకు గురైన వ్యక్తి ఆసుపత్రికి వచ్చిన వెంటనే పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన మేరకు పాము కాటు మందు అందిస్తూ సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాము, కుక్క కాటు మందుల లభ్యత, నిల్వలు, వినియోగంపై సమగ్ర నివేదికను సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పాము కాటు ఘటనల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రాణనష్టం జరగకుండా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనంతరం ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి గర్భిణికి హెమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు అవసరమైన మందులు, మెరుగైన వైద్యం అందిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ సందర్భంగా ఆస్పత్రి కి వచ్చిన గర్భిణి పార్వతితో కలెక్టర్ మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ కేంద్రంలో సమస్యల పరిష్కారానికి చర్యలు కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కేంద్రంలో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

స్థానికులు లెవలింగ్ పనులు, వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.లెవలింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో సక్రమంగా పూర్తి చేయాలని, వర్షపు నీరు నిలిచిపోకుండా సక్రమంగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆర్ అండ్ ఆర్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

### 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

కొత్తకోటలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల్లో ఫిజిక్స్, ఇంగ్లీష్, గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని కూడా ఆరా తీశారు.

ప్రత్యేక తరగతులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఎంఈఓ నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నీటి పారుదల శాఖ అధికారులు డిప్యూటీ సీ ఈ వెంకట్ రెడ్డి, ఎస్ ఈ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో యాదయ్య, డి ఎం హెచ్ ఓ భాస్కర్ నాయక్, కానాయి పల్లి సర్పంచ్, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## రైస్ మిల్లర్లపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు

- కోట్ల విలువైన ధాన్యం పక్కదారి
- బెంజ్ కార్లలో రైస్ మిల్లర్లు ఊరేగుతున్నారని వ్యాఖ్య
- రేవంత్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ప్రభుత్వ ఖజానాకు నష్టం చేస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు చేపట్టాలని కోరిన ఎమ్మెల్యే

వుదయం, దుబ్బాక ప్రతినిధి

రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించి వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.రూ.50 లక్షలు కూడా విలువ చేయని రైస్ మిల్లుల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ధాన్యం పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దుబ్బాక నుంచే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

సంగారెడ్డి వుదయం

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఆర్అండ్‌బీ రోడ్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల పురోగతిపై కలెక్టర్‌తో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన బోర్ల ఏర్పాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల అభివృద్ధిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే CSR, DMFT, MST తదితర నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, అందుబాటులో ఉన్న నిధులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు పెండింగ్



పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు సూచించారు .ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెడ బండకు కొత్త రూపు.. ప్రజల ముంగిట్లో పాలన

- నూతన పంచాయతీ కార్యాలయం ప్రారంభం.. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల ఆగస్టు 19 (వుదయం బ్యూరో)

గ్రామాలు బలోపేతమైతేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతాయని గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పంచాయతీ కార్యాలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గద్వాల మండలం జిల్లెడ బండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు.రిబ్బన్ కట్ చేసి నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పచ్చదనం,



పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజల సమస్యలు స్థానికంగానే పరిష్కారమయ్యేలా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

**గ్రామం బాగుంటేనే దేశం బాగుంటుంది'**

గ్రామాభివృద్ధి అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే అది సంపూర్ణమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నీరు, విద్యుత్ వసతులు మెరుగుపడటంతో వ్యవసాయ రంగం పుంజుకుందని చెప్పారు. రైతులకు రెండు పంటలకు అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాగునీటి వసతులు మెరుగుపడితే రైతుల ఆదాయం పెరగడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లోనే నిర్మాణం పూర్తి జిల్లెడ బండలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఎనిమిది నెలల క్రితం పూజా కార్యక్రమాలు నిర్వహించామని, తక్కువ వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. చిన్న గ్రామ పంచాయతీ అయినప్పటికీ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు కార్యాలయ భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేకు ఘన సన్మానం నూతన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సర్పంచ్ నాగేష్ నాయుడు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేష్ నాయుడు మాట్లాడుతూ చిన్న గ్రామ పంచాయతీలకు సైతం కార్యాలయ భవనాలను ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలనను చేరువ చేయడంలో ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులోనూ ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్‌నాయుడు, సత్యరెడ్డి, మాజీ ఎంపీపీ, నాయకులు రమేష్‌రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, కిట్టు, ఎంపీడీవో శైలజ, పంచాయతీ కార్యదర్శి కవిత, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నంబావి మండల కేంద్రంలో ప్రైవేటు భవనాలలో ప్రభుత్వ పాలన



- బిజెపి రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య
- బిజెపి పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి
- బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య

చిన్నంబావి మండలం 19 ( వుదయం రిపోర్టర్ )

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్నమల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెంచిన పింఛన్లు, రైతుబంధు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందుగా ఎన్నికల హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని అని సందర్భంగా అన్నారు. జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నంబావి మండలమైన కనీస అభివృద్ధి లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, కావలి గోపాల్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జింకల కిరణ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్, ధ్రువీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సిద్దిపేట, ఆగస్టు 19 (వుదయం బ్యూరో)

రాష్ట్రంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారి గుర్తింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారాల పంపిణీ మరియు సేకరణ పూర్తయిన తర్వాత మ్యాపింగ్ కాని, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న పౌరులు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై తమ పౌరసత్వాన్ని నిర్ధారించేందుకు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.



క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ మరియు నోటీసుల జారీ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి దశను సమన్వయంతో పర్యవేక్షిస్తూ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల నమోదు, నోటీసులు, దరఖాస్తుల స్థితి లేదా ఇతర వివరాల కోసం ప్రాంతీయ ఎన్నికల అధికారులను సంప్రదించవచ్చు లేదా CEO Telangana ఓటర్ పోర్టల్ ద్వారా తనిఖీ చేయవచ్చు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపుపై నిరసన

**పర్వతగిరి బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు**
**దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయవచ్చు ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానాన్ని మాత్రం ఎప్పటికీ \కూల్చి వేయలేరు**
**మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్**



**పర్వతగిరి ఆగస్టు 19 ( వుదయం ప్రతినిధి ):**
నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నర్సంపేట బంద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పర్వతగిరి మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.అరెస్టయిన మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, తమ హక్కులను కాలరాస్తూ అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను అణచివేసే చర్యలతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ మరింత దెబ్బతింటుందని వారు విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను తెలియజేస్తామని, అక్రమ అరెస్టులను పర్వతగిరి మండల బీఆర్ఎస్ అక్రమ అరెస్టులను తీవ్రంగా తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పోలీసులు , అధికార యత్రాంగం ,
కలిసి తెలంగాణ ఉద్యమ కారుడు దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడాన్ని పర్వతగిరి మండల బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పరిపాలనలో అభివృద్ధి చేయలేని పనులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఐదు సంవత్సరాలలో అభివృద్ధి చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని మాత్రమే కూల్చగలిగారు. కానీ దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానాన్ని మాత్రం ఎప్పటికీ కూల్చలేరని అమర గాని రాజు యాదవ్ పేర్కొన్నారుఅరెస్టయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రంగు కుమార్, మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్, మండల నాయకులు చీమల బిక్షపతి, జూలపల్లి దేవేందర్‌రావు, బొట్ల మధు, రంగు కుమార్ ఫర్టిలైజర్, జంగ వీరమల్లు, ఇస్లావత్ హరీష్, కొప్పు రాజు తదితరులు ఉన్నారు.

# జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా నిరసన.

**వ్యాపార దుకాణాలు పాఠశాలలు బ్యాంకులు హోటల్స్ వివిధ కార్యాలయాలు బంద్.**



**ఖానాపురం, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి):**
నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఉద్యమ కారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని రాత్రిపూట భారీ పోలీస్ బందోబస్తు నడుమ తొలగించడంపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ఎన్ హెచ్ 365 జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా నిరసన శాంతియుతంగా ఆందోళన చేశారు.బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, వివిధ కార్యాలయాలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బందు చేయించి మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి, ఎన్ హెచ్ 365 జాతీయ రహదారి క్రింది బస్టాండు సమీపంలోని గంట పాటు జాతీయ రహదారిపై రాస్తారోకోక, ధర్నా నిరసన తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య, మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలనకు చమత్కార గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని తెలుపుతూ, నర్సంపేట డివిజన్ కేంద్రంలోని మెడికల్ కాలేజీ ఎదుట ప్రైవేట్ స్థలంలో నిర్మించిన పెద్ది విగ్రహాన్ని రాత్రిపూట పోలీస్ భారీ బందోబస్తు నడుమ కూల్చివేయడం అమానుషమని తెలుపుతూ, వెంటనే ప్రభుత్వం కూల్చివేసిన ప్లేస్ లోని మరల ప్రభుత్వమే మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహాన్ని పునర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం నిర్మించని యెడల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులతో కలిసి రాస్తారోకోలు ధర్నాలు నిరసన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
రాస్తారోకో ధర్నా నిరసన బంద్ సందర్భంగా స్థానిక ఎస్ఐ రామ్మోహన్ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తుగానే భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు వల్లెపు శ్రీనివాస్, కోరే సుధాకర్, కాస ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, మమ్మద్ అజహార్, సోషల్ మీడియా ఇన్చార్జి వద్దే రాజశేఖర్, నాయకులు గంగాపురం రాజుగౌడ్, గుగులోతు బాలునాయక్, భూక్య వెంకన్న, జాటోత్ బాలునాయక్, కత్తుల వెంకటేశ్వర్ రావు, పెరమండ్ల సత్యం, చంచుల కృష్ణ, తరాల శ్రీను, నేలమర్రి నాగరాజు, మర్రి రామస్వామి, ముద్దుంగుల సంపత్, ఊడుగుల రాజు యాదవ్, సంతోష్, తేజవత్ శ్రీకాంత్, జాటోత్ సోదరులాల్, చాగంటి వెంకటేశ్వర్లు, తరాల నరేష్, బోడ పూలు, మేడిద కుమార్, తొట్ల సాంబయ్య, ఓర్స్ రవి, సంపత్ తోపాటు అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు ముఖ్య నాయకులు కార్యకర్తలు శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్‌లో ఫోటో జర్నలిస్టులకు ఘన సన్మానం



**హనుమకొండ టౌన్, ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి) :**
ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఫొటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులకు శాలువాలు కప్పి, మెమోంటోలను ప్రదానం చేశారు.
అంతేకాకుండా వారి సేవలను గుర్తిస్తూ ప్రతి ఫొటో జర్నలిస్టుకు ₹2,000 నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు పొడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, సంపెట సుధాకర్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్, ఎండీ నయీంపాషా తదితరులు పాల్గొన్నారు. సన్మానం పొందిన వారిలో ఫొటోగ్రాఫర్లు దాసరి శ్రీనివాస్, మంగనూరి మురళి, గొట్టె వెంకన్న, చేతి శ్రీనివాస్, కుడుతుల రమేష్, మాషూక్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

# పట్టణ పి హెచ్ సిల ఆకస్మిక తనిఖీ

## డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి



**వరంగల్, ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి) :**
వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి బుధవారం ఎస్.ఆర్.ఆర్. తోట, రంగశాయిపేట మరియు ఖిలా వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు, ఓపీ, ఫార్మసీ, ల్యాబ్ మరియు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ శాతాన్ని పెంచుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించాలని ఆదేశించారు.
వర్షాకాల కాలానుగుణ వ్యాధుల నేపథ్యంలో ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే చేపట్టాలని, నీటి నిల్వలు లేకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమల లార్వా ఉత్పత్తిని అరికట్టేందుకు వారానికి రెండు రోజులు తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు.
ఈ తనిఖీ కార్యక్రమాల్లో వైద్య అధికారులు డా. అనిత, డా. వేద కిరణ్, ఎంపీహెచ్ఈఓలు సదానందం, నాగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దన్న విగ్రహం అక్రమ తొలగింపుపై తిరగబడ్డ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**స్వేచ్ఛగా మూతపడ్డ వ్యాపార, విద్యాసంస్థలు.. విగ్రహ పునః ప్రతిష్టే లక్ష్యంగా నినాదాలు**
**కాంగ్రెస్ దౌర్జన్య పాలనపై మండిపడ్డ బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్**



**చెన్నారావుపేట ఆగస్టు.19 (వుదయం ప్రతినిధి)**
చెన్నారావుపేటలో హై స్కూల్ సెంటర్ వద్ద భారీ ఉద్రికత బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ తో సహా మాజీ కోఆప్షన్ మెంబర్ రఫీ, మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, కుసుమ నరేందర్ సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్ లతో పాటు పలువురు. నాయకులను.ముందస్తుగా అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్న పోలీసు బలగాలు నర్సంపేట మెడికల్ కాలేజ్ వద్ద ఉద్యమ నేత,నర్సంపేట అభివృద్ధి ప్రదాత . మాజీ శాసనసభ్యులు దివంగత శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే అక్రమంగా తొలగించడంపై మండలవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తాయి. బుధవారం మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ పిలుపునిచ్చిన బంద్ సంపూర్ణంగా శాంతియుతంగా జరిగింది.
విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే తిరిగి ప్రతిష్టించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజానీకం ప్రజా ప్రియ నాయకుడి విగ్రహానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని వ్యాపారులు వాణిజ్య సముదాయాలు ప్రైవేటు విద్యాసంస్థలు, స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించిన భారీ ర్యాలీతో చెన్నారావుపేట హోరెత్తింది
అనంతరం నర్సంపేట అభివృద్ధి ప్రదాత పేదల పెన్నిధి, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గారి చిత్రపటానికి మాజీ జడ్పిటిసి పత్తి నాయక్ మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ పాలాభిషేకం చేశారు.
ఉనికి కోల్పోతామని భయంతోనే కాంగ్రెస్ కుట్రలు
ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు అభివృద్ధిపై అసూయ. నర్సంపేటకు మెడికల్ కాలేజీ సాధించడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపిన పెద్ది సుదర్శన్ రెడ్డి గారి స్థానం ప్రజల గుండెల్లో చెరగనిది. ఆ ఉనికి ఎక్కడ తమను ముంచేస్తుందోనన్న భయంతోనే స్థానిక ఎమ్మెల్యే విగ్రహాన్ని ఆనవాళ్ళు లేకుండా చేశారు
హామీలు ఏవి
స్థానిక ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి డివిజన్‌కు సాధించిందేమీ లేదు. దొంగల, దోపిడీ పాలన సాగిస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు.ప్రజా తీర్పు తప్పదు పోలీసులతో కేసులు పెట్టించి ఉద్యమాలను అణచివేయలేరు. ఈ అవమానానికి రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారు. ర్యాలీ అనంతరం నాయకులు చెన్నారావుపేట హైస్కూల్ వద్దకు చేరుకుని బంద్‌కు విజ్ఞప్తి చేస్తుండగా, నెక్కొండ సీఐ, చెన్నారావుపేట ఎస్ఐ ఆధ్వర్యంలో భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. జక్క అశోక్‌తో పాటు పలువురు సర్పంచ్‌లను, మండల స్థాయి నాయకులను, కార్యకర్తలను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
మాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అదే స్థలంలో పునః ప్రతిష్టించేంత వరకు ఈ ఉద్యమం ఆగే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్ హెచ్చరించారు. ఈ బంద్ కార్యక్రమంలో : మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి. అమ్మ రాజేష్ .కొండవీటి ప్రదీప్ కుమార్ . మండల నాయకులు తుటి శ్రీనివాస్. శ్రీధర్ రెడ్డి .మండల కార్యవర్గ సభ్యులు. మండల నాయకులు.పార్టీ నాయకులు. ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు.సర్పంచులు మాజీ సర్పంచ్లు. యూత్ నాయకులు,గ్రామ నాయకులు,పార్టీ అధ్యక్షులు,వార్డు మెంబర్లు. కార్యకర్తలు. ముఖ్య నాయకులు ,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సాంస్కృతిక ఫోటోగ్రఫీ లో ఉత్తమ ఛాయాచిత్రంగా మా ఊరి బతుకమ్మ

**రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫోటోగ్రాఫర్ రాజుకు తృతీయ బహుమతి**



**మహాదేవపూర్: ఆగస్టు 19(వుదయం ప్రతినిధి):**
రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో మహాదేవపూర్ కు చెందిన ఫోటోగ్రాఫర్ పంతకాని రాజుకు తృతీయ బహుమతి లభించింది.ఆగస్టు 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం 2026 సందర్భంగా జమ్మికుంట ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (జేఎంపివీడబ్ల్యూఏ)వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ పంతకాని రాజుకు తెలంగాణ సాంస్కృతిక ఫోటోగ్రఫీ విభాగంలో మా ఊరి బతుకమ్మ ఛాయాచిత్రానికి తృతీయ బహుమతి లభించింది.బుధవారం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో నిర్వాహకుల నుండి పంతకాని రాజు అవార్డు అందుకున్నారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ను ప్రతిబింబించే ఈ ఛాయాచిత్రం న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది మహాదేవపూర్ మండలం నుండి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు పంతకాని రాజు విజయానికి ఫోటో & వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**పరకాల టౌన్, ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి) :**
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పరకాల పట్టణంలో పరకాల ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మయూరి రవీందర్ రెడ్డి, ఆకుల శ్రీధర్, ఆర్గనైజర్ కోడెపాక భాస్కర్, పరకాల అధ్యక్షులు వేముల సుధాకర్, కనుకుంట్ల కృష్ణ, బండారి ప్రసాద్, కార్యదర్శులు, సభ్యులు, ఫోటోగ్రాఫర్ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "తుడుందెబ్బ " బంద్ ప్రశాంతం

**5వ షెడ్యూల్ హక్కులు, చట్టాలు, జీవోలను పటిష్టంగా అమలు చేయాలి**



**కొత్తగూడ ఆగష్టు 19 (వుదయం ప్రతినిధి ):**
5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులు, చట్టాలు, జీవోలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ పిలుపు మేరకు బుధవారం ఏజెన్సీ బంద్ నిర్వహించారు. కొత్తగూడ మండల కేంద్రంలో బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది.బంద్ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పాఠశాలలు, రవాణా సేవలు నిలిచిపోయాయి. నర్సంపేట, మహబూబాబాద్ డిపోల నుంచి బస్సులు నిలిచిపోయాయి. మండలంలోని ఆదివాసీ గ్రామాలు, గూడేల్లోనూ బంద్‌కు మద్దతుగా కార్యక్రమాలు నిర్వహించారు.తుడుం దెబ్బ ప్రధానంగా జీవో నెం.3ను పునరుద్ధరించాలని, పోలీస్ నోటిఫికేషన్‌లో జీవో నెం.109ను అమలు చేసి స్థానిక ఆదివాసీలకు 75 శాతం అవకాశాలు కల్పించాలని, ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని, ఐటీడీఏ పరిధిలోని 29 శాఖల జీవోలను చట్టబద్ధం చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేయాలని డిమాండ్ చేసింది.బంద్‌కు మద్దతు తెలిపిన ఆదివాసీ ప్రజలు, ప్రజా సంఘాలు, వర్తకులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఆటో యూనియన్, ఉద్యోగ సంఘాలు తదితరులకు తుడుం దెబ్బ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు కుంజ నర్సింగరావు, పూనెం సందీప్, మల్లెల సారయ్య, పుల్సం మునేష్, ఈసం రంగారావు, కల్తీ నరేష్, కల్తీ ఎల్లయ్య, చాట్ల నాగేశ్వరరావు, చుంచ సారయ్య, దొర వాసం కిశేందర్, పెనక లక్ష్మయ్య, ఈసం స్వామి పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో బెడ్ షీట్స్, ప్లేట్స్, బ్యాగులు, షూల పంపిణీ



**చిట్యాల: ఆగస్టు 19 (వుదయం ప్రతినిధి)**
చిట్యాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు బుధవారం బెడ్ షీట్స్, ప్లేట్స్, బ్యాగులు, షూల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిట్యాల గ్రామ సర్పంచ్ తవుటం లక్ష్మీ,ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల కళాశాల ఉపాధ్యాయులు బోధించే విద్యను సద్వినియోగం చేసుకోవాలి. ఎటువంటి చెడు అలవాట్లకు, వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దు. మీ లక్ష్యాన్ని ఎంచుకొని అది నెరవేరేలా చదువుకోవాలి. తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి అని సూచించారు.పరిస్థితులలో దుర్భరమైన వ్యసనాలకు అలవాటు పడవద్దు అని సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలి అని విద్యార్థులకు సూచనలు చేశారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్స్, బెడ్ షీట్స్, బ్యాగులు, షూలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు, జోష్ణ, ఆయేషా, దివ్య, శివరాజు, శ్రీలత, స్వప్న, రాము, భాస్కర్ రాజు, సాగర్ హాస్టల్ వార్డెన్ రాణి, శ్రీకాంత్, పి.టి అశోక్ తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాక్సో కేసుల్లో చిక్కితే జీవితం కోల్పోతారు

**చిన్న పిల్లలపై లైంగిక దాడులు చేస్తే కఠిన శిక్షలు**
**చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్**



**భూపాలపల్లి: ఆగస్టు 19 (వుదయం విలేకరి):**
పోక్సో కేసుల్లో చిక్కితే జీవితం కోల్పోతారు అని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రేగొండ, రంగయ్యపల్లి మరియు మైలారం గ్రామాల్లో మొబైల్ వ్యాన్ ఉపయోగించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నపిల్లలపై లైంగిక దాడులు చేస్తే సర్వం కోల్పోవల్సి వస్తుందని, చట్టాలు కఠినంగా ఉన్నాయని తెలిపారు. అదేవిదంగా సమస్యలు తలెత్తినప్పుడు, ఇదివరకే నమోదైన కేసుల్లో రాజీ, మధ్యవర్తిత్వం ఉత్తమమైనది అని పేర్కొన్నారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. అక్షయ, సూపరింటెండెంట్ రఘురామ్ లు మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, కే. మహిత, కే. వెంకటేష్, ఎమ్. రాజ్ కుమార్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# దళిత విలేఖరి పై దాడి చేసిన అగ్రవర్ణ వ్యక్తులను అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటి ?

**సిపిఐ ఎం.ఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ .**



**భూపాలపల్లి ఆగస్టు 19 వుదయం ప్రతినిధి.**
భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత విలేకరి ఆర్.బి. న్యూస్ ఛానల్ రిపోర్టర్ పుల్ల రవితేజను పరామర్శించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్న ఇప్పటికి ఆ వ్యక్తులను అందరిని అదుపులోకి తీసుకోకుండా అరెస్టు చేయకపోవడంలో అంతర్యం ఏమిటి అని అడుగుతున్నాం లొకేషన్ ఆధారంగా స్పాట్ లో ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేస్తామని చెప్పడం అసలైన ముద్దాయిని తప్పించడమే తప్ప మరొకటి కాదు తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తా ఉన్నాం అసలు నేను కొట్టలేదన్న వ్యక్తి సంప్రదింపులు ఎందుకు జరుపుతున్నారు
నీకు నాలుగు లక్షల ఇస్తాము ఐదు లక్షలు ఇస్తాము భార్యకు ఉద్యోగం పెడతాము నన్ను తప్పించు నాకు అవకాశం కల్పించు అని మధ్యవర్తిత్వం ఎందుకు పంపుతున్నారు రవితేజతో ఇతర వ్యక్తులతో ఎందుకు మాట్లాడిస్తున్నారు ఆయన పలకరించగా ఈ విషయాలు అన్నింటిని మాతో చెప్పడం జరిగింది ప్రలోభాలు పెట్టి దళితుల ఆత్మ గౌరవాన్ని కించపరచలని చూస్తే దళితులంతా మేలుకొక తప్పదని తెలియజేస్తా ఉన్నాం ఇప్పటికైనా అగ్రవర్ణ వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపించి న్యాయం చేయాలని కోరుతున్నాం ఈ జిల్లాలో ఏ దళిత విలేకరిపై దాడి జరగలేదు ఈ ఇలా దాడి చేయడం ఇది మొదటిసారి ఇట్లాంటి దాడులను చేయడం అనేది దుర్మార్గమైన చర్య అని భవిష్యత్తులో ఇట్లాంటి దాడులు చేయకుండా ఉండాలంటే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తా ఉన్నాం దళిత మేధావులు యువకులు ఉద్యోగులు యువజన సంఘాలు అందరు ఆలోచించి పుల్ల రవితేజకు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తా ఉన్నాను అని అన్నారు.

# మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని**



**చెన్నారావుపేట ఆగస్టు 19 ( వుదయం. ప్రతినిధి)**
చెన్నారావుపేట మండల కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండ కార్తీక్ గౌడ్ గారు, ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఫోటోగ్రఫీ జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల సీనియర్ ఫోటోగ్రాఫర్ చంద్రశేఖర్ గారిని ఘనంగా సన్మానించి, మెమొంటోను అందజేశారు. అదేవిధంగా ఫోటో మరియు వీడియోగ్రఫీ కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచిన మూడు ప్రేమ్ నాయక్, యాకు గార్లకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండ కార్తీక్ గౌడ్, గౌరవ అధ్యక్షులు పుట్టరాజు, మండల ప్రధాన కార్యదర్శి తడక రాజు,కోశాధికారి కేశవబోయిన నరసింహ రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొంతి సంతోష్, మండల సీనియర్ సభ్యులు దొంతి సతీష్, అమ్మ రాజు, ఇస్లావత్ గోపి, రామగిరి లక్ష్మణ్, అంబాల బిక్షపతి, పోలూ రాజు, అన్న రాజు, గుడివాడ రాజు, చింతకింది అజేందర్, అనుమండ్ల రమేష్, ఏగ్గడి రాజు, జన్ను దేవేందర్ ఫోటో వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# 444.75 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం

**పాత రైస్ మిల్ గోడౌన్‌లో అక్రమ నిల్వ గుర్తింపు**

**భూపాలపల్లి: ఆగస్టు 19 (వుదయం విలేకరి)**
భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పాత రైస్ మిల్ గోడౌన్‌లో పిడిఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు తెలుసుకున్న సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ రాజు బుధవారం సంబంధిత గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా, పెద్ద మొత్తంలో పిడిఎస్ బియ్యం బస్తాలు గుర్తించబడ్డాయి. ఈ విషయాన్ని వెంటనే డి. ఎం & డీఎస్ఓ అధికారులకు తెలపడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, లభ్యమైన బియ్యం పిడిఎస్ బియ్యంగా ప్రాథమికంగా నిర్ధారించి పంచనామా నిర్వహించి సుమారు 444.75 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యంను స్వాధీన పరుచుకున్నారు అనంతరం భద్రతా పరిరక్షణ నిమిత్తం మరుతి ఇండస్ట్రీస్ రైస్ మిల్ వద్ద సురక్షితంగా భద్రపరిచారు ప్రభుత్వ పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, అక్రమంగా రవాణా చేయడం లేదా దారి మళ్లించడం చట్టరీత్యా తీవ్రమైన నేరం అని ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సంయుక్త దాడిలోసివిల్ సప్లై ఇన్స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్, తోపాటు తదితరులు పాల్గొన్నారు

# చక్కని ఆరోగ్యం

## వర్షాకాలంలో.. కురుల సంరక్షణ ఇలా!



ఎన్నిసార్లు శుభ్రం చేసుకున్నా ముఖం జిడ్డుగా మారడం, ఎంత దువ్వుకున్నా జుట్టు పిచ్చుక గూడులా తయారవడం.. వర్షాకాలంలో తలెత్తే సమస్యలివి! ఇలాంటి వాతావరణాన్ని ఎదుర్కొని అందాన్ని సంరక్షించుకోవడమంటే సవాలనే చెప్పాలి. ముఖ్యంగా కుదుళ్లు జిడ్డుగా మారడం, జుట్టు రాలడం, గడ్డిలా తయారవడం.. వంటి కేశ సంబంధిత సమస్యలు ఈ కాలంలో ఎక్కువగా ఎదురవుతుంటాయి. అయితే జుట్టు ఆరోగ్యాన్ని సంరక్షించుకునే క్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సీజన్లోనూ కేశాలను మెరిపించచ్చని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. మరి, ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం రండి!

వానలో తడిసిన తర్వాత జుట్టును అలాగే ఆరబెట్టుకోవడం మనలో చాలామందికి అలవాటు. కానీ అలా చేయకుండా చల్లటి నీటితో ఓసారి తలస్నానం చేసి జుట్టు ఆరబెట్టుకోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే సాధారణంగానే వర్షపు నీటిలో కొన్ని ఆమ్ల గుణాలుంటాయట! అసలే ఈ కాలంలో హ్యుమిడిటీ వల్ల కుదుళ్లు జిడ్డుగా మారి వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటికి ఈ ఆమ్ల గుణాలు తోడవడం వల్ల సమస్య మరింత పెరుగుతుందని, అందుకే వర్షంలో తడిసినట్లయితే శుభ్రంగా తలస్నానం చేసి జుట్టును పొడిగా ఆరబెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా వర్షంలో తడిసినా జుట్టు ఆరోగ్యం దెబ్బతినకుండా జాగ్రత్తపడచ్చు.

వర్షాకాలంలో నూనెకు బదులు నీటి ఆధారిత సీరమ్స్ వాడచ్చంటున్నారు నిపుణులు. తద్వారా జుట్టు జిడ్డుగా మారకుండా జాగ్రత్తపడచ్చు.. అయితే నూనె పెట్టుకోవాలనుకునే వారు.. రాత్రి పడుకునే ముందు కుదుళ్లు, జుట్టుకు నూనె పట్టించి.. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.

కొంతమంది జుట్టు ఎంత దువ్వినా కాసేపటికే చెదిరిపోతుంది. దీంతో పదే పదే దువ్వుకోవడం, ఎక్కడికక్కడ హెయిర్ పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటారు. నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్ తీసేశాక మరింత గడ్డిలాగా మారుతుంది. అందుకే అలాంటి వారు జడ/హెయిర్‌స్టైల్ వేసుకోవడానికి ముందు కాస్త హెయిర్ సీరమ్‌ని అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుందట! అంతేకాదు.. ఈ కాలంలో జుట్టు, కుదుళ్లలో ఉన్న తేమ, జిడ్డును తొలగించి.. జుట్టును మృదువుగా మార్చడంలోనూ ఇది సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. కుదుళ్లు జిడ్డుగా అనిపించినప్పుడల్లా షాంపూతో తలస్నానం చేయడం మనకు అలవాటే!

అయితే హ్యుమిడిటీ కారణంగా ఈ సమస్య పెరగడంతో తరచుగా తలస్నానం చేస్తుంటారు కొంతమంది. అయితే ఇలా పదే పదే షాంపూ చేసుకోవడం వల్ల జుట్టు సహజ తేమను కోల్పోతుంది. ఇది వెంట్రుకలు ఎక్కువగా రాలడానికి దారితీస్తుంది. కాబట్టి ఇలాంటి వాతావరణంలో ప్రతిసారీ షాంపూతో కాకుండా చల్లటి నీటితో జుట్టును శుభ్రం చేసుకుంటే సరిపోతుందంటున్నారు నిపుణులు. వీటితో పాటు తలస్నానం చేశాక మృదువైన క్లాత్‌తో జుట్టును తుడుచుకోవడం, కండిషనర్ పెట్టుకున్నాక చల్లటి నీళ్లతో జుట్టును శుభ్రం చేసుకోవడం.. వంటి చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే హ్యుమిడిటీని తట్టుకొని జుట్టును ఆరోగ్యంగా మెరిపించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

## నెలసరి ఆలస్యమవుతోందా?

నెలసరి కొన్నిసార్లు ముందుగా లేదంటే ఆలస్యంగా రావడం సహజమే! అయితే కొంతమందిలో దాదాపు ప్రతి నెలా ఇలాగే జరుగుతుంటుంది. హార్మోన్ల అసమతుల్యతే దీనికి కారణమనుకుంటారు చాలామంది. కానీ ఇదే కాదు.. జీవనశైలి మార్పులు, కొన్ని



ఆరోగ్య సమస్యలూ ఇందుకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. అందుకే ప్రతి నెలా పిరియడ్స్ ముందుగా లేదంటే ఆలస్యంగా వస్తున్నట్లు గమనిస్తే.. ఎవరికి వారే స్వయంగా కొన్ని ప్రశ్నలు వేసుకోవాలని చెబుతున్నారు. తద్వారా అసలు సమస్యేంటో గుర్తించి.. మొదట్లోనే డాక్టర్‌ని సంప్రదించి చికిత్స తీసుకోగలుగుతారంటున్నారు. ఈ రోజుల్లో చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురవడం, ఆందోళన చెందడం చాలామందిలో కనిపిస్తుంది. అయితే ఇలా ఒత్తిడికి గురైన ప్రతిసారీ శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది ఇతర హార్మోన్ల స్థాయుల పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో నెలసరిని క్రమబద్ధీకరించే వివిధ హార్మోన్ల స్థాయులు అదుపు తప్పుతాయి. దీని ప్రభావం నెలసరిపై పడి.. తద్వారా ఇర్రెగ్యులర్ పిరియడ్స్‌కు దారితీస్తుందంటున్నారు నిపుణులు. కాబట్టి నెలనెలా పిరియడ్స్ ఆలస్యమైతే.. 'తాము ఏ విషయంలోనైనా టెన్షన్ పడుతున్నామా?' అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. ఫలితంగా ఇర్రెగ్యులర్ పిరియడ్స్‌కి ఒత్తిడి కారణమా? కాదా? అనేది తెలుస్తుంది అంటున్నారు నిపుణులు. శరీరానికి పోషకాలన్నీ అందినప్పుడే హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి. అయితే కొంతమంది డైటింగ్ పేరుతో కడుపు మాడ్చుకుంటారు. దీనివల్ల శరీరానికి సరిపడా పోషకాలు, క్యాలరీలు అందవు. దీనివల్ల కూడా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్.. వంటి ప్రత్యుత్పత్తి హార్మోన్ల అసమతుల్యత తలెత్తుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇదీ నెలసరి క్రమం తప్పడానికి, ఆలస్యంగా రావడానికి కారణమవుతుంది. అందుకే పిరియడ్స్ ప్రతి నెలా ఆలస్యమవుతుంటే.. తాము డైట్‌లో ఏవైనా మార్పులు చేసుకున్నామా? క్యాలరీల్ని తగ్గించామా? అనే దిశగానూ ఆలోచించాలంటున్నారు నిపుణులు. సాధారణంగా వర్కవుట్ రొటీన్ ప్రారంభించే వారు తక్కువ తీవ్రత ఉన్న సింపుల్ వ్యాయామాలతో మొదలుపెడతారు. కానీ కొంతమంది త్వరగా బరువు తగ్గాలని మొదట్లోనే అధిక తీవ్రత ఉన్న వ్యాయామాల్ని రొటీన్‌లో చేర్చుకుంటారు. దీనికి తోడు ఆహారం కూడా సరిగ్గా తీసుకోరు. ఫలితంగా శరీరం శక్తి స్థాయుల్ని కోల్పోతుంది. ఇది రుతుచక్రంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా నెలసరి ఆలస్యమవడం జరుగుతుందంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఉన్నట్లుండి బరువు తగ్గినా, పెరిగినా కూడా నెలసరి సమస్యలు తప్పవంటున్నారు. నెలసరిని క్రమబద్ధీకరించే ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు కారణమట! కాబట్టి నెలసరి ఆలస్యమైతే మీ శారీరక బరువు, వ్యాయామాల విషయాల్లోనూ ఈ ప్రశ్నలు సంధించుకోవడం వల్ల అసలు కారణమేంటో ఓ అవగాహనకు రావచ్చంటున్నారు. దీర్ఘకాలం మందులు వాడే వారు.. ఔషధాలు మార్చినా మొదట్లో కొన్నాళ్ల పాటు నెలసరి అదుపు తప్పడం గమనిస్తుంటాం. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించే మందులు, గర్భ నిరోధక మాత్రలు, థైరాయిడ్–స్థూలకాయానికి సంబంధించిన మందులు, కొన్ని రకాల నొప్పి నివారిణులు కూడా నెలసరిపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయట. అంతేకాదు.. రక్తస్రావంలోనూ హెచ్చుతగ్గులొస్తాయంటున్నారు. అందుకే పిరియడ్స్ విషయంలో మార్పులేవైనా గమనిస్తే.. కొత్త మందులు ఇందుకు కారణమా అనే అంశాన్ని సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకోవాలి.

## హూలాహూప్.. తిప్పితే ప్రయోజనాలెన్నో!

హూలాహూప్.. ఫిట్‌నెస్‌ను పెంచుకోవడానికి చాలామంది దీనిని వాడుతుంటారు. సాధారణంగా హూలాహూప్‌ని ఎక్కువగా నడుము భాగం ఉపయోగించి గుండ్రంగా తిప్పుతూ ఉంటారు. దీనివల్ల ఆ భాగంలో కండరాలు దృఢంగా మారడమే కాకుండా.. ఫిట్‌నెస్, ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. హూలాహూప్‌ని ఉపయోగించి ఎక్సర్‌సైజ్ చేయడం ద్వారా శరీరం అంతటికీ చక్కని వ్యాయామం అందుతుంది. ఆ రింగ్‌ని బ్యాలన్స్ చేసే క్రమంలో కాళ్లు, నడుము భాగాలకు ఎక్కువగా వ్యాయామం అందితే, రింగ్‌ని పట్టుకుని తిప్పడం, అలాగే బ్యాలన్సింగ్ కోసం చేతులను అటూఇటూ కదపడం ద్వారా శరీర పైభాగాలకు కూడా ఎంతో కొంత వ్యాయామం అందుతుంది. ఇలా శరీరం మొత్తంగా జరిగే కదలికల ద్వారా చక్కని వ్యాయామం లభిస్తుంది.



ఈ రింగ్‌ని ఉపయోగించి కరిగించే క్యాలరీల మొత్తం మనం దాన్ని తిప్పే వేగం మీద కూడా ఆధారపడి ఉంటుందంటున్నారు నిపుణులు. అంటే తక్కువ సమయంలో ఎక్కువ వేగంతో ఈ రింగ్‌ని తిప్పితే ఎక్కువ క్యాలరీలు, తక్కువ వేగంతో తిప్పితే తక్కువ క్యాలరీలు ఖర్చవుతాయట!

హూలా హూప్‌ని ఉపయోగించి వ్యాయామం చేయడం ద్వారా కండరాల సామర్థ్యం మెరుగవుతుంది. ముఖ్యంగా గుండె కండరాలకు ఈ వ్యాయామం చాలా మంచిదని సూచిస్తున్నారు నిపుణులు. అంతేకాదు.. ఇది వెన్నుపాముకు సైతం బలాన్ని అందించి దాని కదలికలను మరింత మెరుగయ్యేలా చేస్తుందట.

మంచి మ్యూజిక్ వింటూ శరీర బరువును బ్యాలన్స్ చేస్తూ హూలాహూప్‌ని ఉపయోగించి వ్యాయామం చేస్తాం. కాబట్టి హృద్యమైన సంగీతం ద్వారా ఒత్తిడి తగ్గి, మనసుకు కూడా ఎంతో కొంత ప్రశాంతత చేకూరుతుంది. అలాగే కళ్లకు, చేతులకు మధ్య ఉండే సమన్వయం కూడా మరింత మెరుగవుతుంది. ఫలితంగా మనం మరింత ఉత్సాహంగా ఉండటానికి అవకాశం ఉంటుందట. హూలాహూప్ ఎక్సర్‌సైజ్ చేయడం ద్వారా శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి మనం సంతోషంగా ఉండటానికి ప్రేరేపిస్తాయి. కాబట్టి ఈ వర్కవుట్ ద్వారా సంతోషాన్ని, మానసిక ప్రశాంతతను కూడా సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

## వికారం అందుకేనా?

అమ్మ కాబోతున్నామని తెలిసిన దగ్గర నుంచీ అందరి నోటా ఒకటే మాట... పుట్టబోయేది పాపా? బాబా? అని. అందుకు సైన్స్ ఏం చెబుతోందంటే... వ్రోక్లా యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం... మామూలుగా కడుపులోని శిశువు ఆడ లేదా మగ ఎవరైనా తొలినాళ్లలో వాంతులు, వికారం, విముఖత.. వంటివి ఉంటాయి. కానీ, కడుపులో మగ శిశువు ఉంటే తల్లుల్లో మొదటి రెండు త్రైమాసికాల్లో విముఖత మరీ ఎక్కువగా ఉంటుందట. కొన్ని రకాల వస్తువులు, దుస్తులు, ఆహారాలను చూస్తేనే వెగటుగా ఫీలవుతారట. సాధారణంగా అభివృద్ధి జరిగే తొలిదశలో మగ శిశువు కాస్త సున్నితంగా, బలహీనంగా ఉంటుంది. కాబట్టి, ఆ సమయంలో హానికరమైన బ్యాక్టీరియా, కలుషితమైన ఆహార పదార్థాలు వంటివి... తల్లి నుంచి బిడ్డకు చేరకుండా చేసే ఓ రక్షణ



యంత్రాంగమే ఇది. అదే కడుపులో ఉన్నది ఆడ శిశువులు అయితే, వాంతులు, వికారం వంటివి అధికంగా ఉంటాయట. దీనికి ప్రధాన కారణం హ్యూమన్ కోరియోనిక్ గొనాడోట్రోపిన్ (హెచ్‌సీజీ)అనే హార్మోన్‌ను అధికంగా ఉత్పత్తి కావటమే. ఇది కడుపులో అసౌకర్యాన్ని కలిగించి వాంతులు, వికారానికి కారణమవుతుందట. అయితే, అచ్చం ఈ లక్షణాలతోనే ఓ అంచనాకు రాలేమనీ, కచ్చితమైన నిర్ధారణకు మరిన్ని పరీక్షలు అవసరమవుతాయని చెబుతున్నారు నిపుణులు.

## చిన్న వయసులోనే ముడతలా?

వయసు పెరిగే కొద్దీ చర్మం ముడతలు పడడం సహజమే! అయితే కొంతమందికి చిన్న వయసులో ఉండగానే ముఖంపై ముడతలు, గీతలు కనిపిస్తుంటాయి. మరీ ముఖ్యంగా నుదుటి మీద కనిపించే గీతల కారణంగా చాలామంది అసౌకర్యంగా ఫీలవుతుంటారు. అయితే ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు.

సాధారణంగా వయసు పెరిగే కొద్దీ చర్మం పొడిబారి మృదుత్వాన్ని కోల్పోతుంది. ఈ ప్రభావంతో నుదుటిపై సన్నని గీతలు ఏర్పడడంతో పాటు కళ్ల చుట్టూ ఉండే చర్మం ముడుచుకుపోతుంది. అయితే కొంతమందికి చిన్న వయసులోనే నుదుటిపై గీతలు, ముడతలు కనిపిస్తుంటాయి. వాటిని 'ప్రిమెచ్యూర్ రింకిల్స్' అంటారు.

బాగా తెల్లగా ఉన్న వారిలో, చర్మం పల్చగా ఉన్న వారిలో ఇవి చిన్న వయసులోనే మొదలవుతాయంటున్నారు నిపుణులు.

ఎండలో ఎక్కువగా తిరిగే వారిలో, కొందరిలో వంశపారంపర్యంగానూ ఈ సమస్యలు ఎదురవుతాయట.

అలాగే పొడి చర్మతత్వం ఉన్న వారు, సౌందర్య పద్ధతుల్లో భాగంగా తరచూ బ్లీచ్ వాడే వారిలోనూ ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుందట. ఈ సమస్యకు కొన్ని చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ, పలు సహజసిద్ధమైన చిట్కాలు కూడా మేలు చేస్తాయంటున్నారు నిపుణులు.

శరీరానికి సరిపడా నీళ్లని తీసుకోకపోతే చర్మం పొడిబారే ప్రమాదముంది. ఫలితంగా నుదుటి మీద పెద్ద పెద్ద గీతలు, ముడతలు ఏర్పడతాయి. దీంతో చిన్న వయసులోనే వయసు మళ్లిన వారిలా కనిపిస్తారు. ఈ సమస్య పెరగకుండా ఉండాలంటే తగినన్ని నీళ్లు తాగాలి. అలాగే వర్కవుట్లు చేసేవారు త్వరగా డీహైడ్రేషన్ బారిన పడే అవకాశం ఉంది కాబట్టి అలాంటి వారు మరింత ఎక్కువగా నీళ్లు తాగాలి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, నిమ్మరసం, ఇతర పండ్ల రసాలను కూడా తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

చర్మంపై ఎండ ఎక్కువగా పడితే కొలాజెన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఫలితంగా నుదుటి మీది చర్మం కమిలిపోయి ముడతలు పడే అవకాశం ఉంది. అందుకే ఎండలోకి వెళ్లే ముందు తప్పనిసరిగా సన్‌స్క్రీన్ లోషన్ అప్లై చేసుకోవాలని చెబుతుంటారు నిపుణులు. అలాగే కలబందలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయట. అంతేకాదు.. నుదుటి మీద ముడతలు కనిపించకుండా చేస్తాయట. అందుకే కలబందతో చేసిన ప్యాక్స్ వేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

విపరీతమైన ఆందోళన, ఒత్తిడి వల్ల కూడా నుదుటిపై ముడతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఈ సమస్యలను తగ్గించుకోవడానికి యోగా, మెడిటేషన్, వర్కవుట్లను రోజూ సాధన చేయాలని సూచిస్తున్నారు. సంపూర్ణ పోషకాహారం తీసుకోవడంతో పాటు రోజూ ఏడెనిమిది గంటలు ఎలాంటి అంతరాయం లేకుండా నిద్రపోవాలని చెబుతున్నారు నిపుణులు.



## 'ఫుడ్ డివోర్స్'ఇచ్చేస్తున్నారు!



ఆలోచనలు, అభిరుచులు కలవకపోతే విడాకులు కోరుకోవడం... విడివిడిగా బతకడం సహజమే. కానీ ఆహారపు అలవాట్లు కలవకపోయినా విడాకులు ఇచ్చుకుంటున్నారట నేటితరం దంపతులు. అయితే ఇవేం నిజం విడాకులు కాదు. ఆహారపు అలవాట్ల విషయంలో మాత్రమే కాస్త అంతరాలు పాటించేవి. ఆరోగ్యంగా ఉండాలనో, చిన్నపాటి అనారోగ్య కారణాలతోనో చాలామంది అమ్మాయిలు, గృహిణులు జంక్‌కి దూరమవుతున్నారు. వీగన్లుగా, శాకాహారులుగా మారుతున్నారు. కష్టమైనా వాళ్ల జీవనశైలిలో వీటిని జొప్పించడానికి ప్రయత్నిస్తున్నారు. మగవాళ్లు మాత్రం దీనికి అతీతంగా ఉన్నారు. ఏదో ఒక సమస్య వస్తేనే కానీ వీటి జోలికి పోవడం లేదు. ఇలాంటి నేపథ్యంలో ఒకరి అలవాట్లని ఒకరు నిందించుకుంటున్నారట. తమకు నచ్చిందే వండాలని తగాదాలు పెట్టుకుంటున్నారట. అందుకే ఫుడ్ డివోర్స్‌లు ఇచ్చుకుంటున్నారు. ఎవరికి కావాల్సినవి వాళ్లు తెచ్చుకుని, వండుకొని తింటున్నారట. కొందరు మహిళలైతే శ్రమ అనుకోకుండా రెండు వంటకాల్నీ చేస్తున్నారట. దీనివల్ల తగాదాలకు తావుండదు.

## గోళ్లకూ మసాజ్ కావాలి!

కొంత మందికి గోళ్లు పెంచుకోవడం ఇష్టం. పొడవాటి గోళ్లపై నచ్చిన నెయిల్ పాలిష్ వేసుకుని మురిసిపోతుంటారు. అయితే గోళ్ల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కోసారి గోళ్లలో ఇన్ఫెక్షన్లు, విరిగిపోవడం, పొడిబారడం.. లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలా జరగకుండా గోళ్ల సంరక్షణ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.

గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం, ఇల్లు తుడవడం.. వంటి పనులు చేసేటప్పుడు గోళ్లు ఎక్కువగా నీటిలో నానుతుంటాయి. ఫలితంగా త్వరగా నిర్జీవమై విరిగిపోయే ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఇలాంటి పనులు చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు ధరించడం మంచిది.

గోళ్లను రోజుకోసారి మాయిశ్చరైజింగ్ లోషన్‌తో మసాజ్ చేయడం మర్చిపోవద్దు. ఫలితంగా రక్తప్రసరణ మెరుగై అవి ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతాయట. అంతే కాదు.. చేతులు కడుక్కున్న ప్రతిసారీ లోషన్ రాసుకోవడం మంచిది. తద్వారా గోళ్లకు తగినంత తేమ అందుతుంది. నెయిల్ పాలిష్ వేసుకున్నప్పుడల్లా దాన్ని తొలగించడానికి పాలిష్ రిమూవర్‌ని ఉపయోగిస్తుంటారు కొందరు. దీనివల్ల గోళ్ల ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారు నిపుణులు. రిమూవర్‌లో ఉండే ఎసిటోన్ గోళ్లను పొడిబారేలా చేయడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ సరిపడినన్ని నీళ్లు తాగడం అవసరం. తద్వారా గోళ్లకు తేమ అంది.. వాటి అందం, ఆరోగ్యం ఇనుమడిస్తాయి అని సూచిస్తున్నారు.



## ఎన్ఎస్ఈ విలువ రూ.5.26 లక్షల కోట్లు!




ట్రేడింగ్ పరిమాణంలో ప్రపంచంలోనే అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్చేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ), ప్రతిపాదిత తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం తన విలువను రూ.5.26 లక్షల కోట్లు (55 బిలియన్ డాలర్లు)గా పరిగణించాలని ఆశిస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వ్యక్తులు తెలిపారు. సామర్థ్యం కలిగిన పెట్టుబడిదార్లతో నిర్వహించిన సమావేశాల్లో, ఎన్ఎస్ఈ ఒక్కో షేరును రూ.2,000–2,100 ధరకు విక్రయించిందని పేర్కొన్నారు. ఐపీఓ ప్రచారం కోసం ఎన్ఎస్ఈ అంతర్జాతీయంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పశ్చిమాసియాలో పూర్తి కావాల్సి ఉంది.




# డిసెంబరు కల్లా 5-6 సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి




దేశంలో సెమీకండక్టర్ తయారీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ఏడాది చివరికి 5–6 సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ తెలిపారు. సెప్టెంబరు 17న ప్రారంభం కానున్న సెమీకాన్ ఇండియా అయిదో ఎడిషన్ వివరాలు తెలిపేందుకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం 1.0) కింద తొలి దశలో ఆమోదం పొందిన 3 ప్రధాన ప్రాజెక్టులు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాయని చెప్పారు. వాటిల్లో మొదటి దానిని ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 28న ప్రారంభించగా.. ఆ తర్వాత మరో రెండు ప్రారంభం అయ్యాయని అన్నారు. ఈ ఏడాది ముగిసేలోపు మరికొన్ని ప్రాజెక్టుల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని, మొత్తంగా 5–6 ప్రాజెక్టుల్లో వాణిజ్య ఉత్పత్తి ఊపందుకుంటుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఐఎస్ఎం 2.0 కింద చిప్ డిజైన్, తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, మెటీరియల్స్, ఆర్అండ్‌డీ, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తారని కృష్ణన్ తెలిపారు. దిల్లీలోని యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్)లో సెమీకాన్ ఇండియా– 2026 అయిదో ఎడిషన్‌ను సెప్టెంబరు 17న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో 240కి పైగా అంతర్జాతీయ కంపెనీలు, 150 మందికి పైగా ప్రపంచంలోని ప్రముఖ వక్తలు, 40కి పైగా దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధి బృందాలు పాల్గొంటాయని అంచనా.

# ఆర్‌బీఐ కొత్త రూల్..



హోమ్‌లోన్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. గృహ రుణాల వడ్డీ రేట్ల రీసెట్‌కు సంబంధించి తాజాగా డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. దీనివల్ల ఇప్పటికిప్పుడు రుణ గ్రహీతలపై ప్రభావం పడనప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. సాధారణంగా హోమ్‌లోన్‌లు ఫ్లోటింగ్ రేట్‌తో ముడిపడి ఉంటాయి. అంటే, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను సవరించినప్పుడు దాన్ని అనుసరించి రుణ రేట్లు మారుతుంటాయి. అయితే, అన్ని బ్యాంకులూ ఒకేసారి మార్చవు. కొన్ని సందర్భాల్లో ఇవి మారడానికి ఏడాది సమయం పడుతోంది. దీనివల్ల తగ్గిన వడ్డీ ప్రయోజనం రుణ గ్రహీతలకు చేరడంలో ఆలస్యమవుతోంది.

ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల రీసెట్ సమయం మూడు నెలలకు మించకూడదని ఆర్‌బీఐ తన తాజా నిబంధనల్లో పొందుపరిచింది. అంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు వేగంగా ఆ ప్రయోజనం దక్కుతుంది. అదే సమయంలో వడ్డీ రేట్లు పెంచినప్పుడూ ఇదే నియమం వర్తిస్తుంది. దీనిపై సెప్టెంబర్ 11 వరకు అభిప్రాయాలను సేకరిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఆర్‌బీఐ తీసుకొస్తున్న నిబంధనలు కేవలం ఫ్లోటింగ్ రేట్ రుణాలకు మాత్రమే. గృహ రుణాలకు మాత్రమే ఈ వడ్డీ రేట్లు ఉంటాయి. వ్యక్తిగత, ఆటో రుణాలకు స్థిర వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. కాబట్టి ఆర్‌బీఐ తీసుకొస్తున్న ఈ మార్పు వల్ల వ్యక్తిగత రుణాలపై ప్రభావం ఉండదు. కాబట్టి ఈఎంఐలలో ఎలాంటి మార్పూ ఉండదు. కొత్తగా తీసుకొనే గృహ రుణ వినియోగదారులు, ఇప్పటికే హోమ్‌లోన్ తీసుకున్నవారికే ఈ నిబంధన వర్తించనుంది.

# అదరగొట్టిన బెహారీలాల్ ఇంజినీరింగ్..




ఐరన్ అండ్ స్టీల్ తయారీ కంపెనీ బెహారీలాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ మదుపర్లకు లాభాల వర్షం కురిపించింది (Behari Lal listing). బుధవారం దాదాపు 63 శాతానికి పైగా ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.285 కాగా 60.70 శాతం లాభంతో బీఎస్ఈలో రూ.458 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలోనూ 63.15 శాతం ప్రీమియంతో రూ.465 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,135.22 కోట్లకు చేరింది. కంపెనీ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ డిమాండ్ వచ్చింది. చివరి రోజు నాటికి 108.44 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రూ.302 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ఒక్కో షేరు ధర రూ.271–285గా కంపెనీ నిర్ణయించింది.

### 35% ప్రీమియంతో షిప్ రాకెట్ అరంగేట్రం

ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ కూడా వాటాదారులకు మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. 35 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.97గా కంపెనీ నిర్ణయించగా.. బుధవారం బీఎస్ఈలో 33.50 శాతం లాభంతో రూ.129.50 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలో 35 శాతం ప్రీమియంతో రూ.131 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ విలువ రూ.9,901.60 కోట్లకు చేరింది. ఈ కంపెనీ రూ.1617.5 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకి వచ్చింది.

14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. చివరి రోజు నాటికి 99.38 రెట్ల బిడ్డింగ్ నమోదు చేసింది. ధరల శ్రేణి రూ.92–97గా నిర్ణయించింది.

# ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# స్కోడా నుంచి డీజిల్ కార్లు




చెక్ రిపబ్లిక్ వాహన దిగ్గజం స్కోడా ఆటో, భారత మార్కెట్‌లో అయిదేళ్ల విరామం తర్వాత మళ్లీ డీజిల్ వాహనాలను ప్రవేశ పెట్టింది. సరికొత్త ప్రీమియం ఎగ్జిక్యూటివ్ సెడాన్ సూపర్బ్ డీజిల్‌ను సంస్థ విడుదల చేసింది. దీంతో పాటు కొత్త స్లావియా, ఆక్టేవియా, ఆక్టేవియా ఆర్ఎస్ వెర్షన్‌లను ఆవిష్కరించింది. గతంలో బీఎస్–6 ఉద్గారాల నిబంధనల అమలు సమయంలో స్కోడా ఇండియా తమ డీజిల్ మోడళ్లను నిలిపివేసింది. స్లావియాను కొత్త హంగులు, అధునాతన సాంకేతికతలు, ఫీచర్లు, సౌకర్యవంతమైన ఇంటీరియర్స్‌తో నవీకరించారు. పెర్ఫార్మెన్స్ కార్లను ఇష్టపడే వారి కోసం స్పోర్ట్స్ సెడాన్ ఆక్టేవియా ఆర్ఎస్‌ను తీసుకొస్తోంది.




## కోహ్లీ సలహాతోనే నా ఆలోచనా విధానం మారింది: పీవీ సింధు



భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీతో తనకు సోదర అనుబంధం ఉందని మరోసారి తెలుగు షట్లర్ పీవీ సింధు తెలిపింది. తాజాగా ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో సింధు మాట్లాడుతూ.. విరాట్ ఇచ్చిన సలహాతోనే తన ఆలోచనా విధానం మారిందని గుర్తు చేసుకుంది. ప్రస్తుతం పీవీ సింధు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ బరిలోకి దిగింది. ఇప్పటికే తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. ''నాకు విరాట్ కోహ్లీ సోదరుడిలాంటి వారు. ఎందుకంటే నేను క్లిష్టమైన స్థితిలో ఉన్నప్పుడు ఆయనను కలిసిన సందర్భం నాకు గుర్తుంది. కోహ్లీ చాలా ఓదార్పుగా మాట్లాడారు. 'ఇప్పుడేమైంది? నీ గేమ్ నువ్వు ఆడు. ఆటోమేటిగ్గా ఫలితాలు అనుకూలంగా రావడం మొదలవుతాయి. నీ సత్తా ఏంటో నీకు తెలుసు. చాలా బాగా ట్రైనింగ్ అయిన అథ్లెట్‌వి. ప్రపంచానికి మరోసారి చాటిచెప్పు' అని స్ఫూర్తి నింపారు. ఆ సంభాషణ తర్వాత నా ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. నేను విజయం సాధించిన ప్రతిసారి కోహ్లీతో పంచుకున్నా. ఎప్పుడు కలిసినా చాలా సంతోషంగా అనిపించేది. జీవితంలో ఎంతో సాధించిన గొప్ప వ్యక్తి నుంచి వచ్చే సూచనలు కూడా చాలా విలువైనవి'' అని సింధు తెలిపింది.

# 600వ టెస్టులో భారత్ ఘన విజయం




శ్రీలంకతో తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 372 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో 165 పరుగుల తేడాతో టీమ్ఇండియా గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. మానవ్ సుతార్ ఫైఫర్ (6/55) నమోదు చేశాడు. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లలో సోనాల్ దినుష (84), ధనంజయ డిసిల్వా (59) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 6, ప్రసిద్ధ్ కృష్ణ 2.. సిరాజ్, జడేజా చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేయగా.. శ్రీలంక 284 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 193 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మానవ్ సుతార్ 10 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఇక డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ స్థానం మారనప్పటికీ.. పర్సంటేజీని మాత్రం బాగా పెంచుకుంది. ప్రస్తుతం 53.33 శాతంతో ఐదో స్థానంలో ఉంది. భారత్ ఖాతాలో 60 పాయింట్లు ఉన్నాయి.

యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మరోసారి అద్భుతం చేశాడు. ఒకే ఓవర్‌లో (76వ) మూడు వికెట్లు తీశాడు. సోనాల్ దినుష (84), ప్రభాత్ జయసూర్య (0)ను వరుస బంతుల్లో ఔట్ చేసిన అతడు.. ఓవర్ చివరి బంతికి లాహిరు కుమార (0)ను పెవిలియన్‌కు చేర్చాడు. సోనాల్ క్యాచ్‌ను స్లిప్‌లో ధ్రువ్ జురెల్ అందుకొన్నాడు. ప్రభాత్ జయసూర్య బౌల్డ్ అయ్యాడు. ఇక లాహిరు ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ పంత్ అందుకొన్నాడు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 199/9.

శ్రీలంక బ్యాటర్లు వికెట్ ఇవ్వకుండా పట్టుదల ప్రదర్శిస్తున్నారు. భారత బౌలర్లు మాత్రం శతవిధాలా ఏడో వికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. లంచ్ బ్రేక్ తర్వాత ఆరు ఓవర్ల పాటు ఆట జరిగింది. కేశర నువాంత (12★), సోనాల్ దినుష (80★) మాత్రం డిఫెన్స్ ఆడేస్తున్నారు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 72 ఓవర్లకు 194/6. భారత్ విజయానికి నాలుగు వికెట్ల దూరంలో ఉండగా.. శ్రీలంకకు 177 పరుగులు అవసరం.

శ్రీలంక – భారత్ తొలి టెస్టు ఐదో రోజు మొదటి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి శ్రీలంక 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. క్రీజ్‌లో సోనాల్ దినుష (65★), కేశర నువాంత (8★) ఉన్నారు. ఈ సెషన్‌లో భారత బౌలర్లు రెండు వికెట్లు తీయగలిగారు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (59)తోపాటు నిరోషన్ డిక్వెల్లా (10) పెవిలియన్‌కు చేరారు. మరో నాలుగు వికెట్లు తీస్తే టీమ్ఇండియాదే టెస్టు విజయం. మరోవైపు శ్రీలంకకు 197 పరుగులు అవసరం.

శ్రీలంకకు స్వల్ప వ్యవధిలోనే షాక్ తగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన పరుగులు చేసిన నిరోషన్ డిక్వెల్లా (10) పెవిలియన్‌కు చేరాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన (59.6వ ఓవర్) బంతిని షాట్ కొట్టే క్రమంలో వికెట్ కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 156 పరుగుల వద్ద శ్రీలంక ఆరో వికెట్‌ను నష్టపోయింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 61 ఓవర్లకు 160/6. క్రీజ్‌లో కేశర (1★), సోనాల్ దినుష (57★) ఉన్నారు. మరో నాలుగు వికెట్లు తీస్తే టీమ్ఇండియాదే విజయం.

దాదాపు 24 ఓవర్ల తర్వాత భారత్‌కు వికెట్ దక్కింది. కెప్టెన్ ధనంజయ (59)ను రవీంద్ర జడేజా ఔట్ చేశాడు. జడ్డూ వేసిన (55.2వ ఓవర్) బంతిని ఆడేందుకు ప్రయత్నించి మానవ్ సుతార్‌కు ధనంజయ క్యాచ్ ఇచ్చాడు. దీంతో 95 పరుగులు ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 56 ఓవర్లకు 144/5. క్రీజ్‌లో సోనాల్ (51★), డిక్వెల్లా (1★) ఉన్నారు. శ్రీలంక విజయానికి 228 పరుగులు అవసరం. భారత్ ఐదు వికెట్లు తీస్తే గెలుస్తుంది. శ్రీలంక – భారత్ జట్ల మధ్య తొలి టెస్టు ఐదో రోజు ఆట కొనసాగుతోంది. ఓవర్‌నైట్ 84/4 స్కోరుతో శ్రీలంక ఆఖరి రోజు ఆటను మొదలుపెట్టింది.

# టెస్టు విజయాలు అంత సులభంగా రావు: శుభ్‌మన్ గిల్




శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో (SL vs IND) భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా ఐదో స్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ.. విజయాల శాతాన్ని 53.33కి పెంచుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఎనిమిది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో ఆరు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి మెరుగైన అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో శ్రీలంకతో మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆట సాగిన తీరు, డబ్ల్యూటీసీ గురించి మాట్లాడాడు. ''ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడం మా అంతిమ లక్ష్యం. టెస్టు విజయాలు అంత సులభంగా రావు. ఈ గెలుపు ఎంతో ఆనందాన్నిచ్చింది. మాకు ఇది ఎంతో సంతృప్తికరమైన విజయం. మేము ఈ మ్యాచ్‌లో మెరుగైన స్థితిలోనే ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల (వర్షం వల్ల) కారణంగా మ్యాచ్ కొనసాగుతుందో లేదోనన్న ఆందోళన కలిగింది. కానీ, మా బౌలర్లు మ్యాచ్‌ను వేగంగా ముగించారు'' అని గిల్ పేర్కొన్నాడు. లంకతో తొలి టెస్టులో 10 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన యువ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పై శుభ్‌మన్ ప్రశంసలు కురిపించాడు. సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని, చాలా మంచి భవిష్యత్తు ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని పేర్కొన్నాడు. అతను చాలాకాలంపాటు భారత్‌కు ఆడగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. సెంచరీ హీరో, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దేవదత్ పడిక్కల్‌ను కూడా గిల్ ప్రశంసించాడు. ''అతని ఆట చూడముచ్చటగా ఉంది. సెంచరీలు సాధించడం ముఖ్యమే. కానీ కేవలం సెంచరీతోనే ఆగిపోకుండా అతను భారీ స్కోరు చేశాడు. పడిక్కల్ అక్కడితో సంతృప్తి చెందలేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాడు. అతను బ్యాటింగ్ చేసిన తీరు, ఆధిపత్యం ప్రదర్శించిన విధానం చూడటానికి చాలా బాగుంది'' అని భారత కెప్టెన్ విశ్లేషించాడు.

# గాలె సూపర్ హీరో మానవ్ సుతార్..

శ్రీలంకతో తొలి టెస్టులో అదరగొట్టి భారత్‌కు కీలక విజయాన్నందించాడు స్పిన్నర్ మానవ్ సుతార్. ఇటీవల అఫ్గానిస్థాన్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఈ యువ స్పిన్నర్ తొలి మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. 24 ఏళ్ల సుతార్.. ఇప్పుడు శ్రీలంక పర్యటనలోనూ ఇరగదీస్తున్నాడు. గాలెలో లంకతో జరిగిన తొలి టెస్టులో ఏకంగా 10 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక అత్యంత అనుభవజ్ఞుడైన బ్యాటర్ దినేశ్ చండీమల్ వికెట్ సహా అద్భుత (4/76) ప్రదర్శన చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో (6/55) చెలరేగిపోయాడు. మొదట్లో రెండు వికెట్లు పడగొట్టిన సుతార్.. తన చివరి 10 బంతుల్లో నాలుగు వికెట్లు తీసి మ్యాచ్‌ను ముగించేశాడు.



దీంతో మొత్తం మీద మ్యాచ్‌లో (10/131) పది వికెట్ల ఘనత అందుకున్నాడు. దీంతో హర్భజన్ సింగ్, అశ్విన్‌లను అధిగమించి శ్రీలంకలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలతో 10 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా మానవ్ సుతార్ నిలిచాడు. అంతేకాదు భజ్జీ, అశ్విన్ తర్వాత శ్రీలంకలో 10 వికెట్ల ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్‌గా ఘనత సాధించాడు. ఈ ముగ్గురూ గాలెలోనే ఈ ఘనత సాధించడం విశేషం. హర్భజన్ 2008లో (10/153), 2015లో అశ్విన్ (10/150) పది వికెట్ల ప్రదర్శన చేశారు.

# అలాంటి చర్చలు అనవసరం: దేవదత్ పడిక్కల్




భారత్ తరఫున టెస్టుల్లో దాదాపు రెండేళ్ల తర్వాత వన్‌డౌన్ బ్యాటర్ సెంచరీ కొట్టాడు. ఆ ఘనతను సాధించిన బ్యాటర్ దేవదత్ పడిక్కల్. శ్రీలంకతో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. సాయి సుదర్శన్ గైర్హాజరీలో వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. అంతకుముందు వార్మప్ మ్యాచ్‌లోనూ పడిక్కల్ శతకంతో మెరిశాడు. దీంతో మరో అద్భుతమైన వన్ డౌన్ ప్లేయర్ దొరికాడని అభిమానులు పోల్చడం మొదలు పెట్టారు. అయితే, తాను ఇలాంటి రేస్‌కు దూరంగా ఉంటా నని.. అవకాశం వచ్చినప్పుడు నిరూపించుకోవడానికి సిద్ధమని పడిక్కల్ స్పష్టం చేశాడు. ''మూడో స్థానం నాకే సుదీర్ఘం కాలం వచ్చేసినట్లు బయట చాలా చర్చ సాగుతోంది. కానీ, నాకు అలాంటివి ఇష్టం ఉండదు. ఎప్పుడు అవకాశం వచ్చినా సిద్ధంగా ఉంటా. ఎక్కడ ఆడమన్నా ఓకే. అంతేకానీ, ఎంపిక గురించి నాకెలాంటి ఆందోళన లేదు. పోటీ తీవ్రమైన వేళ ఇక్కడ ఆటే కొలమానం. మనం బాగా ఆడకపోతే జట్టులో కొనసాగడం కష్టం. క్రీడల్లోనే కాదు.. ఉద్యోగంలోనూ అంతే. సరైన ప్రదర్శన ఇవ్వకపోతే అవకాశాలు రావు. ఛాన్స్ వచ్చినప్పుడు పరుగులు చేసేందుకు వందశాతం ప్రయత్నిస్తా. అలా చేస్తే మరిన్ని మ్యాచులు ఆడొచ్చని తెలుసు'' అని పడిక్కల్ తెలిపాడు. శ్రీలంకతో మొదటి టెస్టులో (IND vs SL) దేవదత్ పడిక్కల్ 167 పరుగులు, 44 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు చేయడంలో అతడిదే కీలక పాత్ర. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొని మరీ పరుగులు రాబట్టడంతో మాజీల నుంచి ప్రశంసలు అందుకొన్నాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

# అనుకున్న సమయానికే ప్రభాస్ 'స్పిరిట్'

**వుదయం సినిమా:** ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'. ఈ సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది.ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా (SVC63) కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. "స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని క్లారిటీ ఇచ్చింది.



# 'జనవరి 12 విడుదల' టైటిల్ అనౌన్స్‌మెంట్





**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచగా, తాజాగా మేకర్స్ టైటిల్‌ను రివీల్ చేశారు. ఇప్పటివరకు #VenkyAnil5 / #NKRAR2 వర్కింగ్ టైటిల్ తో పిలుస్తున్న ఈ సినిమాకు 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. అనిల్ రావిపూడి మార్క్ ఫన్‌తో రూపొందించిన వీడియో ద్వారా టైటిల్‌ను అనౌన్స్ చేశారు.టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను లెజెండరీ దర్శకుడు ఈవీవీ సత్య నారాయణకు ట్రిబ్యూట్ ఇస్తూ, ఆయన తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని ఓ పాపులర్ కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ అనిల్ రావిపూడికి ఎంతటి ఇన్‌స్పిరేషన్ అనేది తెలిసిందే. మరోసారి తనదైన స్టైల్‌లో ఆయనపై ఉన్న అభిమానాన్ని ఈ వీడియో ద్వారా చూపించారు. ఆ తర్వాత టైటిల్ రివీల్‌కి తీసుకెళ్లిన విధానం కూడా ఆకట్టుకుంది.వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి కలిసి అనిల్ రావిపూడి దగ్గరకు వెళ్లి సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. వెంటనే అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' అని చెప్పడంతో వాళ్లంతా కన్ఫ్యూజ్ అవుతారు. తాము రిలీజ్ డేట్ గురించి కాదు.. సినిమా టైటిల్ గురించి అడుగుతున్నామని క్లారిటీ గా చెప్తారు. ఆ తర్వాత జరిగే ఫన్‌ఫుల్ కన్వర్జేషన్, కామెడీ బాంటర్‌తో వీడియో ఆద్యంతం ఎంటర్‌టైనింగ్‌గా సాగింది. చివరికి 'జనవరి 12 విడుదల' నే సినిమా టైటిల్ అని రివీల్ చేయడం ఆకట్టుకుంది.

# 'అమీర్ లోగ్'లోని ప్రతీ కారెక్టర్‌కి ప్రాముఖ్యత ఉంటుంది



వేధా జలంధర్

**వుదయం సినిమా:** 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా నటి వేధా జలంధర్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆమె చెప్పిన సంగతులివే.. **మీ జర్నీ గురించి చెప్పండి?** నేను 2019లోనే కెరీర్ ప్రారంభించాను. నేను చేసిన ఓ రెండు సినిమాలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లాయి. కానీ అవి రిలీజ్ కాలేదు. ఆ తర్వాత నేను యాక్టింగ్ కోసం థియేటర్ కూడా నేర్చుకున్నాను. యాక్టింగ్ నేర్చుకోవడం, సినిమాలు చేస్తున్న ఈ జర్నీ నాకు ఎంతో నచ్చింది.

**మీ పాత్ర ఎలా ఉంటుంది?**

'అమీర్ లోగ్' సినిమాలో నా పాత్ర పక్కింటి అమ్మాయిలా ఉంటుంది. మహిళలకు స్ఫూర్తినిచ్చేలా నా కారెక్టర్ ఉంటుంది. మా అమ్మే నాకు స్ఫూర్తి. ఈ సినిమాలోని పాత్ర కూడా అలానే ఉంటుంది. ముక్కు సూటిగా ఉండటం, ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం అనేది మా అమ్మ నుంచే నేర్చుకున్నాను. ఈ కారెక్టర్‌లో కూడా ఇలానే ఉంటాను. **'అమీర్ లోగ్' లో అవకా శం ఎలా వచ్చింది?**

'తిమ్మరాజుపల్లి టీవీ' చేసినట్టుగా మా దర్శకుడు రమణ గారికి తెలీదు. బషీర్ మాస్టర్ మాకు ఈ మూవీ ఆడిషన్స్ గురించి చెప్పారు. నేను ఆడిషన్‌కి వెళ్లాను. అక్కడ నేను బాగా పర్ఫామ్ చేయడంతో రమణ గారు వెంటనే ఓకే చెప్పారు. **ఇప్పటి వరకు 'అమీర్ లోగ్' చూసిన వారు మీకు ఇచ్చిన కాంప్లిమెంట్స్ ఏంటి?** 'అమీర్ లోగ్' సినిమా చూసిన వారంతా నా పాత్ర గురించి మాట్లాడుకుంటారు. నా వర్క్ అందరికీ నచ్చుతోంది. నేను చేసింది ఒకటి, రెండు సినిమాలే అయినా అందరూ నన్ను గుర్తు పడుతున్నారు. పాత్రకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలే చేయాలని అనుకుంటున్నాను. అందుకే ఆచితూచి పాత్రల్ని ఎంచుకుంటున్నాను. **'అమీర్ లోగ్' చిత్రంలో బిర్యానీ గురించే ఎక్కువగా ఉంటుందట?** 'అమీర్ లోగ్' సినిమాలో బిర్యానీది మెయిన్ పాత్ర అని చెప్పొకోవచ్చు. కథలో ఆ ఎలిమెంట్ బాగా కుదిరింది. మా చిత్రం అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది.

**సింక్ సౌండ్‌తో వర్క్ చేయడం గురించి చెప్పండి?**

నేను ఇది వరకే సింక్ సౌండ్‌తో ఓ ఫీచర్ ఫిల్మ్‌కి చేశాను. మనం ఎంత ప్రొఫెషనల్‌గా ఉన్నా.. చుట్టు పక్కల ఉన్న సౌండ్స్ కూడా రికార్డ్ అవుతుంటాయి. సెట్‌లో చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఈ చిత్రానికి అందరూ అద్భుతంగా సహకరించారు. బస్తీ వాళ్లు కూడా మాకు ఎంతో సపోర్ట్ చేశారు. రమణ గారి అత్త గారి ఏరియానే కాబట్టి మరింత ఎక్కువగా సహకరించారు (నవ్వుతూ).

**ఆరేళ్లలో ఒకటి, రెండు చిత్రాలే బయటకు వచ్చాయన్న బాధ ఏమైనా ఉందా?**


ఎన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి అనే నంబర్ కంటే.. మనల్ని ఆడియెన్స్ ఎంతలా యాక్సెప్ట్ చేశారు.. ఎలాంటి పాత్రల్ని ఎంచుకుంటున్నాం అనేదే ముఖ్యం అని నేను భావిస్తాను.

# "ది మేజ్" నుంచి రివర్స్ టీజర్

**వుదయం సినిమా:** తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, ప్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరి కొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ రోజు "ది మేజ్" సినిమా నుంచి రివర్స్ టీజర్ రిలీజ్ చేశారు. తొలిసారి రివర్స్ టీజర్ తో ఒక సరికొత్త ప్రయ త్నం చేసి ఆకట్టుకుంటున్నారు ఈ చిత్ర దర్శక నిర్మాతలు."ది మేజ్" సినిమా రివర్స్ టీజర్ ఎలా ఉందో చూస్తే – 'కన్ను మూసి తెరిచే సరికి ఈ ప్రపంచం అతన్ని గతాన్ని మాయం చేసింది..; అతను మాత్రమే నమ్మే నిజాన్ని కలగా మార్చేసింది...' అని చెబుతూ ఆసక్తికరంగా టీజర్ ప్రారంభమవుతుంది. నిద్రలో నుంచి ఉలిక్కి పడి లేచిన హీరో మదిలో అనేక సంఘటనలు మెదులుతుంటాయి. ఎవరూ నమ్మని, తను మాత్రమే నమ్మే కొన్ని నిజాలు, వాటి రుజువుల కోసం అతను అన్వేషణ సాగిస్తుం టాడు. కొంతమంది వ్యక్తులను వెంబడిస్తుంటాడు. హీరో భ్రమపడుతున్నాడని ఇతరులు అనుకున్నవి నిజంగా భ్రమలేనా ?, లేక హీరో బలంగా నమ్మినట్లు వాస్తవాలా ? ఈ సందిగ్ధ పరిస్థితులకు కారణం ఎవరు?, ఈ ప్రయాణంలో హీరోను నమ్మి వెనక అండగా ఎవరు నిలబడ్డారు? అతను ఎలా గాయపడ్డాడు? హత్యల్ని ఆపే హోమిసైడ్ ఇంటర్వెన్షన్ టీమ్ ఎవరి కోసం ఇన్వెస్టిగేషన్ చేస్తోంది? వంటి అంశాలు టీజర్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి. టీజర్ చివరలో హీరోను పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్తుండటం మరింత ఆసక్తి రేపుతోంది. టీజర్ చివరి సీన్ తప్ప మొత్తం రివర్స్ లో ఉండటం ఒక సరికొత్త ప్రయత్నంగా చెప్పవచ్చు.



# 'ఇరుముడి' కి చాలా నేషనల్ అవార్డ్స్ వస్తాయి..



సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్

**వుదయం సినిమా:** సెట్టర్ మూవీ అవుతుంది. 'విక్రమార్కుడు' తర్వాత రవితేజ గారి సినిమాల్లో నా ఫేవరెట్ ఇరుముడి: సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం గ్లింప్స్, ట్రైలర్, పాటలతో ఇప్పటికే భారీ అంచనాలు రేకెత్తించింది. ఆగస్టు 21న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎమోషన్స్, యాక్షన్‌తో కూడిన డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించబోతుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **ఇరుముడి సినిమాకి మ్యూజిక్ చేయడం మీకు ఎంత ప్రత్యేకంగా అనిపించింది?**

–నేను ప్రేమ కథలు, కమర్షియల్ సినిమాలు చాలా చేశాను. ఇరుముడి మాత్రం చాలా ఇంటెన్స్ థ్రిల్లర్. **ఇరుముడి సినిమాకి మ్యూజిక్ చేయడం మీకు ఎంత ప్రత్యేకంగా అనిపించింది?** –నేను ప్రేమ కథలు, కమర్షియల్ సినిమాలు చాలా చేశాను. **ఈ సినిమా మ్యూజిక్ విషయంలో ఎలాంటి అప్రోచ్ తీసుకున్నారు?**


–ఈ సినిమా మ్యూజిక్ నాకు చాలా స్పెషల్. ఇందులో ప్రతిదీ సైకలాజికల్‌గా ఉంటుంది. మనం ఒకటి ఊహిస్తాము కానీ వేరే మలుపు వస్తుంది.

**రవితేజ గారి నుంచి మీరు అందుకున్న అప్రిషియేషన్ ఏంటి?**

–పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. మ్యూజిక్ విషయంలో రవితేజ గారు చాలా హ్యాపీగా ఉన్నారు. క్లైమాక్స్‌లో చేసిన పాట ఆయనకి చాలా నచ్చింది.

# సూర్యప్రతాప్ కాంబో క్రేజీ మూవీ నుంచి సంగీత్ శోభన్ బర్త్ డే స్పెషల్ పోస్టర్

**వుదయం సినిమా:** మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీస్ తో యూత్ ఆడియెన్స్ లో తనకుంటూ ఓ స్పెషల్ ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, వరుస హిట్స్ అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని, టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ కాంబోలో ఓ క్రేజీ మూవీ తెరకెక్కుతోంది. సరికొత్త ట్రెండీ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఈ సినిమాలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.3 గా నిర్మాణమవుతున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు హీరో సంగీత్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మారుతి అనే పాత్రలో సంగీత్ శోభన్ నటిస్తున్నారు. బర్త్ డే పోస్టర్ చూస్తే – బుట్టలో ఆకుకూరలు తీసుకొస్తూ మిడిల్ క్లాస్ అబ్బాయి లుక్ లో సంగీత్ శోభన్ కనిపిస్తున్నారు.



# ప్రొడక్షన్ నెం.1 క్రేజీ మైథాలజీ థ్రిల్లర్ గ్రాండ్ గా లాంచ్



**వుదయం సినిమా:** నిధి అగర్వాల్ హీరోయిన్ గా వరాహ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కనున్న కొత్త చిత్రాన్ని ఈరోజు గ్రాండ్‌గా లాంచ్ చేశారు.మైథాలజీ థ్రిల్లర్ గా తెరకెక్కనున్న చిత్రానికి సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు.సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీ. అశోక్, పీ. రేణుక కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హుర్మత్ సర్నా క్లాప్ ఇచ్చారు. హీరోయిన్ నిధి అగర్వాల్ తోపాటు చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. పోస్టర్‌లో నిధి అగర్వాల్ లుక్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఇప్పటివరకు ఆమె కనిపించని కొత్త అవతార్‌ను పరిచయం చేసేలా ఉంది.హీరోయిన్ ఓరియంటెడ్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం దర్శకుడు పవర్ఫుల్ కథ ని సిద్ధం చేశారు.ఈ సినిమా టైటిల్‌తో పాటు మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# 'మోడ్రన్ మిస్సమ్మ' ఫస్ట్ సింగిల్ లాంచ్

**వుదయం సినిమా:** లాస్య అండ్ మిధున క్రియేషన్స్ బ్యానర్‌పై చిరంజీవి పమిడి, శివ పమిడి, కిరణ్ కుమార్ నల్లూరి, స్రవంతి నంబూరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష నర్రా, తన్మయి ఖుషి, సిజు ఏఆర్, ప్రమోదిని, హారిక, డా.భద్రం, శివన్నారాయణ, రాకేష్ రాచకొండ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి శేషు రాజ్



దడ్డాల, విజయ్ పిడపా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఆదిత్య పాపిశెట్టి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, బాలకృష్ణ కొరియోగ్రఫీ చేస్తున్నారు. హరికృష్ణ జగురోతి స్క్రిప్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తున్నారు. సోమేష్ ఎరిపల్లి వీఎఫ్ఎక్స్ డైరెక్టర్‌గా, జి. పవన్ కళ్యాణ్ సౌండ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి ఉప్పుతొల్ల బాబు (బాబీ) ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.బుధవారం ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా విడుదల చేశారు. సంగీత దర్శకుడు గోపీ సుందర్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కిట్టు విస్సప్రగడ ఆకట్టుకునే సాహిత్యం అందించారు. 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అంటూ సాగిన పాటలో హీరో సంప్రదాయ పంచెకట్టులో కనిపిస్తుండగా, హీరోయిన్ తన్మయి ట్రెడిషనల్ డ్రెస్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. హీరోయిన్ పెళ్లి వద్దంటూ పాడుకునే ఈ పాట మహిళకు కనెక్ట్ చేసేలా ఉంటుంది.ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన 'వదల' చిత్ర నిర్మాత కిశోర్ నాయుడు మాట్లాడుతూ .."రీసెంట్‌గా ఈ సినిమా ప్రీమియర్ చూశా. సినిమా చూసేటప్పుడు నేను లోపాలు మాత్రమే వెతుకుతాను. కానీ ఇందులో ఏ ఒక్కటి దొరకలేదు. ఖచ్చితంగా ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా ఇందులోని భద్రం పాత్ర చాలా హిలేరియస్‌గా ఉంటుంది' అని అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.